www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 183

శుక్రవారం | 18-10-2024 | పేజీలు: 14

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ. 1.16 తదుపరి విదియ; నక్షత్రం: అశ్విని మ. 1.26 తదుపరి భరణి; వర్జ్యం: ఉ. 9.55-11.19, రా. 9.58-10.23; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.17, మ. 12.23-1.09; అమృతఘడియలు: ఉ. 7.06-8.30; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.47

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సిఫారసు లేఖ ప్రతిని జస్టిస్ సంజీవ్ ఖన్నాకు అందిస్తున్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

2

## తదుపరి సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సిఫారసు

వచ్చే నెల 10తో చంద్రచూడ్ పదవీకాలం పూర్తి.. ఆ తర్వాత 6 నెలలు పదవిలో ఖన్నా

ఎమర్జెన్సీలో సంచలన తీర్పులు ఇచ్చిన జస్టిస్ హన్స్‌రాజ్ మేనల్లుడు సంజీవ్ ఖన్నా

తండ్రి జస్టిస్ దేవ్‌రాజ్ కూడా రిటైర్డు జడ్జే..

ఈవీఎంలు, ఎన్నికల బాండ్లు, 370 రద్దు తదితర కేసుల్లో జస్టిస్ సంజీవ్ తీర్పులు




గురువారం చండీగఢ్‌లో జరిగిన ఎన్డీయే ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో కేంద్ర మంత్రులు నడ్డా, రాజ్‌నాథ్, అమిత్ షా, ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, షిండే తదితరులు

# కలిసికట్టుగా వికసిత్ భారత్

కెప్టెన్‌లా కృషి చేస్తున్న ప్రధాని మోదీ.. మనందరం అండగా నిలుద్దాం

పేదరిక నిర్మూలనకు తొలి ప్రాధాన్యం.. కీలకంగా నదుల అనుసంధానం

సాంకేతికతతో చౌకగా వైద్యం.. ఎన్డీయే సీఎంల భేటీలో బాబు ప్రసంగం

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే సర్కారు అమలు చేస్తున్న మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, స్కిల్ ఇండియా కార్యక్రమాలు దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాసంతోపాటు... భారత శక్తిని చాటి చెబుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్'కు ప్రధాని మోదీని కెప్టెన్‌గా అభివర్ణించారు. "మోదీ ఒక కెప్టెన్‌గా తన ఆలోచనలతో వికసిత్ భారత్ 2047 కోసం అడుగులు వేస్తున్నారు. ఆయనకు అండగా నిలుద్దాం. అంతా కలిసి భారతదేశాన్ని మరింత వికసిత్ భారత్‌గా మార్చుదాం" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. గురువారం చండీగఢ్‌లో

మిగతా 2వ పేజీలో...

### వ్యతిరేక శక్తులను ఓడిద్దాం!

పేదలకు సాధికారతే కర్తవ్యం

ఎన్డీయే భేటీలో ప్రధాని మోదీ

వచ్చే ఏడాది 'రాజ్యాంగ అమృత మహోత్సవం'

వేడుకగా వాజపేయి శతజయంతి

హరియాణాలో ప్రత్యేక భేటీ

చంద్రబాబుకు కీలక ప్రాధాన్యం

# సూపర్ 6 — 2 ఫిక్స్!



## 3 నెలల్లో తల్లికి వందనం

## మార్చి, ఏప్రిల్‌లో అన్నదాతా సుఖీభవ

జనవరిలో తల్లుల ఖాతాల్లో నిధులు

ఎందరు పిల్లలున్నా ఒక్కరికే జగన్ 'అమ్మ ఒడి'

నేడు అందరు పిల్లలకూ పథకం అమలు

నాడు రూ.2 వేలు కోత పెట్టి 13 వేలే పంపిణీ

నేడు విద్యార్థులందరికీ ఇస్తామని బాబు హామీ

తల్లికి వందనం కోసం 12 వేల కోట్లు అవసరం

'అన్నదాతా సుఖీభవ'పై ఇప్పటికే కసరత్తు

పకడ్బందీ విధి విధానాలతో అమలు

ఆర్థిక కష్టాలు.. అడ్డగోలు అప్పులకు దూరం

అయినా కీలక పథకాల అమలుకు సై

'సూపర్ సిక్స్'లోని మరో రెండు పథకాల అమలుకు ముహూర్తం కుదిరింది. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి శ్రీకారం చుడుతుండగా... 'తల్లికి వందనం' మరో మూడు నెలల్లో అమలు చేయనున్నారు. 'అన్నదాతా సుఖీభవ' నిధులు మార్చి, ఏప్రిల్‌లో రైతులకు అందనున్నాయి.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'జూన్ వచ్చింది... పోయింది! ఇంకా తల్లికి వందనం పథకం అమలు కాలేదు' అని ఎదురు చూపులు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు శుభవార్త! 'సూపర్ సిక్స్'లో కీలకమైన ఈ పథకం కింద వచ్చే ఏడాది జనవరిలో తల్లులకు కాసులు అందనున్నాయి. పాఠశాలలకు, జూనియర్ కాలేజీలకు వెళ్లే విద్యార్థుల తల్లులందరికీ ఈ పథకం కింద లబ్ధి చేకూరనుంది. ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15వేల చొప్పున అందించనుంది. అలాగే... రైతులకు ఏటా రూ.20వేల చొప్పున లబ్ధి చేకూర్చే 'అన్నదాతా సుఖీభవ' పథకాన్ని వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో ప్రారంభించనున్నారు. 'చదువుకునే పిల్లలందరికీ... ఇంట్లో ఎంతమంది చదువుతుంటే

మిగతా 13వ పేజీలో...

## 'సాములోరి'పై సీఎం ఫైర్

ఫైలు తిప్పి పంపడంపై ఆగ్రహం

భూకేటాయింపు రద్దుకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

విశాఖ శారదా పీఠానికి జగన్ సర్కారు హయాంలో జరిగిన భూ కేటాయింపు 'రద్దు'పై జరుగుతున్న తాత్సారం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. భూకేటాయింపు రద్దు చేయాలంటూ రెవెన్యూ శాఖ ప్రతిపాదించిన ఫైలును తిరిగి తెప్పించుకోవాలని సీఎస్

మిగతా 13వ పేజీలో...

### శ్వేతపత్రాలపై ఏం చేశారు?

ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై వివరాలివ్వండి

ఆయా శాఖలను నివేదిక కోరిన సీఎం చంద్రబాబు

13

## అస్సాం శరణార్థులకు పౌరసత్వం సరైనదే



సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధమే

స్పష్టంచేసిన సుప్రీంకోర్టు

4:1 మెజారిటీతో తీర్పు

ఆ సెక్షన్ దుర్వినియోగమవుతోందని విడిగా జస్టిస్ పార్థివాలా తీర్పు

సుప్రీం తీర్పుపై 'ఆసు' హర్షం

న్యూఢిల్లీ, అక్టోబరు 17: శరణార్థులుగా అస్సాంకు తరలి వచ్చిన వారికి భారత పౌరసత్వాన్ని కల్పించే పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం అక్రమ వలసలకు 'అస్సాం ఒప్పందం' ద్వారానే రాజకీయ

మిగతా 2వ పేజీలో...

## మిస్ ఇండియా నిఖిత



ఎంపీ యువతికి కిరీటం

2

### బుకింగ్ సమయం 60 రోజులే

రైల్వే రిజర్వేషన్ నిబంధనల్లో మార్పు

నవంబరు 1నుంచి అమలులోకి..

12



నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలో పొంగి ప్రవహిస్తున్న వాగు

# తీరం దాటింది

వాయుగుండంతో పెనుముప్పు తప్పింది

కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు

పలుచోట్ల భారీ నుంచి అతి భారీగా..

మరో 4 రోజులపాటు వర్షాలు

12

22న మరో అల్పపీడనం

ఉత్తర కోస్తాకు తుఫాన్ ముప్పు?

ఒడిశా, ఉత్తర కోస్తా దిశగా రాక

రెండు రోజుల్లో మరింత స్పష్టత

## వైసీపీ నేతలు ఆదేశిస్తేనే తిట్టా!



అండగా మేముంటాం... దళితుడివి..

మంచి భవిష్యత్తు ఉంటుందంటే దూషించా

కానీ ఇప్పుడు ఒక్కరూ పరామర్శకు రాలేదు

తిట్టినవాళ్లను కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరతా

అప్రూవర్‌గా మారతా.. పోలీసుల వద్ద కన్నీరుపెట్టుకున్న బోరుగడ్డ అనిల్

13

రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు



## మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోవడానికైనా సిద్ధం

13

అబద్ధాలు చెప్పం..

నెరవేర్చలేని హామీలు ఇవ్వం

పార్టీ నేతల రాష్ట్రస్థాయి భేటీలో జగన్ వ్యాఖ్యలు

# టీడీపీ కార్యాలయంపై దాడి తప్పు కాదట!

సజ్జల అడ్డగోలు సమర్థన

పట్టాభి తిట్లు విన్నాక రక్తం మరిగింది

టీడీపీ ఆఫీసుపై మా వాళ్లు దాడి చేశారు

ఆ రోజు నేను లేను.. బద్వేల్‌లో ఉన్నా

సెల్‌ఫోన్ ఇవ్వను.. ఇది అప్పటిది కాదు

పోలీసు విచారణలో సజ్జల జవాబులు

గంటన్నరపాటు విచారణ.. 38 ప్రశ్నలు

తెలియదు.. గుర్తులేదంటూ సమాధానాలు

నాటి సుద్దులేవి సజ్జల?



అమరావతి/మంగళగిరి సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో తెలుగుదేశం కార్యాలయంపై వైసీపీ మూకలు పట్టపగలు చేసిన దాడిని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి అడ్డగోలుగా సమర్థించారు. 'అది తప్పని నేను అనను' అని పోలీసు విచారణలోనే చెప్పినట్లు సమాచారం. "ఆ రోజు జగన్‌ను తిట్టడంతో రక్తం మరిగింది.. ఆ ఉద్రేకంలోనే మా వాళ్లు దాడి చేశారు. అది తప్పని నేను అనలేను. టీడీపీ ఆఫీసుపై దాడి జరిగిన రోజు నేను ఇక్కడ లేను" అని సజ్జల మంగళగిరి పోలీసుల విచారణలో వెల్లడించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో

మిగతా 13వ పేజీలో...



## వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడం టీడీపీతోనే సాధ్యం

టీడీపీ హయాంలోనే దీనిపై శాస్త్రీయ అధ్యయనం

వైసీపీ అధికారంలోకి వచ్చి దానిని నాశనం చేసింది: మంత్రి సవిత

అనంతలో ఘనంగా రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలు



అనంతపురంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత. చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

12

# హరియాణా సీఎంగా సైనీ ప్రమాణం

- మొత్తం 13 మంది మంత్రులుగా ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్



చండీగఢ్, అక్టోబరు 17: హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం చేశారు. పంచ్‌కులాలోని దసరా మైదానంలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో గవర్నర్ బండారు దత్తాత్రేయ.. సైనీతో పాటు మరో 13 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర కేంద్ర మంత్రులు, బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా, బీజేపీని వరుసగా మూడోసారి గెలిపించడంలో కీలకపాత్ర పోషించడంతో సైనీకి అధిష్ఠానం రెండోసారి సీఎంగా అవకాశమిచ్చింది. 54 ఏళ్ల సైనీ ఓబీసీ కావ డం కూడా కలిసొచ్చింది. 90 స్థానాలున్న హరియాణా అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ 48 నియోజకవర్గాల్లో గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించింది. మరోవైపు.. సైనీ ప్రమాణ కార్యక్రమాన్ని అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎన్నికైన ప్రభుత్వాన్ని ప్రమాణం చేయకుండా అడ్డుకోమనడమేంటని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది.

## జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై విచారణ జరుపుతాం: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు17: జమ్మూ-కశ్మీర్‌కు నిర్ణీత వ్యవధిలో రాష్ట్ర హోదా పునరుద్ధరించాలన్న అంశంపై విచారణ జరుపుతామని గురువారం సుప్రీంకోర్టు తెలిపింది. దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ చేసిన వినతికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన 370 అధికరణం రద్దును సమర్థిస్తూ గత ఏడాది డిసెంబరులో తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని సూచించింది. అది ఇంకా అమలు కాలేదని ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది చెప్పడంతో విచారణ జరుపుతామని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

## వెంకట్రామిరెడ్డీ... దిగిపో

- మీ వల్ల ఉద్యోగుల ప్రయోజనాలకు విఘాతం
- ముక్తకంఠంతో సర్వసభ్య సమావేశం డిమాండ్
- పదవి వీడేదే లేదు: వెంకట్రామిరెడ్డి



అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర సచివాలయంలో మొదటిసారిగా అప్సా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఉద్యోగులందరూ ముక్తకంఠంతో అప్సా ప్రస్తుత అధ్యక్షుడు, వైసీపీకి వీరవిధేయుడు, జగన్‌కి పరమభక్తుడైన కె.వెంకట్రామిరెడ్డిని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి దాదాపు 400 మంది ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సమావేశంలో అప్సా సభ్యులందరూ ఏకకంఠంతో తమ డిమాండ్‌ను వినిపించారు. 'ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యవర్గం రాజీనామా చేయాలి. ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేయాలి. తద్వారా ఉద్యోగులకు మేలు జరుగుతుంది. వైసీపీకి కార్యకర్తలా పనిచేసిన వెంకట్రామిరెడ్డి అప్సా అధ్యక్షుడిగా ఉండడం వల్ల మా సమస్యలను ప్రస్తుత ప్రభుత్వానికి నివేదించలేకపోతున్నారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసమైనా అధ్యక్ష పదవికి వెంకట్రామిరెడ్డి రాజీనామా చేయాలి. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం వల్ల మాకు ఏ ప్రయోజనాలు దక్కలేదు. కనీసం జీతం కూడా సరైన సమయానికి రాలేదు. కొత్త కార్యవర్గం ఎన్నికైతే కనీసం ఇప్పుడైనా మాకు రావాల్సిన ప్రయోజనాలు అందుతాయని ఆశిస్తున్నాం. వెంకట్రామిరెడ్డి మొండి వైఖరి వల్ల ఎన్నో దశాబ్దాల చరిత్ర గల అప్సా ఉనికికే ముప్పు ఏర్పడింది. రోసా నిబంధనల ప్రకారం అసోసియేషన్ రద్దుకు ప్రభుత్వం ఫైలు పెట్టింది. అప్సాను రక్షించుకోవడం కోసం మేమంతా ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చి అసోసియేషన్ రద్దుకాకుండా ప్రస్తుతానికి ఆపగలిగాం. దీనంతటికీ కారణమైన వెంకట్రామిరెడ్డి తక్షణమే రాజీనామా చేయాలి' అంటూ సభ్యులు గట్టిగా డిమాండ్ చేశారు. వారి వాదనను కొట్టిపారేసిన వెంకట్రామిరెడ్డి... '2029లో కూడా ఈ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని అనుకుంటున్నారా? మీ డిమాండ్‌కు తలొగ్గేదే లేదు. పదవీకాలం పూర్తయ్యేవరకు వైదొలగే ప్రసక్తే లేదు' అని స్పష్టం చేశారు. అప్సా కార్యదర్శి శ్రీకృష్ణ మాత్రం పదవికి రాజీనామా చేస్తున్నట్టు సమావేశంలోనే ప్రకటించారు. వెంకట్రామిరెడ్డి వైఖరి నేపథ్యంలో ఉద్యోగులందరూ... 'అప్సా ఉనికే ముఖ్యం. వెంకట్రామిరెడ్డి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంతకాలు సేకరించాలి. దానిని ప్రభుత్వానికి అందజేయాల'ని నిర్ణయించారు.

## నేడు టీడీఎల్పీ భేటీ

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష సమావేశం శుక్రవారం మంగళగిరిలో జరగనుంది. ఈ సమావేశంలో ఎనిమిది అంశాలను చర్చించనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. 125 రోజుల్లో 125 విజయాలు సాధించిన మంచి ప్రభుత్వం, పూటకో అబద్ధం.. రోజుకో కుట్ర చేస్తున్న జగన్ ముఠా, టీడీపీ మెంబర్ షిప్ డ్రైవ్, పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం - పల్లె పండుగ, సూపర్ - 6 పాలసీలు రాష్ట్ర అభివృద్ధికి బాటలు, శాండ్, లిక్కర్ పాలసీలు - వైసీపీ దుష్ప్రచారం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు - ఓటర్ల నమోదు, సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు, ప్రజాప్రతినిధులతో ముఖాముఖి... సమావేశం అజెండాగా పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## బెట్టింగ్ యాప్ స్కాంలో తమన్నాను ప్రశ్నించిన ఈడీ

గువాహటి, అక్టోబరు 17: మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం కేసులో నటి తమన్నా భాటియాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) అధికారులు ప్రశ్నించారు. తల్లితో కలిసి గువాహటి ఈడీ కార్యాలయానికి చేరుకున్న తమన్నాను ఈడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. మహదేవ్ బెట్టింగ్ యాప్ ద్వారా వందల కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ యాప్ ద్వారా ఐపీఎల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ మ్యాచ్‌లకు సంబంధించి బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వహించారు. సామాన్యులను ఆకర్షించేందుకు సినీతారలతో ప్రమోట్ చేయించారు. మొత్తం 17 మంది బాలీవుడ్ ప్రముఖులపై 2023 సెప్టెంబర్ నుంచి అధికారుల నిఘా కొనసాగుతోంది.

## అస్సాం శరణార్థులకు పౌరసత్వం సరైనదే!

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ.. సదరు ఒప్పందంలో భాగంగానే పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6ఏను పొందుపరిచిన విషయాన్ని ప్రస్తావించింది. సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. 1966 జనవరి 1-1971 మార్చి 25 మధ్య కాలంలో అస్సాంకు అక్రమంగా వలస వచ్చిన వారికి భారత పౌరసత్వాన్ని కల్పించే సెక్షన్ 6ఏ సరైనదేనని, దీనిని తీసుకొచ్చే అధికారం పార్లమెంటుకు ఉందని ధర్మాసనం తెలిపింది. ఈ మేరకు పిటిషన్లను కొట్టివేస్తూ 4:1 మెజారిటీతో తీర్పును వెలువరించింది. ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ జేబీ పార్దీవాలా.. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ విడిగా తీర్పును వెలువరించారు. నకిలీ పత్రాలు, సాక్ష్యాధారాలు సమర్పించి భారత పౌరసత్వం పొందటానికి ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తుందన్నారు. కాగా, సీజేఐ చంద్రచూడ్ తీర్పును వినిపిస్తూ.. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే అస్సాంలో అక్రమ వలసలు ఎక్కువన్నారు. దీనికి కారణం, ఆ రాష్ట్రం భౌగోళికంగా చిన్నది కావటంతోపాటు, అక్రమ వలసదారుల్ని గుర్తించటం అక్కడ కష్టతరంగా మారటమేనని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును చరిత్రాత్మకమైనదిగా 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' అభివర్ణించింది. సహేతుక కారణాలతో అస్సాం ఉద్యమం జరిగిందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పినట్లయ్యిందని పేర్కొంది. అయితే, సెక్షన్ 6ఏను వ్యతిరేకిస్తూ తొలిసారిగా పిటిషన్ దాఖలు చేసిన ఆసు మాజీ నేత మతియుర్ రెహమాన్.. సుప్రీంకోర్టు తీర్పు వల్ల స్థానిక మూలవాసుల ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. అక్రమ వలసదారుల కేంద్రంగా అస్సాం మారటం దురదృష్టకరమని చెప్పారు. 1985లో రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు కేంద్రానికి, ఆసుకు మధ్య ఒప్పందం కుదిరింది. దీంట్లో భాగంగానే, పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ సెక్షన్ 6ఏను ప్రవేశపెట్టారు. బంగ్లాదేశ్ నుంచి అస్సాంకు అక్రమంగా వలస వచ్చిన వారికి ఈ చట్టం ప్రకారం పౌరసత్వం కల్పిస్తున్నారు.



## 'ఫెమినా మిస్ ఇండియా - 2024'గా నిఖితా పోర్వాల్

- మధ్యప్రదేశ్‌కు చెందిన యువతికి కిరీటం
- రన్నరప్‌గా రేఖా పాండే

ముంబై, అక్టోబరు 17: 'ఫెమినా మిస్ ఇండియా- 2024' కిరీటాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన నిఖితా పోర్వాల్ దక్కించుకున్నారు. బుధవారం ముంబైలోని ఫేమస్ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో ఆమెను విజేతగా ప్రకటించారు. 60వ మిస్ ఇండియా విజేతగా నిలిచిన నిఖితా పోర్వాల్ స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని. ఈ ఏడాది జరిగే ప్రపంచ అందాల పోటీల్లో భారత్ తరుఫున నిఖిత ప్రాతినిధ్యం వహించనున్నారు. దాద్రా నగర్ హవేలీకి చెందిన రేఖా పాండే మొదటి రన్నరప్‌గా, గుజరాత్‌కు చెందిన ఆయుశీ ధోలాకియా రెండో రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది విజేత నందిని గుప్తా నిఖితకు మిస్ ఇండియా కిరీటాన్ని అందించారు. ఈ సందర్భంగా నిఖితా పోర్వాల్ మాట్లాడుతూ "ఇప్పుడు నేను అనుభవిస్తున్న ఆనందాన్ని వర్ణించలేను. నా తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూసి గర్వంగా ఉంది. నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. సాధించవల్సిన విజయాలు చాలా ఉన్నాయి" అని పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు తదుపరి సీజేఐగా

# జస్టిస్ సంజీవ్ ఖన్నా!

- సిఫారసు చేసిన సుప్రీం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తన వారసుడి పేరును ప్రకటించారు. తదుపరి చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన సిఫారసు చేశారు. వచ్చేనెల 10వ తేదీన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం ముగియనుంది. దిగిపోయే ముందు సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తి పేరును చీఫ్ జస్టిస్ పదవికి సిఫారసు చేయడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని అనుసరించి బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రతిపాదిస్తూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ చంద్రచూడ్ లేఖ రాశారు. అనంతరం.. కేంద్ర న్యాయశాఖ ప్రధాన మంత్రి పరిశీలనకు పంపుతుంది. ప్రధాని ఆమోదం తర్వాత రాష్ట్రపతి సిఫారసుకు పంపుతారు. చివరిగా రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియ పూర్తవుతుంది. కేంద్ర ప్రభుత్వం స్థాయిలో లాంఛనాలు సజావుగా పూర్తయితే జస్టిస్ సంజీవ్ ఖన్నా సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబరు 11వ తేదీన బాధ్యతలు తీసుకుంటారు. ఆరు నెలలకు అటుఇటుగా, అంటే వచ్చే ఏడాది మే 13వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. జస్టిస్ చంద్రచూడ్ తర్వాత సీనియారిటీలో రెండోస్థానంలో ఉన్న ఆయన.. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు తొమ్మిదిన సీజేఐగా జస్టిస్ ఎన్వీ రమణ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

### ఎవరీ ఖన్నా?

ఎమర్జెన్సీ కాలంలో గుర్తుండే అనేక తీర్పులు రాసిన సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా మేనల్లుడే జస్టిస్ సంజీవ్ ఖన్నా. రాజ్యాంగానికి ఎన్ని సవరణలు ప్రతిపాదించినా, దాని మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చడానికి వీల్లేదంటూ 1973లో కేశవానంద భారతీ కేసులో చరిత్రాత్మక తీర్పును ఇచ్చిన న్యాయమూర్తుల ధర్మాసనంలో ఆయన ఒకరు. ఎమర్జెన్సీ అమలులో ఉండగా, అన్ని హక్కులతోపాటు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ కూడా రద్దయి పోతాయంటూ.. ఏడీఎమ్ జబల్‌పూర్ కేసులో సుప్రీంకోర్టు 1976లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు రాసిన ధర్మాసనంలోని మెజారిటీ జడ్జీలతో విభేదించి, వేరుగా తీర్పు రాసిన ఒకే ఒక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా. దీంతో సీనియారిటీ రీత్యా చీఫ్‌జస్టిస్ కావాల్సిన ఆయనను, ఆ పదవి చేపట్టకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంది. దీనికి నిరసనగా ఆయన సర్వీసు ఉండగానే తన పదవికి రాజీనామా చేశారు. జస్టిస్ ఖన్నాకు అలా ఆనాడు చేజారిన ఆ పదవిని ఆయన బంధువు జస్టిస్ సంజీవ్ ఖన్నా త్వరలో చేపడుతుండటం విశేషం. ఆయన తండ్రి జస్టిస్ దేవ్‌రాజ్ ఖన్నా కూడా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించడం మరో విశేషం. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, తన మేనమామ జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా పనిచేసిన అదే కోర్టు గది నుంచి తన మొదటి రోజును జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రారంభించారు. ఆయన 1960 మే 14వ తేదీన జన్మించారు. ఢిల్లీలోని బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేశాడు. ఢిల్లీ యూనివర్సిటీలోని లా సెంటరు క్యాంపస్‌లో 1980లో చదువు పూర్తి చేసుకున్నారు. తన పేరును 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్ జిల్లా కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. అనంతరం ఢిల్లీ హైకోర్టు, ట్రైబ్యునల్స్‌లో రాజ్యాంగ, ప్రత్యక్ష పన్నులు, మధ్యవర్తిత్వం వంటి విభిన్న రంగాల్లో ప్రాక్టీస్ చేశారు. అలాగే.. కమర్షియల్ లా, కంపెనీ లా, ల్యాండ్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా వంటి రంగాల్లో ప్రాక్టీస్‌తో పాటు ఆదాయపు పన్ను శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. 2004లో ఢిల్లీ ప్రభుత్వంలో నేషనల్ కేపిటల్ టెర్రిటరీకి స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టులో అనేక క్రిమినల్ కేసుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా పనిచేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులయి, ఏడాది తర్వాత శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2019 జనవరి 18న నియమితులయ్యారు.



### ఈవీఎంలపై కీలక తీర్పు..

ఎన్నికల నిర్వహణకు వాడుతున్న ఈవీఎంలపై తలెత్తిన భయసందేహాలను తొలగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా కీలక తీర్పును వెలువరించారు. 'ఈవీఎం యంత్రాలు చెల్లుతాయి. అవి భద్రమే'నని తేల్చి చెప్పారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం, బోగస్ ఓటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలు ఈవీఎంల రాకతో ఆగాయని అప్పట్లో ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల బాండ్ల అంశంపై తీర్పును ఇచ్చిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఒకరు. బాండ్ల జారీని రాజ్యాంగ విరుద్ధంగా అప్పట్లో బెంచ్ తేల్చేసింది. అలాగే, జమ్మూకశ్మీర్‌కు ఉద్దేశించిన అధికరణం 370ను రద్దు చేస్తూ 2019లో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు రాసిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఉన్నారు. అయితే.. ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా మాత్రం తన తీర్పును సొంతంగా చెప్పారు. సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ కలిసి ఒక తీర్పు వెలువరించగా.. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా మరో రెండు తీర్పులను వెలువరించారు. జమ్మూకశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనల అంశాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా తన తీర్పులో ప్రస్తావించారు. ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో అరెస్టు అయిన అప్పటి సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడానికి వీలుగా మధ్యంతర బెయిల్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా మంజూరు చేశారు.

## లోకం తీరు




## కాటేసిన కల్తీ మద్యం!

- బిహార్‌లో ఒక్కరోజే 20 మంది మృతి
- 4 రోజుల్లో మొత్తం 36 మరణాలు..
- మరో 40 మంది పరిస్థితి విషమం

పట్నా, అక్టోబరు 17: సంపూర్ణ మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో కల్తీ మద్యం రక్కసి మరోసారి కోరలు చాచింది.. గురువారం ఒక్కరోజే 20 మంది మరణించగా.. నాలుగు రోజుల్లో మొత్తం 36 మంది మృతి చెందారు. మరో 40 మంది పరిస్థితి విషమంగా ఉంది. వీరిలో కొందరు కంటి చూపు కూడా కోల్పోయారు. సివాన్, సారణ్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో కల్తీ మద్యం తాగిన కొందరు తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. వారిని కుటుంబ సభ్యులు సమీప ఆస్పత్రులకు తరలించగా.. పరిస్థితి విషమించి నాలుగు రోజుల్లో ఒక్కొక్కరుగా మొత్తం 36 మంది ప్రాణాలు విడిచారు. ఈ ఘటనపై డీజీపీ అలోక్ రాజ్ మాట్లాడుతూ.. కల్తీ మద్యం కారణంగా మొత్తం 25 మంది మరణించినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న 12 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు, కల్తీ మద్యం మరణాలపై సీఎం నీతీశ్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందజేయడంతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సీఎంవో పేర్కొంది. కాగా, కల్తీ మద్యాన్ని అరికట్టడంలో బిహార్ సర్కారు విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. బిహార్ ప్రభుత్వాన్ని అవకాశవాద డబుల్ ఇంజన్ సర్కారుగా అభివర్ణించిన ఆయన.. మరణాలకు వారే బాధ్యులని ఆరోపించారు. 'కల్తీ మద్యం వల్ల 36 మంది మృతి చెందడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి.. దోషులను శిక్షించాలి' అని 'ఎక్స్'లో డిమాండ్ చేశారు.

# వ్యతిరేక శక్తులను ఓడిద్దాం!

- పేదలకు సాధికారతే కర్తవ్యం
- ఎన్డీయే భేటీలో ప్రధాని మోదీ
- వచ్చే ఏడాది 'రాజ్యాంగ అమృత మహోత్సవం'
- వేడుకగా వాజపేయి శతజయంతి
- హరియాణాలో ప్రత్యేక సమావేశం
- చంద్రబాబుకు కీలక ప్రాధాన్యం
- ఆయన సూచన మేరకే భేటీ ఏర్పాటు

న్యూఢిల్లీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించే దిశగా కలిసికట్టుగా కృషి చేయాలని, కూటమి వ్యతిరేక శక్తులను ఓడించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే తీర్మానించింది. రాజ్యాంగాన్ని ఆమోదించి వచ్చే ఏడాది 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 'సంవిధాన్ కీ అమృత మహోత్సవ్'ను జరుపుకోవాలని నిర్ణయించింది. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నాడు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిని ప్రజలకు వివరించాలని, వాజపేయి శతజయంతితోపాటు సర్దార్ పటేల్, బిర్సా ముండా 150వ జయంతిని కూడా జరుపుకోవాలని నిర్ణయించింది. గురువారం చండీగఢ్‌లో హరియాణా నూతన ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం తర్వాత జరిగిన ఎన్డీయే పాలిత ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సుపరిపాలనతో పాటు ప్రజల జీవితాలను మెరుగుపరచడంపై తాము విస్తృతంగా చర్చించినట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. వాజపేయి హయాంలో కశ్మీర్‌లో జరిగిన ఎన్డీయే సమావేశం తర్వాత మళ్లీ అలాంటి సమావేశం జరగడం ఇదే మొదటి సారని తెలిపారు. ఆర్థిక సంస్కరణల వల్ల పేదలకు లబ్ధి జరుగుతుందని, అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఎన్డీయే ఆనాడే గుర్తించిందని, అదే అమలు అవుతోందని మోదీ అన్నారు.

### బాబు సూచన మేరకే...

హరియాణా ఎన్నికల్లో విజయం సాధించినందుకు మోదీని ఈ సమావేశంలో కూటమి నేతలు అభినందించారు. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎన్డీయే విజయానికి తోడ్పడాలని సమావేశం తీర్మానించింది. కాగా, హరియాణా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎన్డీయే సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన సూచన మేరకే ఈ భేటీ జరిగినట్లు తెలిసింది. ఈ సమావేశంలో చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పక్కనే ఆయనకు స్థానం కేటాయించారు. ఈ భేటీలో బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన 13 మంది ముఖ్యమంత్రులు, 16 మంది ఉప ముఖ్యమంత్రులతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బిహార్, సిక్కిం, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన ఎన్డీయే ముఖ్యమంత్రులు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

# కలిసికట్టుగా వికసిత్ భారత్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. ఈభేటీలో ప్రధానంగా 'వికసిత్ భారత్'పై చర్చించారు. పేదరిక నిర్మూలన, ఉద్యోగాల కల్పన, తక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి, నదుల అనుసంధానం, నైపుణ్యం పెంపు తదితర అంశాలపై చంద్రబాబు తన ఆలోచనలను పంచుకున్నారు. "గతిశక్తి, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియాలాంటి కార్యక్రమాల ద్వారా దేశం గణనీయమైన పురోగతి సాధించింది. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో చేరువయ్యాయి. 'జామ్' (జన్‌ధన్, ఆధార్, మొబైల్)కు నైపుణ్యాన్ని (స్కిల్) కూడా జోడించి జామ్స్‌గా మార్చాలి. దీనిద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు" అని చంద్రబాబు పేర్కొన్నారు. తొలుత పేదరిక నిర్మూలనపై దృష్టి పెట్టాలని... రెండో దశలో అసమానతల తగ్గింపుకోసం ప్రయత్నం చేయాలని సూచించారు. ఆర్థికంగా అగ్రభాగంలో ఉన్న 10 శాతం మంది - అట్టడుగున ఉన్న 20 శాతం జనాభాకు చేయూతనిచ్చేందుకు ముందుకు రావాలన్నారు. ఈ విధానం ద్వారా పేదరిక నిర్మూలన జరుగుతుందని అభిప్రాయపడ్డారు.



ఎన్డీయే సమావేశంలో మోదీతో డిప్యూటీ సీఎం పవన్, సీఎం చంద్రబాబు

### ప్రైవేటు భాగస్వామ్యంతో...

ఓడరేవులు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ పార్కులు, అంతర్గత జల మార్గాలు, రైల్వేలు, ఫ్రైట్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు మొదలైన రంగాల్లో ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో త్వరగా ఫలితాలు సాధించవచ్చునని చంద్రబాబు పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా ఇంధన రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. తద్వారా చమురు దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరముండదని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులకు అందించాలన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'డెమోగ్రఫిక్ మేనేజ్‌మెంట్'ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. డేటా అనలిటిక్స్, ఏఐ, రోబోటిక్స్ వాడకంతో రోగ నిర్ధారణ, ఆరోగ్య సేవల ఖర్చును భారీగా తగ్గించవచ్చన్నారు. ప్రజలు మరోసారి మోదీ నాయకత్వంపై విశ్వాసం ఉంచారనేందుకు హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్‌లలోనూ ఎన్డీయే కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నేటి దాకా మోదీ కీ ఓటమే లేదని అన్నారు.

### మోదీ ప్రశంసలు...

చంద్రబాబు సూచనలు, ప్రతిపాదనలను పలువురు సీఎంలు, ప్రధాని మోదీ అభినందించారు. కొన్ని అంశాలను ఆ తర్వాత మోదీ చేసిన ప్రసంగంలో ప్రస్తావించారు. గతంలో కశ్మీర్‌లో జరిగిన ఎన్డీయే మీటింగ్‌లో తాను, చంద్రబాబు అప్పటి ప్రధాని వాజపేయికి చెప్పిన వివరాలను మోదీ గుర్తు చేశారు. సంస్కరణలతో పేదలకు లబ్ధి జరుగుతుందని... అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని నాడు తాము చెప్పామని మోదీ అన్నారు.

## కెనడాలో ఇదీ భారతీయం

### అక్కడ ప్రవాసులది ప్రధాన పాత్ర
### పలు రంగాల్లో బలమైన ప్రభావం

(సెంట్రల్ డెస్క్)

వైశాల్యం పరంగా ప్రపంచంలో రెండో అతిపెద్ద దేశం కెనడా.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్..! ఖలిస్థానీ మద్దతుదారు నిజ్జర్ హత్య నేపథ్యంలో ప్రస్తుతం ఈ రెండింటి మధ్య తీవ్ర స్థాయి దౌత్య యుద్ధం జరుగుతోంది. అయితే, దీన్ని పక్కనపెడితే కెనడాలో భారతీయులది బలమైన సమాజం. పలు రంగాల్లో మనవారు స్థిరపడ్డారు. ఆ వివరాలు గణాంకాల్లో..

**27%** — కెనడాలోని శాశ్వత నివాసితుల్లో భారతీయులు. కెనడా పీఆర్ స్కీంలో మనవారే ప్రధాన లబ్ధిదారులు.

**22%** — గత ఏడాది కెనడా వెళ్లిన తాత్కాలిక విదేశీ కార్మికుల్లో భారతీయులు. రెండో అత్యధికం వీరే.

**45%** — విదేశీ విద్యార్థుల్లో భారతీయులు. మరే దేశం నుంచి ఈ స్థాయిలో విద్యార్థులు లేరు.

**28 లక్షలు:** కెనడాలోని భారతీయులు. వీరిలో ప్రవాసులు, భారత సంతతివారూ ఉన్నారు. ప్రపంచంలో భారతీయులు అధికంగా ఉన్న నాలుగో దేశం. ఇందులో 18 లక్షలు భారత సంతతివారు. 10 లక్షల మంది ప్రవాసులు.

**8.30 లక్షలు:** కెనడాలోని హిందువులు. 7.70 లక్షలు: సిక్కులు

**6:** వాంకోవర్, టొరంటో, మాంట్రియల్, విన్నీ పెగ్, ఒట్టావా (ఒంటారియో), కాల్గారి (అల్బెర్టా). ప్రవాసులు అధికంగా నివసించే ప్రాంతాలు.



- 20 ఏళ్లలో కెనడాలో భారతీయుల సంఖ్య రెట్టింపును మించింది.
- 1980 వరకు భారత్‌లో పుట్టి కెనడా వెళ్లినవారు 63,535. 1991-2000 మధ్యన ఈ సంఖ్య 1.45 లక్షలు. 2006-10 నడుమ 1.19 లక్షలు. 2016-21 మధ్య 2.46 లక్షలు.
- **ఐదేళ్లలో డబుల్:** 2019లో కెనడాలోని భారతీయ విద్యార్థుల సంఖ్య 2.18 లక్షలు కాగా, ప్రస్తుతం 4.27 లక్షలు.
- **పౌరసత్వంలో పైపైకి..:** కెనడా పౌరులుగా మారుతున్న భారతీయుల సంఖ్య ఏటా భారీగా పెరుగుతోంది. ఈ శాతం 2017లో 44.3 కాగా.. 2021లో 61.1 శాతం.
- అక్కడ మన వారి జాబ్ ప్రొఫైల్ కూడా బాగుంటోంది. మెరుగు పడుతోంది కూడా. ప్రవాసుల్లో 50 శాతం మంది డిగ్రీ హోదాతో కూడిన ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తమ్మీద కార్యనిర్వాహక (మేనేజీరియల్) పోస్టుల్లో 10 శాతం లోపే ఉన్నారు. అయితే, ఇటీవల వెళ్లినవారిలో 19శాతం మంది ఈ పోస్టులు పొందారు.
- భారత్‌కు పప్పు ధాన్యాలు అత్యధికంగా ఎగుమతి చేస్తున్న దేశం కెనడా.
- భారత్ నుంచి బంగారు ఆభరణాలు, విలువైన వజ్రాలు, ఫార్మా ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తులు అధికంగా కెనడాకు ఎగుమతి అవుతుంటాయి.
- **600 పైనే:** భారత్‌లో ఉన్న కెనడాకు చెందిన కంపెనీలు. వీటిలో టిమ్ హర్టన్స్ కాఫీ చైన్, శీతల ఆహార పదార్థాల సంస్థ మెక్ కెయిన్ కూడా ఉన్నాయి. 75 బిలియన్ అమెరికా డాలర్లకు పైగా కెనడియన్ పింఛను నిధులను భారత్‌లో పెట్టుబడులు పెట్టారు.


జస్టిస్ అంబటి లక్ష్మణరావు (ఫైల్)

## జస్టిస్ అంబటి లక్ష్మణరావు మృతి

- విశ్రాంత జీవితంలో మద్యంపై పోరాటం
- స్వగ్రామం వెల్లలూరు అభివృద్ధికి విశేష కృషి
- హైదరాబాద్‌లో కన్నుమూత... నేడు అంత్యక్రియలు!

పొన్నూరుటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన అంబటి లక్ష్మణరావు గురువారం హైదరాబాద్‌లో మృతి చెందారు. అంబటి లక్ష్మణరావు స్వస్థలం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామం. జనవరి 14, 1934లో జన్మించిన అంబటి లక్ష్మణరావు 1959లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. హైకోర్టు న్యాయవాదిగా సుదీర్ఘకాలం పనిచేసిన లక్ష్మణరావు... లేబర్ కోర్టు, ఇండస్ట్రీయల్ ట్రిబ్యునల్స్ తోపాటు పారిశ్రామిక సంస్థలకు సంబంధించిన కార్మిక వ్యవహారాలు వంటి పలు కేసులను పరిష్కరించారు. 1982 డిసెంబరు 10న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఫిబ్రవరి 24, 1995లో అల్హాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అదే ఏడాది 10న అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు. 1996లో పదవీ విరమణ చేసిన జస్టిస్ అంబటి లక్ష్మణరావు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి తొమ్మిది సంవత్సరాల నుంచి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. స్వగ్రామంపై మమకారంతో వెల్లలూరుకు తరుచూ వస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేశారు. కక్షలు, కార్పణ్యాలకు కారణం మద్యమేనని గుర్తించి వెల్లలూరులో మద్యం నిషేధానికి పాటుపడ్డారు. అంతే కాకుండా ప్రధాన రహదారులపై మద్యం షాపులు తొలగించాలని ఉద్యమం చేశారు. అంబటి లక్ష్మణరావు సోదరుని కుమారుడు అంబటి తిరుపతి రాయుడు అంతర్జాతీయ క్రికెటర్‌గా రాణించాడు. అంబటి లక్ష్మణరావు ఆకస్మిక మృతితో స్వగ్రామం వెల్లలూరులో విషాద ఛాయలు అలముకున్నాయి. హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు జరుగుతాయని గ్రామవాసులు తెలిపారు.

## 11 లోపు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

- ఇంటర్ విద్యామండలి ప్రకటన

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజుల చెల్లింపులపై ఇంటర్ విద్యామండలి తేదీలు ప్రకటించింది. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 21 నుంచి నవంబరు 11 వరకు ఫీజులు చెల్లించవచ్చని ఆ మండలి కార్యదర్శి కృతికా శుక్లా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.వెయ్యి అపరాధ రుసుముతో నవంబరు 12 నుంచి 20వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ ఫస్టియర్, సెకెండియర్ చదువుతున్న రెగ్యులర్ విద్యార్థులు, గతంలో ఫెయిలైన వారు, ఒకేషనల్ విద్యార్థులు, ప్రైవేటు అభ్యర్థులు ఇవి వర్తిస్తుందని వివరించారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు థియరీ పేపర్లకు రూ.600, ప్రాక్టికల్స్‌కు రూ.275, బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు రూ.165, బ్రిడ్జి కోర్సుల ప్రాక్టికల్స్‌కు రూ.165 ఫీజు చెల్లించాలని తెలిపారు.

అణు విద్యుత్ ఉత్పత్తిలో, అణ్వాయుధాల తయారీలో ఉపయోగించే యురేనియం పేరు చెబితే కర్నూలులోని పల్లెలు ఉలిక్కి పడుతున్నాయి. ఇక్కడి కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో యురేనియం నిక్షేపాలు సర్వే కోసం బోర్ల తవ్వకాలకు అనుమతులు వచ్చాయనే సమాచారం వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ప్రమాదకరమైన ఆ రసాయన మూలకం తవ్వకంతో తమ ప్రాణాలకే ముప్పు వస్తుందని, పచ్చని పల్లెలు విషపు కోరల్లో చిక్కుకుని విలవిల్లాడాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మా ఊళ్లలో సర్వేలు వద్దు.. తవ్వకాలు వద్దు.. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అడ్డుకుంటామని తెగేసి చెబుతున్నారు.


కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలోని అటవీ భూములు

# యురేనియం అలజడి..!

- కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో పొంచి ఉన్న 'అణు'ముప్పు
- అన్ని అనుమతులతో తవ్వకాలకు సిద్ధమవుతున్న యూసీఐఎల్
- ఎట్టిపరిస్థితుల్లోనూ తవ్వకాలను అడ్డుకుంటామంటున్న స్థానికులు


కప్పట్రాళ్ల గ్రామం

కర్నూలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రమాదకరమైన రసాయన మూలకం యురేనియం. నేల పొరల్లోంచి తవ్వి తీయడమంటే మృత్యువును నెత్తికెత్తుకున్నట్లే. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచానికి ఈ అణు ధార్మిక పదార్థం ఎంత ప్రమాదకరమైనదో తెలిసివచ్చి అనేక దేశాల్లో అణు విద్యుత్ ప్లాంట్లు మూసేశారు. కానీ మన ప్రభుత్వాలు మాత్రం యురేనియం తవ్వుతున్నాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం నిల్వల నిగ్గుతేల్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండీ) 68 బోర్ల తవ్వకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా దీనికి కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆదోని రేంజ్ పత్తికొండ సెక్షన్ పరిధిలోని కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ పరిధిలో 468.25 హెక్టార్ల అటవీ శాఖకు చెందిన భూములు ఉన్నాయి. కౌలుట్లయ్య మలగా పిలిచే ఈ రిజర్వు ఫారెస్ట్.. కప్పట్రాళ్ల, పి.కోటకొండ, మాదాపురం, చెల్లెలచెలిమిల, గుండ్లకొండ గ్రామాల మధ్య విస్తరించింది. ఆ కొండపైనే కౌలుట్లయ్యస్వామి ఆలయం ఉంది.

### వైసీపీ హయాంలో గుట్టుగా..

భూగర్భంలో ఎంత పరిమాణంలో యురేనియం నిల్వలు ఉన్నాయో నిర్ధారించిన తరువాతే తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. అందుకే కప్పట్రాళ్ల కేంద్రంగా యురేనియం ఎంత ఉంది? ఎలా ఉంది? ఎంత లోతులో ఉంది? తవ్వితే లాభమా.. కాదా..? వంటి వివరాలు తెలుసుకునేందుకు 68 బోర్లు డ్రిల్లింగ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. అటవీ భూముల్లో తవ్వకాలు జరపాలి కాబట్టి పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. ప్రభుత్వ రంగ సంస్థ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) అటవీ భూమి 6.80 హెక్టార్లలో 68 బోర్ వెల్స్ వేసేందుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సలహా మండలి ఆమోదం కోసం అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండీ) రీజినల్ డైరెక్టర్ ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రక్రియ అంతా కూడా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022-23 మధ్య జరిగింది. ఈ విషయం బయటకు పొక్కకుండా గుట్టుగా కొనసాగించారు. ఇప్పుడు ఈ విషయం తెలిసి ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### ఊళ్లు నాశనం అవుతాయి



మా ఊరు పక్కనే రిజర్వు ఫారెస్టు ఉంది. గతంలో యురేనియం అన్వేషణ కోసం పలు సర్వేలు చేశారు. యురేనియం తవ్వకాలు చేస్తే పచ్చని పల్లెసీమలు నాశనం అవుతాయి. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, గ్రామీణ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఎట్టి పరిస్థితుల్లో యురేనియం తవ్వకాలు జరపకుండా అడ్డుకుంటాం. మా ఊరును కాపాడుకోవడం సర్పంచ్‌గా నా బాధ్యత.

- చెన్నమ్మనాయుడు, సర్పంచి, కప్పట్రాళ్ల గ్రామం, కర్నూలు జిల్లా

### కడప బేసిన్‌లో నాడు నిరసనలు

- కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు, ప్రకాశం జిల్లా, దక్షిణ తెలంగాణలో చాలా భాగాలను జియాలజి శాస్త్రవేత్తలు కడప బేసిన్‌గా పిలుస్తారు. ఇక్కడ నాణ్యమైన యురేనియం నిక్షేపాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు.
- ఇప్పటికే కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలం తుమ్మలపల్లె, కేకే కొట్టాల, మొబ్బుచింతపల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె గ్రామాల్లో యూసీఐఎల్ 2007లో యురేనియం ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 2011 నుంచి ముడి యురేనియం వెలికితీసి శుద్ధి చేసే ప్రక్రియ మొదలైంది. యురేనియం ప్రభావంతో గాలి, నీరు, భూమి కలుషితమవుతోందని, స్థానిక ప్రజలు, పాడి పశువులు, జంతువులపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి.
- తెలంగాణ రాష్ట్రం అమ్రాబాద్ మండలం పరిధిలోని నల్లమలలో యురేనియం తవ్వకాలకు శ్రీకారం చుడితే పెద్దఎత్తున ప్రజాగ్రహం పెల్లుబుకింది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆనాడు రాజకీయ పార్టీల నాయకులతో చర్చావేదిక నిర్వహించి యురేనియం వల్ల జీవావరణానికి కలిగే నష్టంపై గళమెత్తారు.
- నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, మహానంది, రుద్రవరం మండలాల్లోని అడవుల్లో యురేనియం అన్వేషణ కోసం 2019లో బోర్లు వేయబోతే అప్పట్లో స్థానికులు అడ్డుకున్నారు. మాజీ మంత్రి అఖిలప్రియ ఆధ్వర్యంలో ఓబులంపల్లెలో అఖిలపక్ష పార్టీల సమావేశాలుపెట్టి తీవ్రంగా వ్యతిరేకించారు.

### యురేనియం తవ్వకాలతో నష్టాలు

- యురేనియం నిల్వలు అంచనా వేసేందుకు జరిపే తవ్వకాల వల్ల కప్పట్రాళ్ల అటవీ ప్రాంతం మొత్తం నాశనం అవుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. భూగర్భ జలాలు, తాగునీరు విషతుల్యం అవుతాయని స్థానికులు భయపడుతున్నారు.
- అరుదైన జీవరాసులు, వృక్షసంపద ప్రమాదంలో పడి జీవవైవిధ్యం దెబ్బతింటుంది.
- యురేనియం నుంచి వెలువడే అణుధార్మికత కారణంగా కప్పట్రాళ్ల సహా చుట్టు పక్కల గ్రామాల్లో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## మా బాదుడుకు.. మీరు సిద్ధమేనా?

- రూ. 8,114 కోట్లు సర్దుబాటుకు నేడు ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ
- జగన్ హయాంలో ఎడాపెడా కొనుగోళ్లకు ఇప్పుడు వినియోగదారుల మూల్యం

అమరావతి, అక్టోబరు 17 ( ఆంధ్రజ్యోతి ): "లాఠీ దెబ్బలు కొట్టే ముందు.. దెబ్బలు తినడం మీకు ఇష్టమేనా అని అడిగితే ఎవరైనా సమ్మతిస్తూ తలూపుతారా ?" ఈ తరహాలోనే ట్రూఅప్ భారంపై రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ ఉందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022-23 సంవత్సరానికి గాను రాష్ట్ర డిస్కమ్‌ల ఇంధన కొనుగోళ్లకు సంబంధించి రూ. 8,114 కోట్లను సర్దుబాటు కింద వసూలు చేసేందుకు ఆన్‌లైన్ విధానంలో ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టనుంది. దాదాపు ఏడాదిన్నర తర్వాత శుక్రవారం (నేడు) కర్నూలులోని ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణకు ఏపీఈఆర్‌సీ సిద్ధమైంది. ప్రతియేటా విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ ఖర్చులను ముందస్తుగా లెక్కించి.. ఆమేరకు వినియోగదారులకు విద్యుత్తు సరఫరా చేస్తామంటూ ఈఆర్‌సీ ద్వారా డిస్కంలు ఆమోదం పొందాక ఇంకా అదనపు వ్యయాలు వసూలు చేయడం ఏమిటంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు ఛార్జీల భారాన్ని తగ్గిస్తానంటూ వాగ్దానం చేసి 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్మోహనరెడ్డి.. ఛార్జీలు తగ్గించడం మాట అటుంచి, 2014-19 నాటి విద్యుత్తు కొనుగోలు వ్యత్యాసాలను ట్రూఅప్ పేరిట వినియోగదారులపై రూ. 3,669 కోట్లు భారం వేశారు. ఆరోజుతో మొదలైన ట్రూఅప్ ఛార్జీల భారం నానాటికీ పెరుగుతూ వచ్చింది. 2022-23కు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణను చేపడుతున్న ఈఆర్‌సీని.. 2023-24కు మరో రూ. 11,826 కోట్ల ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేసుకోవడానికి అనుమతిని ఇవ్వాలంటూ డిస్కమ్‌లు అభ్యర్థించాయి. దీనిపైనా త్వరలోనే ఈఆర్‌సీ ప్రజాభిప్రాయాన్ని సేకరించాల్సి ఉంది.

## డోన్ సీఐపై చర్యలు తీసుకోండి

- నంద్యాల ఎస్పీని ఆదేశించిన హోంమంత్రి అనిత

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్ మండల టీడీపీ కన్వీనర్ సలింద్ర శ్రీనివాసులపై అక్రమ కేసులు పెట్టి, దారుణంగా కొట్టిన డోన్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ బాషాపై చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్ టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హోంమంత్రి అనిత వెంటనే ఫోన్‌లో నంద్యాల జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడి సీఐపై చర్యలు తీసుకోవాలని, ప్రజలను ఇబ్బంది పెడుతున్న పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం అనిత, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేష్, తెలుగు యువత అధ్యక్షులు శ్రీరాం చినబాబులు గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించారు.

## మానస చామర్తికి ఉమ్మడిశెట్టి పురస్కారం


మానస చామర్తి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు చెందిన యువ రచయిత్రి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మానస చామర్తికి 'ఉమ్మడిశెట్టి సతీష్‌కుమార్ జాతీయ పురస్కారం-2024' లభించింది. ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ రాధేయ గురువారం ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్ఫోసిస్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్న మానస 2015లో 'పరవశ' పేరుతో రచించిన కవితా సంపుటిని పురస్కారానికి ఎంపిక చేశామని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## ఆకలి.. అవమానం!

ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం స్థానం కాస్తంత మెరుగుపడినందుకు సంతోషించాలో, పరిమాణంలోనూ, ఆర్థికంగానూ చిన్నవైన పొరుగుదేశాలతో పోల్చితే బాగా వెనుకబడి ఉన్నందుకు బాధపడాలో తెలియడం లేదు. శ్రీలంక, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్‌లు ఈ సూచీలో భారత్‌కంటే మెరుగ్గా ఉన్నాయి. 127దేశాల జాబితాలో భారత్ ప్రస్తుతం 105వ స్థానంలో ఉంది. గత ఏడాది 125దేశాల్లో 111వస్థానంలో, అంతకుముందు 107లోనూ ఉన్నందున ప్రస్తుతానికి స్థానం కాస్తంత మెరుగుపడినట్టే. కానీ, తీవ్రమైన ఆకలిబాధ చవిచూస్తున్న దేశంగా ముద్రపడటం అవమానకరం. పదేళ్ళలో దేశం అద్భుతంగా అభివృద్ధి చెందిందనీ, జీడీపీ హెచ్చిందనీ, అతిపెద్ద ఆర్థికవ్యవస్థ పరుగుపందెంలో ముందంజలో ఉన్నదని ప్రచారం చేసుకుంటున్న మన పాలకులను ఇటువంటి నివేదికలు కచ్చితంగా కలవరపెడతాయి. వాటిని విదేశీకుట్రగా ముద్రవేయడం, తప్పులతడక అంటూ తీసిపారేయడం వారికి ఎంతో సులువు.

ఆకలిబాధ ఆందోళనకర స్థాయిలో ఉన్న దేశాల్లో మనది కూడా ఒకటి. మరోలా చెప్పుకోవాలంటే, ఆ లెక్కన పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల సరసన భారత్ నిలిచింది. పోషకాహారలోపం, శిశుమరణాలు ఇత్యాది ప్రాతిపదికలమీద ఆకలిబాధను లెక్కగట్టే ఈ నివేదిక భారత్‌లో ఉన్న తీవ్రమైన పరిస్థితులను లోతుగా ప్రస్తావించింది. దాదాపు 14శాతం మంది పోషకాహారలోపాన్ని ఎదుర్కొంటున్నారు, ఐదేళ్ళలోపు పిల్లల్లో మూడోవంతుకంటే ఎక్కువమంది వయసుకు తగ్గ ఎత్తు ఎదగలేదు, సుమారు 19శాతం మంది ఎత్తుకు తగ్గబరువు లేరు. ఐదేళ్ళు నిండకుండానే కన్నుమూస్తున్న పిల్లల మూడుశాతం వరకూ ఉన్నారు. నాలుగు కీలకమైన అంశాలను తీసుకొని, పోషకాహారలోపం, శిశుమరణాలకు మూడోవంతు విలువ, మిగతా రెండింటికీ ఆరోవంతు విలువ ఇస్తూ మొత్తం స్కోరు లెక్కగట్టే ప్రక్రియలో భారత్ 27.3 పాయింట్లు దక్కించుకుంది. పోషకాహారం మాట పక్కనబెడితే, ఆహారం అందుబాటులో ఉండటమన్నది కూడా ఒక సమస్య అని ఈ నివేదిక తెలియచెబుతోంది. ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయి అప్పులకోసం వెంపర్లాడుతున్న శ్రీలంక, రాజకీయ సంక్షోభంలో మునిగిన బంగ్లాదేశ్, నలుదిక్కులా పోరాటాలతో, అంతర్యుద్ధంతో తీసుకుంటున్న మయన్మార్ వంటి దేశాలు మనకంటే ఎంతో మెరుగైన స్థానంలో ఎలా నిలవగలిగాయన్నది అసలు ప్రశ్న. పౌష్టికాహారలోపం ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య ప్రపంచస్థాయిలో కూడా పెరుగుతున్నదని, యుద్ధాలు, అంతర్యుద్ధాలు, వలసలు, వాతావరణ మార్పులు వంటివి ప్రపంచ ఆకలిసూచీ స్కోరును పెంచేస్తున్నాయని ఈ నివేదిక అంటోంది.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను భారతదేశ పాలకులు ఒప్పుకోకపోవడం కొత్తేమీ కాదు. లోపభూయిష్టమైన పద్ధతుల్లో, విధానాల్లో ఈ లెక్కలు కడుతున్నారని, కొద్దిమందిని నమూనాగా తీసుకొని, ఆకలిని దేశవ్యాప్తంగా వర్తింపచేస్తున్నారని మన ప్రభుత్వం వాదన. ఈ నివేదికలో దేశాలన్నింటికీ వర్తించిన కొలమానాలే తప్ప మనకు వేరు లెక్కలంటూ ఏమీ ఉండవు. పైగా, నివేదిక తయారీలో వాడిన వివరాలు, గణాంకాలన్నీ ప్రపంచ ఆరోగ్యసంస్థ, యునిసెఫ్ తదితర ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల నుంచి సేకరించినవో, అవి ప్రచురించిన నివేదికలనుంచి తీసుకున్నవో అవుతాయి. గత నివేదికలను ప్రభుత్వం తిరస్కరించినప్పుడు కూడా భారత ప్రభుత్వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల వంటివి ఈ చేదునిజాలను ముందే చెప్పిన విషయాన్ని విపక్షాలు, మీడియా గుర్తుచేశాయి కూడా.

గత కొన్ని దశాబ్దాలుగా భారత్ స్కోరు మెరుగుపడినప్పటికీ, దేశంలో ఇంకా ఆకలికేకలు తగ్గలేదని ఈ సూచీ చెబుతున్నది. అంతర్జాతీయ సమాజం ముందు తలవంపులు తెచ్చే ఇటువంటి నివేదికలను తిరస్కరించడానికే పాలకులు ఉత్సాహపడటం సహజం. ఒప్పుకోనంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగే సర్వేలు, వివిధ ప్రభుత్వశాఖలు సేకరించే గణాంకాలమీద ఇటీవలి కాలంలో పాలకులకు అయిష్టత పెరుగుతూ, వాటిని పూర్తిగా నిర్వహించకపోవడమో, వాయిదా వేయడమో, సర్వేలు చేపట్టినా వివరాలు బహిర్గతపరచకపోవడమో జరుగుతోంది. కానీ, ప్రజలకు ఆహారాన్ని అందించే విషయంలో ఎంతో శ్రద్ధపెడుతున్నామంటున్నవారు, ఆశించిన లక్ష్యం నెరవేరుతున్నదీ లేనిదీ తెలుసుకోక తప్పదు. జాతీయ ఆహారభద్రతాచట్టం, ప్రధానమంత్రి అన్న యోజన, మాతృవందన, పోషణ్ వంటి అనేకానేక పథకాలతో ఆకలిని ఉపశమింపచేసి, పలు కార్యక్రమాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నామన్న ప్రభుత్వం వాదనను ఆకలిసూచీలో మన స్థానం సవాలు చేస్తున్న మాట నిజం.

# అవును, ఉద్యమాలు అంతరించిపోకూడదు!

ప్రభుత్వాలకు, నిర్బంధంతో ఉద్యమాలని నిర్మూలించడం సాధ్యం కాదనే విషయాన్ని, కె. శ్రీనివాస్ రాసిన 'సందర్భం', బలమైన తర్కంతో, ఉత్తమ సహృదయంతో, శక్తివంతమైన శైలిలో, అనేక కోణాల్లో, వుంది! (ఆంధ్రజ్యోతి, అక్టోబరు 10). మావోయిస్టులు కూడా 'వివేచన'తో, '(స్వయం) విమర్శ'తో సమీక్షించుకుంటే తప్ప, 'ఉనికి సాధ్యం కాదని' చేసిన సూచన కూడా సరైనదే. అయితే, ఒక చిన్న వివరణ అవసరం: 'సందర్భం'లో ప్రస్తావించిన ఇతర ఉద్యమాలు- కాశ్మీరు, శ్రీలంక, నాగాలాండ్, మణిపూర్, ఖలిస్తాన్ వంటివి- శ్రామిక వర్గపోరాట ఉద్యమాలు కావు. వారు కోరుకునే పాలనలో, లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ వంటి 'దోపిడీ ఆదాయాలు' సురక్షితంగా వుండేవే! అవి అలా ఉండాలనే! కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అనుసరించే ఉద్యమం అలాంటి తప్పుడు ఆదాయాలకి వ్యతిరేకం! మిగతా ఉద్యమాలు 'శ్రమ దోపిడీ'కి వ్యతిరేకం కానివి.

ఈ 'సందర్భం' చదవగానే, ఇదే సమస్య మీద కొన్ని విషయాలు రాయాలనిపించింది నాకు. నిజానికి ఇక్కడ రాయబోయే విషయాలు కొత్తవేమీ కాదు. 2000 సంవత్సరంలో, పీపుల్స్‌వార్ పార్టీ వారు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలన్నప్పుడూ, 2005లో 'మళ్ళీ చర్చ'లన్నప్పుడూ, ఆ తర్వాత ఎన్నో ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడూ, నేను రాసిన కొన్ని వ్యాసాల్లో చెప్పినవే, ఇప్పుడు చెప్పబోయేవి! అసలు, అవి ఆనాడు నా స్వంతం కాదు సుమా! శ్రామిక ఉద్యమాల విషయాలలో, కమ్యూనిస్టులు ఏ రకపు అవగాహనతో వుండాలో, మార్క్సు-ఎంగెల్సులు చెప్పిన సూచనలనే, నేను తెలుసుకున్న వాటిని, గుర్తు చేశాను. ఇప్పుడు, దండకారణ్యంలోని మావోయిస్టులు గానీ, మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇతర కమ్యూనిస్టు గ్రూపుల వారు గానీ, ఆలోచించవలిసిన సూచనలు కొన్ని వున్నాయి:



**శ్రామిక వర్గ ఉద్యమకారుల్ని 'అస్త్ర సన్యాసం' చెయ్యమని కె. శ్రీనివాస్ చెప్పడం లేదు. ఉద్యమాలు నడపవలిసిందే! కార్మిక వర్గం, సంస్థాపరంగా పురోగమించి వుండకపోతే, పాలకవర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా కార్మికులలో నిరంతరం ప్రచారం చేస్తూ, వారికి శిక్షణ ఇచ్చితీరాలనీ, లేకపోతే, వారు పాలకవర్గాల చేతిలో ఆటవస్తువులుగా మారతారని, గతంలో, కార్మిక వర్గ నాయకులకు మార్క్సు చేసిన సూచనను ఏ క్షణమూ మరిచిపోకూడదు!**

(1) 1871లో, 'పారిస్ కమ్యూన్' పోరాటాన్ని, అక్కడి పాలకవర్గాలు రక్తపుటేరుల్లో ముంచినపుడు, మార్క్సు ఒక విషయం చెపుతాడు. 'వర్గ పోరాటంలో, శ్రామికవర్గం వివిధ దశల గుండా నడవాలనీ', 'మరల మరల ఎదురు దెబ్బలూ, అడ్డంకులూ కలుగుతాయనీ'- అంటాడు. కాబట్టి, శ్రామిక వర్గపు ప్రతినిధులుగా కమ్యూనిస్టులు కూడా, ఎంతటి క్రూర నిర్బంధాలు వున్నా నిలబడ్డారు, నిలబడతారు! (2) 'సోషలిజం అనేది ఒక సైన్స్' అయిందనీ, దానిని సైన్స్‌గా అధ్యయనం చేసి, కార్మిక జనాలలో వ్యాపింపజేయడం నాయకుల కర్తవ్యం అనీ, ఎంగెల్సు తన కాలపు కమ్యూనిస్టులకు చేసిన సూచన నించీ ఇప్పటి కమ్యూనిస్టులు నేర్చుకోవాలి! వాళ్ళు నేర్చుకుంటేనే, దానిని, వర్గచైతన్యం లేని శ్రామిక జనాలకు నేర్పగలరు. మార్క్సు ఒక చోట చెప్పినట్టు, 'నేర్పేవాడు తప్పనిసరిగా నేర్చుకు తీరాలి'. ('ఎడ్యుకేటర్ మస్ట్ బి ఎడ్యుకేటెడ్'). 'కాపిటల్' వంటి శ్రామికవర్గ సిద్ధాంత రచనను, అన్ని భాషలలోకీ అనువదించి వ్యాప్తి చెయ్యాలని, ఆనాటి 'అంతర్జాతీయ కార్మిక సంస్థ' చేసిన తీర్మానాన్ని గుర్తు చేసుకోవాలి. ఎందుకంటే, సిద్ధాంతం అనేది, జనాలకు అర్థమైతే, అది ఒక భౌతిక శక్తిగా మారుతుందంటాడు మార్క్సు.

(3) వర్గ చైతన్యం లేని శ్రామిక జనాలకు, అతి కొద్దిమంది చైతన్యవంతులైన వారు మాత్రమే నాయకత్వం వహించి విప్లవ పోరాటాలు చేసే కాలం గతించిందనీ, శ్రామిక జనాలు తమంతట తాము వర్గపోరాటాలలో వుండితీరాలనీ, తన కాలపు 'అరాచకవాద' ఉద్యమకారులను ఉద్దేశించి, ఎంగెల్సు చెప్పిన మాటలు తమకు ఎంత వరకూ వర్తిస్తాయో ఉద్యమాలలో వున్న కమ్యూనిస్టులు స్వయం విమర్శ చేసుకోవాలి. (4) దళాలు చేసే ఆకస్మిక దాడుల్నే విప్లవ కార్యాచరణగా భ్రమించకూడదు. శత్రువు మీద కొన్ని దాడులు చేసి, విప్లవోద్యమం 'శరవేగం'తో పురోగమిస్తున్నదని భ్రమించకూడదు. (5) సిద్ధాంత గ్నానం లేకుండా, మిలిటెన్సీ పేరుతో, దూకుడుగా వుండేవారిని పార్టీలలో చేర్చుకుంటే, వాళ్ళు పార్టీకే హాని చేసిన సందర్భాలు వున్నాయి. అనుభవాల నించీ నేర్చుకోవాలి. నయీం, కత్తుల సమ్మయ్య, జడల నాగరాజు, వంటి వారి ఉదంతాలను ఎన్నో చదివాం, వార్తల్లో అప్పట్లో. (6) తగిన జాగ్రత్తలు తీసుకోవాలే గానీ, ఇన్ఫార్మర్లనే అనుమానంతో, తోటివారినో, సాధారణ ప్రజలనో, చిత్రవధలు చేయడం, చంపడం జరగకూడదు. ఒంటరిగా కనిపించే పోలీసుల్నో, పాలకవర్గ ప్రతినిధుల్నో, వర్గ శత్రువు అనే పేరుతో కిడ్నాప్ చేయడం, 'ఖతం' చేయడం వంటి కార్యక్రమాలు ఉండకూడదు! 'నూతన సమాజం' కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే కమ్యూనిస్టులు చెయ్యాల్సిన పనులు కావు అవి. అనాదిగా, పాలకవర్గాలూ, వాటి ప్రభుత్వ బలగాలూ చేస్తున్న క్రూర చర్యల వంటివే అవి.

(7) దేశంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమలలో, రవాణా రంగంలో, కోట్లాది మంది శ్రామిక జనాలకు వర్గ సంఘాలు ('క్లాస్ ఆర్గనైజేషన్స్') లేవు. అలాగే, వేరు వేరు స్థితిగతుల నించి వచ్చే స్త్రీలూ, విద్యార్థులూ, టీచర్లూ, ప్రభుత్వ ఉద్యోగులూ వంటి వారిని ప్రజా సంఘాలలోకి ('మాస్ ఆర్గనైజేషన్స్') సమీకరించడం చాలా అవసరం! అవేవీ సరిగా లేకపోవడం వల్ల, బూటకపు ఎన్‌కౌంటర్లు ఎన్ని జరిగినా, ప్రజలకి పట్టడం లేదు. (8) శ్రీనివాస్ గారు శ్రామిక వర్గ ఉద్యమకారుల్ని 'అస్త్ర సన్యాసం' చెయ్యమని చెప్పడం లేదు. ఉద్యమాలు నడపవలిసిందే! కొందరు చెపుతున్నట్టు, దోపిడీ రాజ్యాంగ ఎన్నికల నాటకాలు, వర్గ ఉద్యమకారులకు మార్గం కాదు. కానీ, 'సాయుధ పోరాటమే ఏకైక మార్గం' అనే యాంత్రిక అవగాహనతో, 'ఉన్నదొక్కటే దారి! చారూమజుందారీ' అన్నట్టు తక్షణ కార్యక్రమాలు ఉండకూడదు. కార్మిక వర్గం, సంస్థాపరంగా పురోగమించి వుండకపోతే, పాలకవర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా కార్మికులలో నిరంతరం ప్రచారం చేస్తూ, వారికి శిక్షణ ఇచ్చితీరాలనీ, లేకపోతే, వారు పాలకవర్గాల చేతిలో ఆటవస్తువులుగా మారతారని, గతంలో, కార్మిక వర్గ నాయకులకు మార్క్సు చేసిన సూచనను ఏ క్షణమూ మరిచిపోకూడదు!

● రంగనాయకమ్మ


# మోదీజీ, హిమాలయాల ఘోష వినరా?

హిమాలయ ప్రాంతాల, ప్రజల అభివృద్ధి విషయమై మనకు ఒక సమగ్ర విధానం ఉన్నదా? స్వాతంత్ర్య తొలి దశాబ్దంలోనే సమగ్ర 'హిమాలయన్ విధానం' భారత్‌కు అవసరం అని డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా నొక్కి చెప్పారు ఇంజినీర్, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ నేతృత్వంలో లేహ్ నుంచి న్యూఢిల్లీకి లద్దాఖ్ వాసుల చరిత్రాత్మక పాదయాత్ర ప్రస్తుత పాలకులకు లోహియా డిమాండ్‌ను గుర్తుచేసేందుకు తోడ్పడవచ్చు. భారత్, చైనా సరిహద్దుల్లోని భారత పౌరులు నెల రోజుల పాటు 1000 కిలోమీటర్లు నడిచి తమ జాతీయ రాజధానికి చేరుకున్నప్పుడు వారు చెప్పదలుచుకున్నది వినడం దేశ పాలకుల కనీస ధర్మం కాదూ? అయితే జరిగిందేమిటి? ఢిల్లీలో హఠాత్తుగా సెక్షన్ 144 విధించి, వందల మైళ్ల దూరం నడిచి వచ్చిన లద్దాఖ్ ప్రజలను చట్టబద్ధమైన కారణం లేకుండానే నిర్బంధించారు. గాంధేయ పద్ధతుల్లో నిరసన దీక్ష నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారు. లద్దాఖ్ భవన్‌లో నిర్బంధితులు అయిన సోనమ్ వాంగ్ చుక్ అక్కడే నిరసన దీక్ష ప్రారంభించి కొనసాగిస్తున్నారు. తమకు సంఘీభావంగా దీక్షలో పాల్గొనాలని ఇతరులను వాంగ్ చుక్ ఆహ్వానిస్తే పోలీసులు ఆయన మద్దతుదారులపై విరుచుకుపడి పలువురిని నిర్బంధించారు. లద్దాఖ్ పౌర సమాజ సమూహాలు అయిన లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబి), కార్గిల్ డెమొక్రాటిక్ అలయెన్స్ (కెడిఏ) ఆధ్వర్యంలో లద్దాఖీలు ఎన్నో నెలలుగా ఆందోళన చేస్తున్నారు. అయినా వారి సమస్యలు, డిమాండ్లను విశాల భారతావని పట్టించుకోవడమే లేదు.

ఇటీవలి కాలంలో హిమాలయన్ ప్రాంతాలలో సంభవించిన వివిధ ఘటనలపై మనం సుసంగతమైన అవగాహన పెంపొందించుకోవల్సిన అవసరమున్నది. లద్దాఖ్‌లో పెల్లుబికిన ప్రజల నిరసన వాటిలో ఒకటి మాత్రమే. ఇతర ఘటనలు: అధికరణ 370 రద్దు అనంతరం కశ్మీర్‌లో సంభవిస్తున్న పరిణామాలు, ఉత్తరాఖండ్‌లో భారీ భూపాతాలు, నేపాల్‌లో ప్రభుత్వం మార్పు, సిక్కింలో వెల్లువెత్తిన ఆకస్మిక వరదలు, చైనాకు భూటాన్ సన్నిహితమవడం, అసోంలో ఎన్ఆర్‌సి కల్లోలం, మణిపూర్‌లో అంతర్యుద్ధం మొదలైనవి. ఈ ఉపద్రవాలు అన్నిటినీ మనం సమగ్ర, నిష్పాక్షిక దృక్పథంతో అర్థం చేసుకోవాలి. మరి మనం వాటిని భౌమ రాజకీయ, అంతర్గత భద్రత, ప్రాకృతిక విపత్తు, జాతుల వైరంకు సంబంధించిన ఘటనలుగా భావిస్తున్నాం. అయితే హిమాలయ ప్రాంతాలు, రాజ్యాల మధ్య పరస్పర సంబంధాలు, అవి ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక సమగ్ర దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఏడు దశాబ్దాల క్రితమే డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా విజ్ఞప్తి చేశారు. పశ్చిమాన ఉన్న పఖ్తూనిస్తాన్ నుంచి తూర్పున ఉన్న బర్మా దాకా విశాల హిమాలయ పర్వత సీమలలోని వివిధ ప్రాంతాల, ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక పరిపూర్ణ ప్రజాస్వామిక దృక్పథాన్ని అనుసరించాల్సిన అవసరమున్నదని లోహియా స్పష్టం చేశారు.

స్వతంత్ర భారతదేశానికి తొలినాళ్లలోనే చైనా విస్తరణవాదం నుంచి ముప్పు వాటిల్లిన నేపథ్యంలో హిమాలయన్ విధాన రాజకీయ కోణాలకు లోహియా ప్రాధాన్యమిచ్చారు. భారత్‌కు ఎదురవుతున్న బాహ్య, అంతర్గత సవాళ్లు ఎలా ముడివడి ఉన్నదీ ఆయన విశ్లేషించారు. భారత్ లోపల, బయట హిమాలయన్ ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం ఆయన నిలబడ్డారు. టిబెట్, నేపాల్ పాలకులకు వ్యతిరేకంగా ఆయా దేశాల ప్రజలు చేస్తున్న పోరాటాలకు భారత్ మద్దతునివ్వాలని ఆయన ప్రతిపాదించారు. కశ్మీర్, నాగాలాండ్ తిరుగుబాటుదారులతో ప్రజాస్వామిక చర్చలు జరపాలని ఆయన వాదించారు. ఈశాన్య భారత రాష్ట్రాలలో ఆదివాసీలు, ఆదివాసీయేతరులను సామాజికంగా, భౌతికంగా వేర్వేరుగా ఉంచాలన్న వెర్రియర్ ఎల్విన్ ప్రతిపాదిత గిరిజన విధానాన్ని లోహియా తీవ్రంగా వ్యతిరేకించారు.

హిమాలయన్ విధానంపై లోహియా దార్శనికత ఆ ప్రాంత ప్రజల మధ్య బహుళ సమైక్యతలను ఆకాంక్షించింది. అవి: హిమాలయన్ ప్రాంతంలోని వివిధ దేశాలలో నివసిస్తున్న ప్రజల మధ్య ఐకమత్యం, భారతదేశ పౌరులతో ఇరుగు పొరుగు దేశాల ప్రజల ఏకత్వం; హిమాలయ ప్రాంతాల సంస్కృతులు, సమాజాలు, విశాల భారతావనిలోని వివిధ సమాజాల, సంస్కృతుల మధ్య సమైక్యతను ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. హిమాలయ ప్రాంతం పట్ల లోహియా వలే శ్రద్ధాసక్తులు, సహానుభూతిని చూపిన విజ్ఞులు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు మహా పండితుడు, మహోన్నత రచయిత, నిత్య సంచారజీవి అయిన రాహుల్ సాంకృత్యాయన్ కాగా రెండవ వ్యక్తి తాత్త్విక యాత్రికుడు కృష్ణనాథ్.



హిమాలయ ప్రాంతాల పట్ల మరింత శ్రద్ధాసక్తులు చూపవలసిన అవసరం ఉన్నదనే వాస్తవాన్ని సోనమ్ వాంగ్ చుక్, ఆయన సహచరులు మనకు గుర్తుచేశారు. అంతేకాకుండా మన కాలంలో హిమాలయన్ విధానం ఎలా ఉండాలి, దాని ఉపయుక్తత ఏమిటి అనే విషయమై మన అవగాహనను మెరుగుపరిచారు. వికేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని లద్దాఖ్ ప్రజలు కోరుకుంటున్నారు. రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ హోదా లద్దాఖ్‌కు కూడా కల్పించాలన్నదే లేహ్ నుంచి ఢిల్లీ పాదయాత్ర తక్షణ, ప్రధాన డిమాండ్.

హిమాలయ ప్రాంతాల పట్ల మరింత శ్రద్ధాసక్తులు చూపవలసిన అవసరం ఉన్నదనే వాస్తవాన్ని సోనమ్ వాంగ్ చుక్, ఆయన సహచరులు మనకు గుర్తుచేశారు. అంతేకాకుండా మన కాలంలో హిమాలయన్ విధానం ఎలా ఉండాలి, దాని ఉపయుక్తత ఏమిటి అనే విషయమై మన అవగాహనను విశేషంగా మెరుగుపరిచారు. ఢిల్లీ లేదా పుదుచ్చేరిలో వలే ప్రజలు ఎన్నుకున్న శాసనసభతో లద్దాఖ్‌ను కూడా ఒక పూర్తి స్థాయి రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేసి లద్దాఖ్ ప్రజలకు ప్రజాస్వామిక పాలన సమకూర్చాలని వాంగ్ చుక్ డిమాండ్ చేశారు. జమ్మూ-కశ్మీర్‌లో తమ ఉనికి దశాబ్దాల పాటు పూర్తిగా ఉపేక్షింపబడినందున తాము ఎన్నుకున్న, తమకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వ పాలనను లద్దాఖ్ ప్రజలు కోరుకుంటున్నారు. ఇది పూర్తిగా సహేతుకమైన, సానుభూతి చూపవలసిన డిమాండ్ అనడంలో సందేహం లేదు. లద్దాఖ్ జనాభా ఇంచుమించు మూడు లక్షలు మాత్రమే. అయోధ్య, హిసార్ లాంటి చిన్న పట్టణాల జనాభా కంటే ఇది ఏ మాత్రం ఎక్కువ కాదు. అయితే లద్దాఖ్ విస్తీర్ణం 59,000 చదరపు కిలోమీటర్లు. జమ్మూ కశ్మీర్ కంటే చాలా పెద్ద ప్రాంతం. మణిపూర్, మిజోరం, నాగాలాండ్‌ల మొత్తం విస్తీర్ణం కంటే లద్దాఖ్ విస్తీర్ణమే ఎక్కువ. అరుణాచల్ ప్రదేశ్‌కు ఉన్నట్లుగానే ఈ సువిశాల లద్దాఖ్‌కు కూడా లోక్‌సభలో ఇద్దరు ప్రతినిధులు, రాజ్యసభలో ఒక ప్రతినిధి ఎందుకు ఉండకూడదు? ఈ విషయంలో లద్దాఖ్ ప్రజల న్యాయబద్ధమైన ఆరాటాన్ని న్యూఢిల్లీ అర్థం చేసుకోవాలి.

వికేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని లద్దాఖ్ ప్రజలు కోరుకుంటున్నారు. ఆదివాసీ ప్రజల పరిపాలనకు సంబంధించిన రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ హోదా లద్దాఖ్‌కు కూడా కల్పించాలన్నదే లేహ్ నుంచి ఢిల్లీ పాదయాత్ర తక్షణ, ప్రధాన డిమాండ్. 6వ షెడ్యూల్‌లో చేర్చడం లేహ్, కార్గిల్‌తో సహా లద్దాఖ్‌లోని ఎనిమిది జిల్లాల్లోనూ నివసిస్తున్న విభిన్న గిరిజన తెగలు తమ సొంత అటానమస్ జిల్లా కౌన్సిల్‌ను కలిగి ఉండే సౌలభ్యం లభిస్తుంది. ఆయా గిరిజన తెగల అంతర్గత పాలనా వ్యవహారాలకు అటానమస్ జిల్లా కౌన్సిల్ బాధ్యత వహిస్తుంది. దీనివల్ల ప్రతి గిరిజన సముదాయానికీ తమ సొంత సంస్కృతి, అస్తిత్వాన్ని సంరక్షించుకునే సాధికారత సమకూరుతుంది. భారతీయ జనతా పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఈ విషయమై లద్దాఖ్ వాసులకు హామీ ఇవ్వడం గమనార్హం.

సోనమ్ వాంగ్ చుక్ నేతృత్వంలో నడుస్తున్న ఉద్యమం కేవల రాజకీయ డిమాండ్లకే పరిమితమైనది కాదు. స్థానిక ప్రజలకు భూములు, ఉద్యోగాలు, సాంస్కృతిక హక్కులు కల్పిస్తూ పర్యావరణ ప్రజాస్వామ్యంగా అభివర్ణించదగిన వ్యవస్థ నొకదాన్ని నిర్మించాలని వారు కోరుతున్నారు. విచక్షణారహితంగా జల విద్యుదుత్పాదన ప్రాజెక్టుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. అయితే 'అభివృద్ధి'ని వారు వ్యతిరేకించడం లేదు. వాంగ్ చుక్ వృత్తిరీత్యా ఒక ఇంజనీర్, నవకల్పన నిపుణుడు. బోధనా పద్ధతులు స్థానిక సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల్లో వేళ్లూనుకుని ఉండే ఒక కొత్త విద్యా ఉద్యమానికి ఆయన ఆద్యుడు. ఈ విద్యా కృషి ఫలితంగానే ఆయనకు 2018లో రామన్ మెగాసెసె అవార్డు లభించింది. వాంగ్ చుక్, ఆయన సహచరులు అభివృద్ధిలో తమకు వాటా మాత్రమే కోరడం లేదు, ఒక కొత్త అభివృద్ధి నమూనాను వారు డిమాండ్ చేస్తున్నారు.



■ యోగేంద్ర యాదవ్

కొత్త అభివృద్ధి నమూనాకు పట్టుదలే సోనమ్ వాంగ్ చుక్ నిరసన దీక్షకు, ఇతర నిరసనలు, ఆందోళనలు, ఉద్యమాలకు భిన్నంగా ఒక ప్రత్యేకతను సమకూరుస్తుంది. అయితే మన ప్రజాస్వామ్య సమాజంలో ఆ ఉద్యమాలన్నీ విలువైనవే, సందేహం లేదు. భారత రాజ్య వ్యవస్థతో ఒక నైతిక సమానతను ప్రారంభించారు. ఇది మనకు బ్రిటిష్ సామ్రాజ్యంతో గాంధీజీ ఎలా తలపడేవారో గుర్తుకు తెస్తుంది. వాంగ్ చుక్ తన ప్రజల తరఫున న్యాయబద్ధమైన రాజకీయ డిమాండ్లు చేస్తున్నారు. అయితే ఆ డిమాండ్లను నెరవేర్చాలని న్యూఢిల్లీ పాలకులను వేడుకొనేందుకు ఆయన తిరస్కరిస్తున్నారు. బతిమలాడడమనేది ఆయన స్వభావం కానేకాదు. ఆయన దృఢసంకల్పుడు. కయ్యానికి కాలు దువ్వడం ఆయన నైజం కాదు. గాంధేయ పద్ధతుల్లో ఆయన పోరాడుతున్నారు.

లోహియా రోజుల్లో హిమాలయన్ విధానం అనేది ఒక కొత్త వినూత్న విషయం. ఇప్పుడది ఒక వ్యవస్థాపిత వివేకం. హిమాలయాలు (విదేశీ దాడుల నుంచి) మన సంరక్షకులు అన్న కవితాత్మక భావన స్థానంలో, అపరిమిత రహదారులు, వంతెనలు, భవనాలకు ఆ యువ, దుర్బల పర్వత శ్రేణులు ఇంకెంత మాత్రం ఆధారభూతం కాలేవన్న అవగాహన పెరుగుతోంది. సైనిక దళాల, భౌమ రాజకీయ కేంద్రిత జాతీయ భద్రతా దృక్పథం స్థానంలో హిమాలయాలలో నివసించే ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు ప్రాధాన్యమిచ్చే మానవ శ్రేయోభావన మొగ్గ తొడుగుతోంది ప్రాకృతిక అందాలకు అసాధారణ నెలవులు అన్న పర్యాటక వాద దృక్పథం స్థానంలో జలవనరులు, ఔషధ తరువులు, జీవ వైవిధ్యం, సుస్థిర జీవనాధార ఆచరణలకు హిమాలయాలే ప్రాతిపదికలు అన్న వివేకం వృద్ధి పొందుతోంది. హిమాలయాలు అంటే ప్రదేశాలు మాత్రమే కాదు, ప్రజలు కూడా అన్న సత్యాన్ని భారత రాజ్య వ్యవస్థ ఇంకా పూర్తిగా గుర్తించలేదు.

న్యూఢిల్లీలో సోనమ్ వాంగ్ చుక్ నిరసన దీక్ష కొనసాగుతోంది. లద్దాఖ్ ప్రజల విజ్ఞప్తులను నివేదించేందుకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రితో సమావేశమయ్యేందుకు అవకాశమివ్వాలని మాత్రమే ఆయన కోరుకుంటున్నారు. హిమాలయాల వివేకాన్ని ఆయన న్యూఢిల్లీకి తీసుకువచ్చారు. మరి మన రాజకీయ నాయకత్వం హిమాలయాల సమస్యలు, ఆకాంక్షలను వింటుందా? లేక హిమాలయన్ ఆగ్రహం ఢిల్లీపై విరుచుకుపడేదాకా వేచి ఉంటుందా?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

## రెండు దశాబ్దాల 'రైతునేస్తం'

నేను సైతం రైతు కోసం అంటూ 2005లో ప్రారంభమైన రైతునేస్తం వ్యవసాయ మాసపత్రిక ద్విదశాబ్ది వేడుకలు జరుపుకుంటోంది. ఈ కాలం మొత్తం రైతునేస్తం రైతుల గుండె చప్పుడుకు వేదిక అయింది. ఆధునిక వ్యవసాయంతో సాగును లాభసాటి వ్యాపకంగా తీర్చిదిద్దడానికి అహరహం శ్రమించి పల్లె పల్లెకు చేరింది. ప్రతి రైతు కుటుంబంలో భాగస్వామి కావటానికి కష్టపడింది. వ్యవసాయ అనుబంధ రంగాలతో అదనపు ఆదాయం రైతుకు సమకూరాలనే దిశగా రైతులలో అవగాహన కోసం పరితపించి కొన్ని విజయాలు సాధించింది. రైతులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాల మధ్య వారధిగా మారి రోజువారీ సాగు సమస్యలకు హేతుబద్ధ పరిష్కార మార్గాలు సూచిస్తూ ప్రయాణం కొనసాగటం అందరికీ తెలిసిందే. మారిన కాలాన్ని అనుసరించి పశునేస్తం, ప్రకృతినేస్తం మాసపత్రికలను కూడా అందుబాటులోకి తెచ్చారు. అయితే కరోనా తరువాత రైతుల కోరిక మేరకు తిరిగి వాటిని రైతునేస్తంకు జోడించి సమగ్ర వ్యవసాయ పత్రికగా తిరిగి తీసుకువచ్చారు. ఇదే సమయంలో పత్రికను పూర్తిగా సేంద్రియ, సంప్రదాయ, సుస్థిర, సహజ వ్యవసాయ విధానాల కోసమే నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆ దిశగా పత్రిక నడుస్తోంది.

హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణలో, గుంటూరు జిల్లా కొర్నెపాడు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌లో నిరంతరం వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. చిరుధాన్యాలు, ప్రాసెసింగ్, అదనపు విలువ చేర్చటం, మిద్దెతోట సాగుకు అండగా చేయూతనిస్తూ ఆరోగ్య సమాజం కోసం తనవంతు కర్తవ్యం నిర్వహిస్తూ వస్తున్నారు. మరోవైపు రైతుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన వ్యాపకాల మీద వందకు పైగా ప్రచురణలు తీసుకురావటం సాధారణ విషయం కాదు. శిక్షణ, అవగాహన శిబిరాలు, ప్రచురణలతో పాటు రైతునేస్తం పేరుతో సేంద్రియ వ్యవసాయం కోసమే యూట్యూబ్ ఛానెల్ నడుపుతూ, రైతుల మద్దతుతో కొద్దికాలంలోనే విశేష ఆదరణ పొందటమే కాకుండా నెంబర్ వన్ స్థాయికి ఎదగటం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. లాభంతో పనిలేదు. కేవలం సేవాభావంతోనే కార్యక్రమాలు చేస్తూ రైతునేస్తం అంటే రైతులకు ఒక నమ్మకంగా నిలబెట్టారు.

పిట్ట కొంచెం కూత ఘనం అన్న పెద్దలమాట రైతునేస్తం విషయంలో రుజువయింది. చిన్న పత్రిక కొన్ని మౌలిక మార్పులకు శ్రీకారం చుట్టి తీవ్ర ప్రభావం చూపింది. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రైతులు, శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులతో పాటు వ్యవసాయ పాత్రికేయులను పద్మశ్రీ డా. ఐ.వి సుబ్బారావు రైతునేస్తం పురస్కారాలతో సత్కరిస్తూ వ్యవసాయ రంగంలో పని చేస్తున్నవారు ఎవ్వరికీ తీసిపోరు అన్న ఆత్మబలం ఇవ్వగలిగింది. రైతులకు ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి తన విశ్వసనీయత పెంచుకుంది. మిద్దెతోట, చిరుధాన్యాలు... ఆరోగ్యకర సమాజం కోసం అవసరమని నమ్మి, ఒక ఉద్యమ స్ఫూర్తితో చేస్తున్న అవగాహన సదస్సులు వారి కృషికి ప్రత్యేక సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. తెలుగునాట మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా ఖాదర్ వలీ, మిద్దెతోట నిపుణులు రఘోత్తమరెడ్డి ఆశయాలను ప్రతి గడపకు చేర్చింది. సత్కార కార్యక్రమం చేస్తే రైతునేస్తం వారే చెయ్యాలి. పుస్తకం ముద్రిస్తే వారే ముద్రించాలి. శిక్షణ, అవగాహన శిబిరాల నిర్వహణ అంటే రైతునేస్తం వైపు దృష్టి సారించటం అంటే... పత్రిక తన 20 ఏళ్ల ప్రయాణంలో విజయం సాధించినట్లే కదా!

– కాకుమాను సాంబశివరావు

(అక్టోబర్ 20న గన్నవరం, ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్టులో రైతునేస్తం ద్విదశాబ్ది వేడుకలు)

# మానవతా ధార్మికుడు రతన్ టాటా

రతన్ టాటా మరణం యావత్ దేశాన్ని శోకసంద్రంలో ముంచేసింది. ఎంతోమంది తమ కుటుంబ సభ్యుణ్ణి కోల్పోయినట్టు బాధపడి, ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వేదికగా తమ దుఃఖాన్ని వెలిబుచ్చారు. సాధారణ వ్యక్తులు సైతం టాటా సన్స్ గ్రూప్ గురించి తెలుసుకుని మరీ బాధపడటం టాటాలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనం. వ్యాపారాలు అందరూ చేస్తారు కానీ విలువలతో కూడిన వ్యాపారాలు చేస్తూ, సంపదను రోజురోజుకు పెంచుకోవడం ఒక ఎత్తు అయితే, వచ్చిన లాభాల్లో మళ్ళీ సమాజానికే సింహభాగం కేటాయించడం, నైతికత, విలువలతో వ్యాపారం చేయటం టాటా గ్రూప్ ప్రత్యేకత. ఇదే టాటాను ప్రపంచంలో ప్రత్యేకంగా నిలబెట్టింది. ఇదొక్కటే కాదు సామాజిక అవసరాలు తీరుస్తూనే కాలానుగుణంగా వస్తున్న మార్పులతో పోటీపడి సామాన్య భారతీయుని కలలను సాకారం చేసేందుకు రతన్ టాటా తాపత్రయపడ్డారు. గుజరాత్‌లోని నవ్సారిలో ఒక చిన్న బట్టల మిల్లుతో ప్రారంభమైన టాటాల ప్రస్థానం, నేడు ప్రపంచంలో వందకు పైగా దేశాల్లో అన్ని రంగాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి ప్రపంచమే అబ్బురపడేలా సాగుతోంది.

గుజరాత్‌లో నూలు పరిశ్రమతో జంషెడ్‌జి టాటా గ్రూప్‌ను 1870లలో స్థాపించారు. ఆ తర్వాత ఈ గ్రూప్ ప్రస్థానం మనకు తెలియంది కాదు. ఒక్క టాటానే కాదు పార్శీలు అందరూ కష్టపడి పని చేయటంలోనూ, కాలానుగుణంగా మారడంలోనూ, వ్యాపార మెలకువల్లోనూ ప్రపంచంలోనే అగ్రగణ్యులు. ప్రస్తుతం మన దేశంలోని 145 కోట్ల మంది జనాభాలో పార్శీల జనాభా కేవలం 60 వేలు మాత్రమే. కానీ అనాదిగా దేశం కోసం విప్లవాత్మక మార్పులు తేవటంలో వారి పాత్ర అమోఘం. దేశంలో మొదటి బట్టల మిల్లు, మొదటి న్యూస్ పేపర్, మొదటి భారతీయ బ్యాంక్ స్థాపన పార్శీలే చేశారు. ముంబైలో సింహభాగం వ్యాపారాలే కాకుండా, ముంబైని ఆర్థిక రాజధానిగా మలిచింది కూడా పార్శీలే. కేవలం ఆర్థికంగానే కాక సాంఘిక రాజకీయ జీవనంలో కూడా వారి భాగస్వామ్యం వెలకట్టలేనిది. స్వాతంత్రోద్యమ కాలంలో కూడా ఫిరోజ్ షా మెహతా, దాదాబాయి నౌరోజీ లాంటి వారు, ప్రఖ్యాత సైంటిస్టు హోమి జహంగీర్ బాబా, పల్లోంజి మిస్త్రీ, గోద్రెజ్, పునావాల, వాడియాల కుటుంబాలు పార్శీలవే. ఇక జంషెడ్‌జి టాటా అయితే స్వామి వివేకానందతో చికాగో నుంచి చేసిన ప్రయాణమే తన వ్యాపార సామ్రాజ్యాన్ని మలుపు తిప్పిన ఇనుము ఉక్కు పరిశ్రమల స్థాపనకు ప్రేరేపించిందని చెప్పారు.

స్వాతంత్ర్యం తరువాత జరిగిన అభివృద్ధిలో రతన్ టాటా నవభారత నిర్మాణానికి పునాదులు వేశారనడంలో సందేహం లేదు. ఆధునిక శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా రోజురోజుకీ వస్తున్న మార్పులను టాటా గ్రూప్‌కు అన్వయిస్తూ ప్రపంచంలోని మేటి సంస్థలకు దీటుగా నిలుపుతూనే సగటు భారతీయుని ఆలోచనలను, ఆకాంక్షలను తీర్చేందుకు నిత్య శ్రామికుడిగా మారాడు. ఎంతలా అంటే తాను వివాహం చేసుకుంటే మళ్ళీ వ్యాపారానికి ఇచ్చే సమయం ఉండదేమో అన్నంతగా. రతన్ టాటా చూపిన దాతృత్వ మార్గం మాత్రం కార్పొరేట్ వ్యాపార సామ్రాజ్యంలో ప్రకంపనలు సృష్టించింది.

కార్పొరేట్ సామాజిక బాధ్యతలలో భాగంగా పేదల కోసం ఎన్నో వినూత్న సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారాయన. కంపెనీ లాభాల్లో రెండు శాతమో, ఐదు శాతమో లాభాలను టర్నోవర్‌ను బట్టి వినియోగించాలని సీఎస్ఆర్ చట్టం రూపొందించినా, రతన్ టాటా మాత్రం ఏకంగా 50 నుంచి 60శాతం లాభాలను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించటం నిజంగా ఆదర్శనీయం. విపత్తుల వేళ ఆయన చూపిన మానవతావాదం కార్పొరేట్‌లను విస్మయానికి గురిచేసింది. కరోనాకాలంలో పీఎమ్ కేర్స్‌కు ఏకంగా 1200 కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం, ఆయన చేతులకు ఎముకలు లేవని మరోమారు నిరూపిం చింది. దేశంలోని ప్రతి పౌరునికి టాటా గ్రూప్‌పై అభిమానం ప్రేమ కలిగేందుకు కారణం ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు. కార్పొరేట్ ఉద్యోగులకు, కంపెనీలకు సామాజిక స్పృహ ఉండాలని టాటా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ స్థాపించడం చూస్తే సేవా గుణాన్ని, దాతృత్వాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు ఆయన పడ్డ తాపత్రయం అర్థమవుతుంది.



గుండు పిన్ను నుంచి విమానాల వరకు ఆయన స్పృశించని రంగం అంటూ ఏదీ లేదు. వారసత్వ కట్టడాలను పరిరక్షించడం కోసం తాజ్ హోటల్స్ పేరుతో లాభాపేక్ష లేకుండా అందరూ సందర్శించేలా చేశారు. కార్పొరేట్ వ్యాపారాలకు మానవతా విలువలు జోడించి, విజయం సాధించిన ఆధునిక వ్యాపారవేత్త ఆయన. భవిష్యత్తు భారతాన్ని అంచనా వేసి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. వేగంగా నడవాలంటే ఒంటరిగా, దూరం నడవాలంటే తోడుగా నడవాలన్న ఆయన మాటలు దూరదృష్టితో టాటాల సామ్రాజ్యం, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెప్పింది కావచ్చు.

సామాన్య భారతీయుని కలల కారు ప్రయాణాన్ని లక్ష రూపాయలతో నానో కారు ద్వారా తీర్చి ఆయన సంచలనమే సృష్టించారు. నానో ద్వారా నష్టాలు వచ్చినా కష్టంగా భరించారు. ఇతర వ్యాపారాల్లో లాభాల ద్వారా ఈ నష్టాన్ని పూడ్చారే తప్ప సామాన్యుని కలలను మాత్రం చెరిపి వేయలేదు. ఆయన ఆచరించి చూపిన వ్యాపార మార్గం వ్యాపార నిర్వహణ శాస్త్ర విద్యార్థులకు, నిర్వాహకులకు పాఠాలుగా మిగిలిపోతాయి. దురదృష్టవశాత్తూ కమ్యూనిస్టు పార్టీలు అధికార పార్టీలను విమర్శించే క్రమంలో టాటాలకు, బిర్లాలకు దోచిపెడుతున్నారంటూ ఊతపదంగా వాడేవారు. టాటాలు ఎప్పుడు కూడా రాజకీయాలకు, వివాదాలకు దూరంగా ఉన్నారు. టాటా అంటేనే ట్రస్ట్, వ్యాపారం అంటే కేవలం ఆదాయం మాత్రమే కాదు అభిమానం, ఆత్మీయత అని నిరూపించారు రతన్ టాటా. భారతీయుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మనసున్న వ్యాపారవేత్త. దేశం సంకట స్థితిలో ఉన్నప్పుడు ఆపన్న హస్తాన్ని అందించే నిర్మల దేశభక్తుడు. ఆదాయం కంటే ఆత్మసంతృప్తి ముఖ్యమని కోట్లాదిమంది భారతీయుల హృదయాలను దోచుకుని చాలా లాభాన్ని సంపాదించి మూటగట్టుకెళ్లిన నిజమైన భారతరత్నం.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

## నివాళి



అమాయక జనాన్ని
మాయా పాలకులే
అన్యాయానికి గురిచేస్తుంటే
ప్రశ్నించినందుకు, అడ్డుకున్నందుకు
ప్రజాస్వామ్యబద్ధంగా
ప్రజాపక్షం వహించినందుకు
ప్రతీకారంతో ప్రతీ వికారాన్ని ప్రదర్శిస్తూ
మావోయిస్టుల ఆరో ప్రాణమనో
ఆయన ఆరో ప్రాణం మావోయిస్టులనో
మోపిన ఆరోపణ చూస్తే
చంపదలచిన కుక్కకు
'పిచ్చిద'నే ట్యాగేసినట్టుంది.

తొంభైశాతం దివ్యంగత్వాన్ని ధరించి
తన ఆరోగ్యాన్ని పట్టించుకోక
సాటి ఖైదీల హక్కుల్ని
తన హక్కుగా పట్టించుకున్న
సూర్యుడైనందుకు
పాలక మేఘాలు/ నిర్బంధ వర్షంతో
ఆర్పివేయ తడిపినై
ఆరోగ్యాన్ని మరింత/ కొల్లగొట్టి, చెడగొట్టి
ఆర్నెల్లకంటే ఎక్కువ కాలం
శరీరం మన్నకుండా చేసి
నిర్దోషిగా నిర్ణయించడం
ఈ ధర్మభూమిలో ధర్మప్రభువుల
కనికట్టు కనికరం.

బహుమతుల కోసమే
బహు మతులు
కలాన్ని, కాలాన్ని, సకలాన్ని
సమీకరించే మేధావులారా,
సకల జనుల కళాకారులారా,
సశస్త్ర సకలం యోధులారా,
ఆయన సకలల సాకారం కోసమే
అంజలి ఘటిద్దాం రండి!

– డా. రాపోలు సుదర్శన్
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం

# ఇక రాచమార్గం

## ఎయిర్‌పోర్టు కారిడార్ బ్యూటిఫికేషన్‌కు నేడు శంకుస్థాపన

- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ ఆలోచనకు శ్రీకారం
- తొలిదశలో ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు..
- రెండోదశలో ఎయిర్‌పోర్టు నుంచి పెద అవుటపల్లి వరకు..
- ఎయిర్‌పోర్టు కారిడార్ కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు
- చైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ, తొమ్మిది మంది సభ్యులు




మెట్రోపాలిటన్ నగరాలైన చెన్నై, బెంగళూరు తరహాలో, అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవాడ ఎయిర్‌పోర్టు కారిడార్ మార్గాన్ని సుందరీకరించేందుకు సర్వం సిద్ధమైంది. ఫిల్మ్‌సిటీ తరహా ఆర్కిటెక్ట్ నైపుణ్యాలు, అత్యద్భుత ల్యాండ్ స్కేపింగ్‌తో అబ్బురపరిచే ఈ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు.

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ)** : రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే 16వ నెంబరు జాతీయ రహదారి వీవీపీ కారిడార్‌ను అందంగా తీర్చిదిద్దే పనులకు శుక్రవారం శంకుస్థాపన జరగనుంది. గన్నవరం నుంచి రాజధానికి తీసుకెళ్లే ఈ మార్గాన్ని సుందరీకరించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆలోచన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేశారు. సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో శాఖలన్నీ కదిలాయి.

### శాఖల సమన్వయంతో కమిటీ

విమానాశ్రయ గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాన్ని, పరిసర ప్రాంతాలతో పాటు ఎన్‌హెచ్-16 వీవీపీ కారిడార్ మార్గాన్ని సుందరీకరించేందుకు ఎయిర్‌పోర్టు, ఎన్‌హెచ్, పంచాయతీరాజ్, అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ శాఖలన్నింటినీ ఎమ్మెల్యే యార్లగడ్డ ఏకతాటిపైకి తెచ్చారు. ఇందుకోసం మూడు రోజుల కిందట అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వారు.. ల్యాండ్ స్కేపింగ్ ఆర్కిటెక్ట్ డిజైన్లు రూపొందించారు. అన్ని శాఖల నేతృత్వంలో గురువారం కూడా సమావేశం జరిగింది. ఎయిర్‌పోర్టు ముందుభాగం, పరిసర ప్రాంతాలతో పాటు ఎన్‌హెచ్-16 వీవీపీ కారిడార్ మొత్తాన్ని సుందరంగా, శుభ్రంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే చర్చించారు. ఇందుకోసం కో-ఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నారు.

మిగతా 8లో..

### రెండు దశల్లో పనులు

మొత్తం రెండు దశల్లో కారిడార్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మొదటి దశలో ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు చేపడతారు. మొదటి ప్యాకేజీగా ఎయిర్‌పోర్టు నుంచి కేసరపల్లి జంక్షన్ వరకు, ఎయిర్‌పోర్టు గ్రాండ్ ఎంట్రన్స్ మార్గాన్ని సుందరీకరిస్తారు. అందమైన ల్యాండ్ స్కేపింగ్‌తో కనిపించేలా దీనిని అభివృద్ధి చేస్తారు. ఇది ఫిల్మ్‌సిటీలోని ల్యాండ్ స్కేపింగ్‌లా ఉంటుంది. దీనికోసం అద్భుతమైన ఆర్కిటెక్ట్ డిజైన్లను అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ అధికారులు రూపొందించారు. మొదటి దశ పనులు 15 రోజుల్లో పూర్తిచేసి, ఎయిర్‌పోర్టు నుంచి పెద్ద అవుటపల్లి వరకు రెండోదశ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నిర్ణయించారు.



## ఫోన్ పోగొట్టుకున్నారా..

# సీఈఐఆర్‌తో భరోసా

- మీరు మార్కెట్ చేస్తుండగా మీ మొబైల్‌ను ఎవరైనా కొట్టేశారా?
- బస్సు ఎక్కుతున్నప్పుడు మీ ఫోన్ జారిపోయిందా?
- మీరు ఎక్కడైనా ఫోన్ పెట్టి మరిచిపోయారా?

అయితే, ఇక ఆలస్యం ఎందుకు.. వెంటనే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్(సీఈఐఆర్)ను ఆశ్రయించండి. మీ ఫోన్ ఎక్కడ ఉందో క్షణాల్లో ట్రాక్ చేస్తుంది. ఎవరి వద్ద ఉందో ఇట్టే కనిపెట్టేస్తుంది. మళ్లీ తిరిగి మీకు అప్పగించేందుకు సహాయం చేస్తుంది. ఇటువంటి అద్భుతమైన వెబ్‌సైట్‌ను కేంద్ర టెలికం శాఖ సంచార్ సాథి పేరుతో మనకు అందుబాటులోకి తెచ్చింది. ఫోన్ బాధితులకు భరోసాగా నిలిచే సీఈఐఆర్‌పై ప్రత్యేక కథనం..

- మిస్ అయిన ఫోన్ల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్
- సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్‌తో సత్ఫలితాలు
- ఫిర్యాదుల స్వీకరణకు పోలీస్ కమిషనరేట్ నిర్ణయం
- ఫోన్ల ట్రాకింగ్‌కు ప్రత్యేకంగా టెక్నికల్ టీం

- ప్రత్యేక కథనం 8లో

# ప్రేమకథా చిత్రమ్

## సైబర్ నేరగాళ్ల సరికొత్త ఎత్తులు



నగరానికి చెందిన ఓ యువతి గూగుల్ ప్లేస్టోర్‌లో స్టార్‌మేకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. ఇది పాటలకు సంబంధించిన యాప్. వివిధ భాషల్లో పాటలు పాడొచ్చు. ఇందులో చాటింగ్ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఇలా ఈ యువతి టర్కీ దేశానికి చెందిన యువకుడితో పరిచయం పెంచుకుంది. ఈ అమ్మాయికి పాటలపై ఆసక్తి ఉండటంతో తెలుగులో పాటలు పాడి యాప్‌లో పోస్ట్ చేసేది. టర్కీ యువకుడు ఇంగ్లీష్‌లో పాటలు పాడి పోస్ట్ చేసేవాడు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి టర్కీ యువకుడు మాట ఇచ్చాడు. త్వరలో విజయవాడకు వచ్చి ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడతానని చెప్పాడు. ఇది జరిగిన కొన్ని రోజులకు ఆమెకు వీడియోకాల్ చేశాడు. విజయవాడలో ఎనిమిది కొత్త సిమ్‌కార్డులను ఆమె పేరు మీద తీసుకోవాలని సూచించాడు. తర్వాత ఎనిమిది బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, ఒక్కో ఖాతాకు ఒక్కో సిమ్ నెంబరును అనుసంధానం చేయించమని చెప్పాడు. ఆ సిమ్‌లను, బ్యాంకు ఏటీఎంలను పలానా చోటకు పంపాలని ఢిల్లీలో ఒక చిరునామాను ఆమెకు చెప్పాడు. అతను చెప్పినట్టుగానే ఆ యువతి ఢిల్లీ చిరునామాకు ఏటీఎం కార్డులు, కొత్త సిమ్‌కార్డులు కొరియర్ చేసింది. ఆ తర్వాత మోసపోయానని తెలుసుకుని లబోదిబోమంది. ఇది నగరంలో కొద్దిరోజుల క్రితం జరిగిన ప్రేమకథా చిత్రమ్ ఇదీ..

- యాప్‌ల్లో పరిచయాలు.. ప్రేమాయణం
- ఆ తర్వాత ప్రేయసితో కలిసి నేరాయణం
- కొన్నాళ్ల పాటు చాటింగ్, వీడియో కాల్స్
- తర్వాత సిమ్‌లు కొనాలంటూ కోరికలు
- బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలని ఆదేశాలు
- తెలియక మోసపోతున్న యువతులు

### నమ్మించి.. మోసగించి..

ప్రస్తుతం యువత తమలో ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి సామాజిక మాధ్యమాలను ఎక్కువగా విశ్వసిస్తోంది. ఈ ట్రెండ్ పెరగటంతో గూగుల్ ప్లే స్టోర్‌లో కొత్తకొత్త యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. పాటలకు సంబంధించి స్టార్‌మేకర్, స్మూల్, సింప్లీ సింగ్, సింగ్‌స్పాట్, రియాజ్, వుయ్‌సింగ్ వంటి యాప్‌లు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఈ యాప్‌ల్లో స్థానిక భాషల్లో పాటలు పాడి పోస్ట్ చేయొచ్చు. మనపక్కన లేకుండా ఎక్కడో ఉన్న వారితో కలిసి గీతాలు ఆలపించవచ్చు. ఈ ప్రక్రియలో యువతీ యువకుల మధ్య పరిచయాలు పెరుగుతున్నాయి. ఈ పరిచయాలు ప్రేమగా మారుతున్నాయి. విదేశాల్లో ఉంటున్న యువకులు యువతులను ఇలా ముగ్గులోకి దింపాక అసలు స్కెచ్‌ను అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉత్తరాది రాష్ట్రాల్లో అమలు చేసిన ఈ స్కెచ్‌లను తాజాగా తెలుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు.

### నగరంలో పెరుగుతున్న కేసులు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ)** : ఒకప్పుడు సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే కూలీల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేవారు. ఏటీఎం కార్డును మాత్రం తమ వద్ద పెట్టుకునేవారు. వివిధ వ్యక్తులను బెదిరించి ఆ ఖాతాల్లో డబ్బులు జమ చేయించుకునేవారు. ఏటీఎం కార్డులతో ఆ డబ్బును డ్రా చేసుకునేవారు. తర్వాత ఫోన్‌పే, గూగుల్‌పే అందుబాటులోకి వచ్చాక వాటిని నగదు లావాదేవీలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఒక ఫోన్ నెంబర్‌తో అనుకున్న టార్గెట్ చేరుకోగానే, దాన్ని తీసి పక్కన పెట్టేస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంత ప్రజానీకాన్ని టార్గెట్‌గా వాడుకున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు నగరవాసులను ఎంపిక చేసుకుంటున్నారు. ఖాతాలు తెరిచి సిమ్‌కార్డులు, ఏటీఎం కార్డులు సమకూర్చడానికి యువతులకు ఎర వేస్తున్నారు.



మిగతా 8లో..

### ప్రతిభ ముసుగులో పరిధి దాటొద్దు

యువతీ యువకులు టాలెంట్‌ను నిరూపించుకోవడానికి, ప్రదర్శించడానికి అనేక సోషల్ మీడియా యాప్‌లను ఉపయోగిస్తున్నారు. వారి టాలెంట్‌కు సంబంధించిన ప్రదర్శనను చూపించడం వరకు పర్వాలేదు. అవతలి వ్యక్తులు ఎవరో తెలియకుండా పరిచయాలు పెంచుకుంటే ఇబ్బందులు వస్తాయి. సోషల్ మీడియా యాప్‌ల్లో యాక్టివ్‌గా ఉండే యువతులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

- గుణరాము, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్

### ● జోరువాన



అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు నగరాన్ని ముంచేస్తున్నాయి. గురువారం ఉదయం, రాత్రి కురిసిన వర్షానికి బందరు రోడ్డులో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇలా ఇబ్బందులు పడ్డారు.

# రివర్స్ బదిలీలు

## ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో అవినీతి

- రెండు నెలల కిందట 22 మంది బదిలీ
- డిప్యుటేషన్ల పేరిట 10 మంది వెనక్కి
- మరికొందరినీ తెచ్చే ప్రయత్నాలు
- రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ)** : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఈఎన్‌సీ కార్యాలయం బదిలీల అర్థాన్నే మార్చేసింది. బదిలీల్లో భాగంగా బయటకెళ్లిన వారిని ఒక్కొక్కరిగా డిప్యుటేషన్ల పేరిట తిరిగి తెచ్చుకుంటున్నారు. ఈ ముసుగులో భారీగా ముడుపులు దండుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

**22 మంది బదిలీ.. పదిమంది వెనక్కి..**

నగరానికి కూతవేటు దూరంలోని గొల్లపూడిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా బదిలీలు, డిప్యూటేషన్లు చేశారు. ఇందుకోసం లక్షల రూపాయలు చేతులు మారాయి. ప్రభుత్వం మారినా ఈ కార్యాలయంలో అవినీతి వాసన పోలేదు. పైగా మరింత విచ్చలవిడిగా, భయం లేకుండా డిప్యుటేషన్లకు కొత్త అర్థాన్నిస్తూ రివర్స్ బదిలీలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో

మిగతా 8లో..

# ఇసుక తోడేస్తున్నారు

- కృష్ణానది నుంచి పడవల్లో తెచ్చి ..
- ఎడ్లబండ్ల ద్వారా భారీగా తరలింపు
- ట్రాక్టర్లలో లోడు చేసి ఇతర ప్రాంతాలకు..
- ట్రక్కు రూ.5 వేల-రూ.10 వేలకు విక్రయాలు
- మోపిదేవి మండలంలో ఇసుక అవినీతి

6లో

## గంజాయి తరలిస్తున్న తమిళనాడు ముఠా అరెస్టు

- నిందితుల వద్ద నాటు తుపాకీ, 145 కిలోల గంజాయి స్వాధీనం

6లో

# అయిగిరినందినీ..

## నగరంలో ఘనంగా ఆదిదంపతుల గిరి ప్రదక్షిణ



రెండోరోజు దుర్గమ్మ హుండీ ఆదాయం 6.26 కోట్లు

పెనుగంచిప్రోలు తిరుపతమ్మకు రూ.కోటికిపైగా...

8లో



## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి

నగరంలోని రైతుబజార్, సూపర్ మార్కెట్లలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీ

6లో

## ఏడాది తర్వాత..

రైల్వేలో నకిలీ విద్యార్హతల కేసు పురోగతి

రైల్వే సంఘ్ నేతపై చార్జ్ ఫ్రేమ్స్‌కు రంగంసిద్ధం

8లో

# కుగ్రామం నుంచి డిప్యూటీ కలెక్టర్ దాకా..

» ఎస్సై ఉద్యోగం వదిలి రెవెన్యూలోకి..

» బందరు ఆర్డీవో స్వాతి విజయప్రస్థానం



(ఆంధ్యజ్యోతి - మచిలీపట్నం టౌన్)

పట్టుదల, కృషి ఉంటే విజయం సాధించొచ్చని నిరూపించారామె. సామాన్య పేద రైతు కూలీ కుటుంబంలో ఓ కుగ్రామంలో జన్మించినా, బ్యాలం నుంచి ఎన్నో సవాళ్లు ఎదురైనా ఎస్సైగా ఉద్యోగం సాధించారు. అంతటితో సంతృప్తి చెందక డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదిగారు. మొదటి పోస్టింగ్‌గా మచిలీపట్నం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. పది రోజుల్లోనే పెండింగ్ ఫైళ్లపై దృష్టి సారించారు. ప్రజలు ఏ సమస్యను తీసుకెళ్లినా వారి ఎదుటే తహసీల్దార్‌కు ఫోన్ చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న బందరు ఆర్డీవో స్వాతితో ప్రత్యేక ఇంటర్వ్యూ..

**ప్రశ్న: మీ విద్యాభ్యాసం ఎక్కడ జరిగింది?**

**జవాబు:** మాది అనంతపురం జిల్లా పరిగి మండలం గుర్వానహళ్లి. పేద కుటుంబంలో జన్మించాను. తల్లిదండ్రులు చదువుకోలేదు. తండ్రి వ్యవసాయ కార్మికుడు. తల్లి టైలర్. స్వగ్రామంలో ప్రాథమిక విద్య, తర్వాత హిందూపూర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు అక్కడే చదువుకున్నాను.

**ప్రశ్న: డిగ్రీలో, పీజీలో గోల్డ్‌మెడల్స్ ఎలా సాధ్యమైంది?**

**జవాబు:** హిందూపూర్‌లో బీఎస్సీ చదివాను. బీఎస్సీలో అధిక మార్కులు సాధించి ఎమ్మెల్యే నుంచి గోల్డ్‌మెడల్ పొందాను. నా తల్లి ప్రోత్సాహం తోనే డిగ్రీ చేశాను. ఆమె టైలరింగ్ చేస్తూ వచ్చిన ఆదాయంతో నన్ను చదివించారు. డిగ్రీలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్ ప్రోత్సహించడంతో ఎస్వీ యూనివర్సిటీలో పీజీ చేశాను. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో మళ్లీ గోల్డ్‌మెడల్ సాధించాను. 2015లో సీఎం చంద్రబాబు నుంచి అందుకున్నాను. కష్టపడి చదివితే విజయాలు సాధ్యమని నమ్మాను.

**ప్రశ్న: మీ తొలి ప్రభుత్వ ఉద్యోగం?**

**జవాబు:** తొలుత ఎస్సై ఉద్యోగం కోసం ప్రిపేర్ అయ్యాను. కఠినంగా వ్యాయామం చేశాను. తిరుపతి అర్బన్‌లో ఎస్సై ఉద్యోగం దక్కింది.

**ప్రశ్న: ఎస్సై ఉద్యోగంతో సంతృప్తి చెందలేదా?**

**జవాబు:** ఎస్సైగా కొంత మందికే సేవలందించగలను. డిప్యూటీ కలెక్టర్‌గా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలనే లక్ష్యంతో చదివాను. డిప్యూటీ కలెక్టర్ ర్యాంక్ ఉద్యోగం సాధించగలిగాను.

**ప్రశ్న: మచిలీపట్నం ఆర్డీవోగా బాధ్యతలు ఎలా ఉంది?**

**జవాబు:** జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆర్డీవోగా చేరడం ఎంతో సంతోషంగా ఉంది. కలెక్టర్, డీఆర్వోలు ఇచ్చే సూచనలు పాటిస్తున్నా. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తా.

## పాడి రైతులకు మెరుగైన సేవలందిస్తా

» పశుసంవర్ధక శాఖ కొత్త డైరెక్టర్ దామోదర్‌నాయుడు


**అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పశుపోషణ లాభదాయకంగా చేయడానికి చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక శాఖ నూతన డైరెక్టర్ టి.దామోదర్‌నాయుడు చెప్పారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దామోదర్‌నాయుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పాడి రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు.

## మున్సిపల్ టీచర్లకూ అవకాశం

**అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ)లోకి టీచర్లను డెప్యుటేషన్‌పై తీసుకునే అంశంలో మున్సిపల్ టీచర్లకు కూడా అవకాశం కల్పించారు. జడ్పీ టీచర్లు, ప్రభుత్వ టీచర్లు, యూనివర్సిటీలు, జాతీయ విద్యా సంస్థల్లోని ప్రొఫెసర్లు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ బుధవారం ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే మున్సిపల్ టీచర్ల విజ్ఞప్తితో వారికి కూడా వెసులుబాటు కల్పించింది.

# సాగు.. సాగేనా!

కోడూరు శివారు దింటిమెరక, హంసలదీవి, పాలకాయితిప్ప సమీపంలోని భూముల్లో ఈ ఏడాదైనా సాగు..సాగేనా! అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. సముద్ర కరకట్ట వద్ద ఏర్పాటు చేసిన పాలకాయితిప్ప అవుట్‌ఫాల్స్, కృష్ణానది కరకట్టపై ఏర్పాటు చేసిన కోడూరు అవుట్‌ఫాల్స్‌కు స్లూయిజ్ గేట్లు లేకపోవడంతో మండలం దిగువ ప్రాంతంలో నాలుగేళ్లుగా సుమారు 4 వేల ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయి. ఏటా నారుమడులు పోయడం, నాట్లు వేయడం చేస్తున్నప్పటికీ సముద్రపు నీరు కారణంగా ముంపు బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వైసీపీ పాలనలో అనేకమార్లు ప్రత్యేక నిపుణులను తీసుకువచ్చి ముంపునకు కారణాలను పరిశీలించారు. ప్రధాన కారణమైన అవుట్ ఫాల్ స్లూయిస్‌లను నిర్మించి సమస్యకు పరిష్కారాన్ని చూపుతామని నాటి పాలకులు చెప్పినా కాలయాపన చేశారు.



ఈస్ట్ చానల్ 15వ నెంబర్ కాల్వ కింద నీటమునిగిన వరి నాట్లు



ముంపునకు కారణమవుతున్న పాలకాయితిప్ప అవుట్ ఫాల్స్

**సముద్రనీటితో మునిగిపోతున్న నారుమడులు, నాట్లేసిన పొలాలు**

» కరకట్టపై అవుట్‌ఫాల్ గేట్లు లేకపోవడంతో నాలుగేళ్లుగా పొలాల్లోకి ఉప్పునీరు

» గేట్లు నిర్మించి..సమస్యకు పరిష్కారం చూపాలని రైతుల డిమాండ్

(ఆంధ్రజ్యోతి-కోడూరు)

### అందని ప్రభుత్వసాయం

కోడూరు శివారు దింటిమెరక, హంసలదీవి, పాలకాయితిప్ప సమీప భూముల్లో పంట వేసి నష్టపోతున్న రైతులకు ప్రభుత్వ సాయం కూడా కరువైంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులకు అందించే రైతు భరోసా వీరికి వర్తించడం లేదు. ఈ భూములన్నీ 22/ఏ నిషేధిత జాబితాలో ప్రభుత్వం చేర్చడంతో వీరికి ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారం తదితర లబ్ధి చూకూరడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బీడు బారిన భూములన్నీ సాగు భూములుగా మార్చ టమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రకటించారు. దీంతో రైతులు ఈ ఏడాది కొం డంత ఆశతో నారుమడులు పోసుకున్నారు. కానీ కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి, వరదల తాకిడికి నారుమడులు అన్ని మునిగిపోయి, కుళ్లిపోయాయి. మళ్లీ సాగు చేద్దామని రెండోసారి నారుమడులు పోసి నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కానీ ప్రస్తుతం బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్రం అలలతో ఎగిసిపడుతూ భారీ పోటు వస్తోంది. సముద్రపు కరకట్టకు ఉప్పునీరు ఎగువకు రాకుండా ఏర్పాటు చేసిన అవుట్ ఫాల్ గేట్లు లేకపోవటంతో మళ్లీ గతంలో మాదిరిగానే ఉప్పునీరు వచ్చి నారుమడులను పంట పొలాలను ముంచేస్తోంది. రెండుసార్లు నారుమడులు పోసి నాటుకు సిద్ధం చేసినప్పటికీ మళ్లీ పంట పొలాల ముంపు బారిన పడడంతో రైతులు ఈ ఏడాదైనా నాట్లు వేస్తామా..పంట చేతికి వస్తుందా? అంటూ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ముంపునకు ప్రధాన కారణమైన అవుట్ ఫాల్ స్లూయిస్‌లను పునర్నిర్మాణం చేసి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని కోరుతున్నారు.

**ప్రభుత్వమే ఆదుకోవాలి**

ఇప్పటికే రెండుసార్లు నారుమడులు పోసి నాట్లు వేశాం. ఎకరానికి రూ.14 వేల నుంచి 15 వేలు ఖర్చు పెట్టాం. మరలా పంట పొలాలు ముంపుబారినపడ్డాయి. నష్టపరిహారం అందడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**-కె.నాగరాజు, రైతు**

**ముంపు నుంచి రక్షణ కల్పించాలి**

అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు లేకపోవటంతో ఏటా పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా రక్షణ చర్యలు చేపట్టి, ముంపు నుంచి కాపాడాలి

**-పడమటి దుర్గారావు, రైతు**

## స్వచ్ఛ చల్లపల్లి కోసం అమెరికాలో 100 కి.మీ పరుగు

» 16 గంటలు ఏకధాటిగా పరుగెత్తి ..

రూ.5లక్షలు సేకరించిన ఎన్నారై




అమెరికాలో స్వచ్ఛ చల్లపల్లి జెండాతో ఎన్నారై నాదెళ్ల సురేష్

**చల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** స్వచ్ఛ చల్లపల్లి కోసం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు నాదెళ్ల సురేష్ అమెరికాలో 100 కిలోమీటర్లు పరుగెత్తి రూ.5 లక్షలు సేకరించారు. తీవ్రమైన ఉష్ణోగ్రతలో విజయవంతంగా పరుగు ముగించిన సురేష్..శిక్షకుడు బిల్ ఓడెన్‌డాల్‌తో కలిసి స్వచ్ఛ సుందర చల్లపల్లి తెలుగు బ్యానర్‌ను ప్రదర్శించారు. సేకరించిన విరాళాన్ని తల్లిదండ్రులు నాదెళ్ల పూర్ణచంద్రరావు, కుసుమ కుమారి ద్వారా గురువారం స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి దంపతులకు అందజేశారు. గతంలోనూ నాదెళ్ల సురేష్ అమెరికాలో స్వచ్ఛ చల్లపల్లి కోసం పరుగు నిర్వహించి విరాళాన్ని సేకరించి మన కోసం మనం ట్రస్ట్‌కు అందించారు.



చల్లపల్లి సీఆర్ ట్రస్ట్ వద్ద మాట్లాడుతున్న కె.నారాయణ

## ఏపీలోనూ సీఆర్ ఫౌండేషన్ సేవలు

» సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**చల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించి, ఏపీలోనూ ఫౌండేషన్ స్థాపించి పేదలకు అందుబాటులోకి తెస్తామని సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలిపారు. గురువారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వికాస కేంద్రంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. చల్లపల్లిలోని చంద్రరాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని సీఆర్ ఫౌండేషన్‌కు అనుసంధానం చేసి అభివృద్ధి చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్లు వివరించారు.

## ఓటర్ల జాబితాల్లో ఇంకా తప్పులా?

- వెంటనే సరిచేసి ఇవ్వండి
- సిబ్బందికి ఆర్డీవో స్వాతి ఆదేశం

**మచిలీపట్నం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):** 'ఓటర్ల జాబితాల్లో ఇంకా తప్పులు ఏంటి? జాబితాలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిశీలించి సరిచేయండి. తల్లిదండ్రులు ఒక పోలింగ్ బూత్‌లో, పిల్లలు వేరే పోలింగ్ బూత్‌లో ఉన్నారేమో చూడండి. ఇంటికి దగ్గరగా ఉండే పోలింగ్ బూత్‌లోనే ఓటర్ల పేర్లు ఉండాలి.' అంటూ బందరు ఆర్డీవో కె. స్వాతి మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందికి సూచించారు. గురువారం మునిసిపల్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేశారు. నగరంలోని ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై గతంలో వచ్చిన ఫిర్యాదులపై మునిసిపల్ కార్యాలయం ప్లానింగ్ విభాగంలో రెవెన్యూ సిబ్బందితో పాటు మునిసిపల్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నాలుగు రోజులుగా జాబితాలను పరిశీలించి, విచారణ జరుపుతున్నారు. సచివాలయాల పరిధిలో ఓటర్లతో ఒక సారి సంప్రదించి ఓటర్ల జాబితాల్లో మార్పులు, కూర్పులు, చేర్పులు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ఇష్టారాజ్యంగా మార్పులు చేయొద్దని సూచించారు. మచిలీపట్నం కొబ్బరితోటలోని 51, 52 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితాలను మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సమక్షంలో ఆర్డీవో పరిశీలించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అఫీజా తదితరులు పాల్గొన్నారు. నగరంలో పారిశుధ్యంపై కమిషనర్ బాపిరాజును అడిగి ఆర్డీవో తెలుసుకున్నారు.

## విషజ్వరాల విజృంభణ

» కిక్కిరిసిన ఆస్పత్రులు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్)



జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంతో పాటు పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభించాయి. జ్వరాల బారిన పడిన ప్రజలతో జిల్లా ప్రభుత్వాస్పత్రితో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడిపోతున్నాయి. శరీర ఉష్ణోగ్రతలు 101-104 డిగ్రీల ఫారన్‌హీట్ నమోదవుతున్నాయని చెబుతున్నారు. వారం, పది రోజుల పాటు జ్వరం తగ్గకపోవడంతో మోకాళ్ల నొప్పులు, నీరసంతో యువకులు సైతం కదలలేక మంచాలకు పరిమితమైపోతున్నారు. వైద్య పరీక్షల్లో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లుగా నిర్ధారణ అవుతున్నాయి. కొందరికి ముక్కుపైన నల్లటి మచ్చలు వస్తున్నాయి. కొందరిలో దగ్గు, జలుబు లక్షణాలుంటున్నాయి. ఇంట్లో ఒకరికి వైరల్ ఫీవర్ సోకితే ఇంటిల్లిపాదికి ఒకరి తర్వాత మరొకరికి సోకుతోంది. వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నారు.

**వారం నుంచి చికిత్స పొందుతున్నా**



వారం నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా. జ్వరం తగ్గడం లేదు. మా ఊళ్లో చాలా మందికి వైరల్ జ్వరాలు వస్తున్నాయి. రక్త, మూత్ర పరీక్షలు చేశారు. పొద్దున్న, సాయంత్రం మందులు ఇస్తున్నారు.

**- కోటేశ్వరరావు, పెదయాదర**

**నీరసించిపోయా..**



104 డిగ్రీల ఫారన్‌హీట్ జ్వరం వచ్చింది. నీరసించిపోవడంతో సెలైన్లు ఎక్కిస్తున్నారు. ఆరు రోజులైంది. ఇప్పుడిప్పుడే ద్రవ పదార్థాలు తాగుతున్నా.

**- శ్రీనివాసరావు, బంటుమిల్లి**

**ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలందిస్తున్నాం**

జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో జ్వరాలు వచ్చిన రోగులకు రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నాం. ఫీవర్ సర్వే చేయించాం. ఎవరికి జ్వరం వచ్చినా వెంటనే ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల సహకారంతో ఆస్పత్రుల్లో రోగులను చేర్పిస్తున్నాం. తక్షణ వైద్యసేవలందిస్తున్నాం. ఆస్పత్రుల్లో మందులకు కొరత లేదు. విషజ్వరాల కట్టడికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాం.

**- జి.గీతాబాయి, డీఎంహెచ్‌వో**

# ఇసుక తోడేస్తున్నారు



కె.కొత్తపాలెం వద్ద పడవల్లో నుంచి ఎడ్ల బండ్లలోకి ఇసుక లోడింగ్

» కృష్ణానదిలో నుంచి పడవల్లో తెచ్చి ఎడ్లబండ్ల ద్వారా తరలింపు

» అక్కడి నుంచి ట్రాక్టర్లలో లోడు చేసి ఇతర ప్రాంతాలకు

» ట్రక్కు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు విక్రయాలు

**(ఆంధ్రజ్యోతి-మోపిదేవి):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుకకు మోపిదేవి మండలంలో కొందరు వ్యాపారులు తూట్లు పొడుస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో కృష్ణానది గర్భం నుంచి పడవల్లో ఇసుక తోడి ఎడ్ల బండ్ల ద్వారా బయటకు చేరవేసి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు రూ.5 వేల నుంచి 10 వేలకు విక్రయాలు సాగిస్తున్నారు. మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెంలో అధికారంలో ఉన్న ఒక వర్గం, ప్రతిపక్షంలోని మరో వర్గం కలసి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కె.కొత్తపాలెం వద్ద కృష్ణానదిలోకి నాలుగు పడవల్లో వెళ్లి ఇసుకను తోడి పడవల ద్వారా తెచ్చి ఎడ్ల బండ్లతో గ్రామంలో నిర్దేశించిన ప్రదేశంలో గుట్టలుగా వేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాక్టర్లకు లోడు చేస్తున్నారు. డిమాండ్ మేరకు ధర నిర్ణయించి అమ్మకాలు సాగిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

**ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు**

మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోని కృష్ణానది ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉందని, సహజ వనరుల దోపిడీ, ఇసుక, బుసక అక్రమ రవాణా అరికట్టాలని పల్లెపండుగ గ్రామ సభల్లో రెండు రోజుల క్రితమే పోలీసు, రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. అయినా ఆయన ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. ఎమ్మెల్యే చెప్పిన రెండో రోజే అక్రమ వ్యాపారాలకు తెరలేశారని గ్రామంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, పోలీసుల దృష్టికి పడవల ద్వారా ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం ఇచ్చినా కనీసం నిలువరించే ప్రయత్నాలు చేయలేదని తెలుస్తోంది. పట్టపగలే పడవల్లో ఇసుకను తెచ్చి వ్యాపారం చేస్తూ ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## త్వరలో సహకార ఎన్నికలు

» రైతులే ఓట్లేసి పాలకవర్గాన్ని ఎన్నుకునేలా కార్యాచరణ: కొల్లు రవీంద్ర



మోపిదేవిలో కేడీసీసీ బ్రాంచ్ భవనం ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**మోపిదేవి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** కేడీసీసీ బ్యాంక్‌కు ఎంతో ఘన చరిత్ర ఉంది. త్వరలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. రైతులే ఓట్లువేసి పాలకవర్గాన్ని ఎన్నుకునేలా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కార్యాచరణ రూపొందించారు.' అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రూ.కోటి 10 లక్షలతో నూతనంగా నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ మోపిదేవి బ్రాంచి నూతన భవనాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి గురువారం రవీంద్ర ప్రారంభించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజాప్రతినిధులే బినామీ లుగా రుణాలు పొంది సహకార వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు.

## ఏఈవో గ్రేడ్-2 పదోన్నతులకు అర్హులే

» అగ్రికల్చర్ బీటెక్ అభ్యర్థులకు తొలగిన అడ్డంకి

» గత ఉత్తర్వులను సరిచేసిన వ్యవసాయ శాఖ

» ప్రమోషన్ల జాబితాను మార్చనున్న జిల్లాల అధికారులు

**గుంటూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో) గ్రేడ్-2 పదోన్నతులకు అగ్రికల్చర్ బీటెక్ అభ్యర్థులు అర్హులేనని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. ఆ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం గురువారం మెమో జారీచేసింది. 'ఏఈవో గ్రేడ్-2 పదోన్నతులలో అక్రమాలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన వ్యవసాయ శాఖ గత ఉత్తర్వులను సవరిస్తూ తాజా మెమో జారీచేసింది. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో అగ్రికల్చర్ బీటెక్ అర్హతతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వ్యవసాయ సహాయకులుగా (వీఏఏ గ్రేడ్-2) పనిచేస్తున్న సుమారు 300 మందికి పదోన్నతులలో అవకాశం దక్కుతుంది. 2019లో తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో అగ్రికల్చర్ బీటెక్ అర్హతతో గ్రామ వ్యవసాయ సహాయకులుగా పలువురు ఉద్యోగం పొందారు. ఉద్యోగం పొంది ఐదేళ్లు గడిచిన తర్వాత సదరు అభ్యర్థులు ఏఈవో(వ్యవసాయ విస్తరణ అధికారులు) గ్రేడ్-2 పదోన్నతులు పొందేందుకు అర్హులు కాదన్న పద్ధతిలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు జాబితాలు రూపొందించారు. గత ప్రభుత్వంలో వచ్చిన జీవో 35, జీవో 3ను ప్రాతిపదికగా ఏఈవో గ్రేడ్-2 పదోన్నతుల జాబితా రూపొందించారు. దీనిపై అగ్రికల్చర్ బీటెక్ చదివి వీఏఏ గ్రేడ్-2గా పనిచేస్తున్న వారు తమకు అన్యాయం జరిగిందని 'ఆంధ్రజ్యోతి'ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో వారిని పదోన్నతులకు అర్హులుగా భావించాలని కమిషనర్ కార్యాలయం మెమో జారీ చేసింది.

**జాబితా మళ్లీ తయారు**

రాష్ట్రంలో 749 ఏఈవో గ్రేడ్-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిలో నేరుగా నియామకం ద్వారా 300 పోస్టులు, ప్రమోషన్ల ద్వారా 449 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు 449 పోస్టులకు సంబంధించిన పదోన్నతుల జాబితా రూపొందించారు. తాజా మెమో నేపథ్యంలో ఇప్పుడు ఆ జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టాల్సి ఉంది. అగ్రికల్చర్ బీటెక్ చదివిన వీఏఏ గ్రేడ్-2లను కూడా చేర్చి కొత్త జాబితా తయారు చేయాలి.

## ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా కృష్ణమూర్తి బాధ్యతలు

**అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా టీవీఎస్ కృష్ణమూర్తి మంగళగిరిలోని కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వంలో నియమించిన నజీర్ అహ్మద్‌ను కార్యదర్శి హోదా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఆ బాధ్యతలను మండలి జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న టీవీఎస్ కృష్ణమూర్తికి అప్పగించింది.

## గంజాయి తరలిస్తున్న తమిళనాడు ముఠా అరెస్టు

» నిందితుల వద్ద నాటు తుపాకీ..145 కిలోల గంజాయి స్వాధీనం

**విజయవాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):** కాకినాడ జిల్లా తుని నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పటమట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నాటుతుపాకీని సీజ్ చేశారు. తమిళనాడులోని చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్‌కుమార్, రాణిపర్తి జిల్లా మేళకుప్పం ప్రాంతానికి చెందిన కుమారన్ మరిమూర్తి స్నేహితులు. వారు చెన్నై నుంచి బుధవారం ఉదయం బయలుదేరి తునికి చేరుకున్నారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ముఠా వారికి తుని వద్ద గంజాయిని అందజేసింది. సరుకును చెన్నైకి తీసుకెళ్లి విక్రయించాలనుకున్నారు. దీనికి వారం ముందుగా వారు ఇదే స్కెచ్‌ను అమలు చేశారు. తుని నుంచి గంజాయిని తీసుకెళ్లి చెన్నైలో విక్రయించారు. విశాఖ ముఠా నుంచి రెండు కిలోల గంజాయిని రూ.9వేలకు కొనుగోలు చేశారు. దాన్ని చెన్నైలో రూ.20వేలకు విక్రయించారు. వారం క్రితం వేసిన స్కెచ్ ఫలించడంతో బుధవారం ఉదయం అక్కడి నుంచి తునికి వచ్చారు. అక్కడ నుంచి గంజాయిని కారులో తరలిస్తుండగా సమాచారం రావడంతో పటమట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రామవరప్పాడు రింగ్ వద్ద గురువారం తనిఖీలు నిర్వహించారు. వినేష్, కుమారన్ వద్ద గంజాయిని గుర్తించారు. వాహనాన్ని తనిఖీ చేస్తుండగా వారి వద్ద నాటు తుపాకీ ఉంది. 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వారిని విచారిస్తున్నారు. బిహార్‌లో ఈ తుపాకీనికి కొనుగోలు చేసినట్టు వినేష్ అంగీకరించాడు. తన స్వగ్రామంలో ప్రత్యర్థులతో ఉన్న వివాదాల కారణంగా తుపాకీ కొన్నానని చెప్పినట్టు సమాచారం. కొన్నాళ్ల క్రితం బెంగళూరు వెళ్లినప్పుడు అక్కడ హోటల్‌లో పరిచయమైన స్నేహితుడి ద్వారా దీన్ని కొనుగోలు చేశాడు. వినేష్ తన స్వగ్రామంలో వడ్డీ వ్యాపారం చేసేవాడు. అప్పటికే ఈ వ్యాపారంలో ఉన్న వారు వినేష్‌ను అడ్డుకున్నారు. వ్యాపారం విషయంలో వినేష్‌కు వారితో గొడవలు జరిగాయి. వారి నుంచి రక్షించుకోవడానికి ఈ తుపాకీని కొనుగోలు చేశానని పోలీసులకు వివరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

## ప్రభుత్వ ధరలకే విక్రయించాలి

» అధిక ధరలకు సరుకులు విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు

» రైతుబజార్లు, సూపర్ మార్కెట్ల తనిఖీలో మంత్రి నాదెండ్ల మనోహర్

**ఆటోనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు వినియోగదారులకు అందిస్తున్నామని, అన్ని రైతు బజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన సరుకులను వినియోగ దారులకు అందించాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ప్రజలకు విక్రయించే సరుకుల నాణ్యత, ధరలపై పటమట రైతుబజార్, ఉషోదయ సూపర్ మార్కెట్లను మంత్రి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు బజార్లో సరుకుల అమ్మకాల్లో వ్యత్యాసాలపై ఎస్టేట్ ఆఫీసర్‌ను నిలదీశారు. బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి షాపుల నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. గురునానాక్ కాలనీలోని ఉషోదయ సూపర్ మార్కెట్ సరుకుల ధరలు పరిశీలించారు. ప్రభుత్వం కందిపప్పు కిలో రూ.67ను నిర్ణయిస్తే అమ్మకాలు లేకపోవడం గమనించిన మంత్రి సూపర్ మార్కెట్ నిర్వాహకులను నిలదీశారు. అధిక ధరకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ధరలు స్థిరీకరిస్తూ నాణ్యమైన వస్తువులు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎవరైనా తూట్లు పొడవాలనుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆన్‌లైన్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



లబ్బీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ కాలంలో విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఆన్‌లైన్ పరీక్షలపై అవగాహన అవసరమని సాయి మేధా కోచింగ్ సెంటర్ విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ తెలిపారు. సంస్థ ఛైర్మన్ డాక్టర్ జి.రమణ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలపై అవగాహన కల్పించామని ఆయన తెలిపారు.

## సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని తన వంతు సాయంగా చుట్టుగుంట సెంటర్ శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్లేశ్వరరావు బుధవారం సీఎం చంద్రబాబుకు రూ.10 వేల చెక్కును అందించారు. సీఎం ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఐసీఎస్ఐ ద్వారా మహిళకు సంతానం

విజయవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూర్యారావుపేటలో ఉన్న ఇందిరా ఐవీఎఫ్ సెంటర్‌లో ఐసీఎస్ఐ అత్యాధునిక విధానం ద్వారా మహిళ బాబుకు జన్మనిచ్చింది. విజయవాడకు చెందిన ఓ మహిళకు (28) ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు అండాశయం నుంచి విడుదలయ్యే ఎగ్స్ సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ఆమె రెండు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఫలితం దక్కలేదు. తర్వాత ఆమె సూర్యారావుపేటలో ఉన్న ఇందిరా ఐవీఎఫ్ సెంటర్‌లో వైద్యులను సంప్రదించారు. ఇక్కడ డాక్టర్ కవిత ఆ మహిళకు అన్ని పరీక్షలు చేశారు. ఆమెలో ఉండాల్సిన యాంటీ ముల్లేరియన్ హార్మోన్లు (ఏఎంహెచ్) స్థాయి 0.9ఎన్‌జీ/ఎంఎల్ ఉన్నాయి. ఈ కారణంగా ఆమె సహజ పద్ధతుల్లో గర్భం దాల్చలేకపోతుందని గుర్తించారు. కవిత ఆధ్వర్యంలో ఒక బృందం ఆమెకు ఫెర్టిలిటీ చికిత్సను ప్రారంభించింది. ఆమెకు ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజక్షన్ (ఐసీఎస్ఐ) అనే విధానం ద్వారా గర్భం దాల్చేలా చేశారు. ఆ మహిళ ఒక బాబుకు జన్మనిచ్చింది.

# గంజాయి బాబులు, పార్కింగ్‌కు అడ్డా

- మొగల్రాజపురం ఏడో డివిజన్‌లో ఖాళీగా కరెంటు బావి స్థలం
- గంజాయి, మందుబాబులకు స్థావరంగా మారిన వైనం
- రైతుబజార్ ఏర్పాటుకు హామీ ఇచ్చి మరిచిన నాయకులు

(ఆంధ్రజ్యోతి, మొగల్రాజపురం)

మొగల్రాజపురం ఏడో డివిజన్‌లో సంవత్సరాల తరబడి కరెంటు బావి స్థలం ఖాళీ ఉన్నా అధికారులు దీని మీద దృష్టి పెట్టడం లేదు. ఈ ఖాళీ స్థలం స్క్రాప్‌కు వచ్చిన కార్లను నిలపడానికి పార్కింగ్ స్థలంగా వాడుతున్నారు. టిఫిన్ బండ్లు కూడా పెట్టి ఉంచుతున్నారు. రాత్రి వేళ ఈ వాహనాల మాటున గంజాయి, మద్యం బాబులు చేరి తమ పని కానిస్తున్నారు. గతంలో గంజాయి బ్యాచ్ బీఎస్ఆర్‌కే పాఠశాల విద్యార్థిని అడ్డగించి చేతిని కోసిన ఘటన జరిగింది. ఇటీవల మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ మరణానంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి మాజీ సీఎం వచ్చినపుడు ఇక్కడ పార్కు చేసిన వాహనాలు భద్రతా సిబ్బందికి పెద్ద తలనొప్పిగా మారాయి.

**● ఐదేళ్లకు ఒక హామీ - ఏదీ నెరవేరలేదు**

ప్రజారాజ్యం పార్టీ ఉన్నపుడు ఆ పార్టీ అభ్యర్థి ప్రచారం కోసం వచ్చినపుడు ఈ డివిజన్‌కు వచ్చిన నాగేంద్రబాబు, తాడి శకుంతల తదితరులు ఈ స్థలంలో గ్రీనరీ ఏర్పాటు చేస్తామని మొక్కలు నాటి వెళ్లారు. తరువాత ఈ స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే పనిలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చొరవ తీసుకుని ఫెన్సింగ్, లైట్లు వేయించారు. తరువాత ఈ స్థలాన్ని రెండుగా చేసి పడమర వైపు సబ్‌స్టేషన్ కట్టారు. మిగలిన స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ హయాంలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. అదీ లేదు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కోవిడ్ సమయంలో పీబీ సిద్ధార్థ కళాశాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రైతుబజార్ తొలగించినపుడు ఇక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీలు మారినా ఈ స్థలం తలరాత మాత్రం మారడం లేదు.



7వ డివిజన్‌లో ఖాళీగా ఉన్న కరెంట్ బావి స్థలం


కరెంట్ బావి స్థలంలో కార్ల పార్కింగ్

### మినీ రైతుబజార్ ఏర్పాటు చేయాలి

ఈ డివిజన్ ప్రజలు కూరగాయలకు వెళ్లడానికి చుట్టుపక్కల ఎక్కడా రైతుబజార్ లేదు. వెళితే అలంకార్ రైతుబజార్ లేదా పటమట రైతుబజార్, కృష్ణలంక అంతే. ఈ చుట్టుపక్కల డివిజన్ వాసులకు ఉపయోగపడే విధంగా మినీ రైతుబజార్ ఏర్పాటు చేయాలి.

జి.క్రాంతికుమార్,
కులవివక్ష పోరాట సమితి

## వీఎంసీలో ఘనంగా వాల్మీకి జయంతి


మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్రలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు, ఎస్ఈ ప్రాజెక్ట్ సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీ. సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రహదారిపై బిల్డింగ్ మెటీరియల్

వారం రోజులుగా కన్నెత్తి చూడని అధికారులు


ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డులో వేసిన బిల్డింగ్ మెటీరియల్

భారతీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల వెంబడి అడ్డంగా వేసిన బిల్డింగ్ మెటీరియల్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి సెంటర్‌లోని నగర పాలక సంస్థ పాఠశాల రోడ్డులో బిల్డింగ్ యాజమానులు ఇసుక, కంకర రోడ్డు మీద వేశారు. ఇది వేసి సుమారు 7 రోజులు దాటుతుంది. ఈ ఇసుక, కంకర రోడ్డు మధ్యలోకి వచ్చింది. వర్షాకాలం కావడంతో వాననీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమీపంలో పలు నగరపాలక సంస్థ కార్యాలయాలు ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.



# గౌరంగబాబు చిరస్మరణీయులు

కొనియాడిన వక్తలు


సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి గౌరంగబాబు చిరస్మరణీయులని పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నేత, దుర్గగుడి మాజీ ఛైర్మన్ గౌరంగ బాబు సంసర్మణ సభను బెంజిసర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ 1982 టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్‌తో కలిసి గౌరంగబాబు పనిచేశారని, చరిత్రలో వివాదరహిత దుర్గగుడి ఛైర్మన్‌గా సేవలందించారన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ లారీ యజమానుల సమస్యలను నేరుగా ఎన్టీఆర్, చంద్రబాబుల దృష్టికి తీసుకెళ్లిన సమర్థ నాయకుడని ప్రశంసించారు. ఈ సభలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, సోదరుడు ధనకోటేశ్వరరావు, మనవడు కాజ గౌతం, లారీ ఓనర్స్ స్పోర్స్ ఛైర్మన్ కేవీ రమేష్, ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు, స్టీరింగ్ కమిటీ పెద్దలు వీఎస్‌వీ ప్రసాదరావు, కోనేరు బసవేశ్వరరావు, మస్తాన్‌రావు, చెన్నుపాటి వజీర్, చలువాది మల్లికార్జునరావు, లారీ యజమానుల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, జిల్లా సంఘం అధ్యక్షుడు నాగుమోతు రాజాలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా విజయదీపం

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి, ఎమ్మెల్యే సుజనా చౌదరి

పటమట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటితరం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. విజయదీపం కార్యక్రమాన్ని గురువారం ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయదీపం కార్యక్రమం కింద చేపట్టే కార్యక్రమాల బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సుజనా చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల శక్తి సామర్థ్యాలను వెలికితీసి వారికి ఇష్టమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడం తద్వారా వారి జీవన నైపుణ్యాలను మెరుగుపరిచి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తాయన్నారు. దేశంలోనే పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని సుజనా హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు స్వచ్ఛందంగా చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత సోమువీర్రాజు, సుజనా ఫౌండేషన్ సీఈవో పీవీ రావ్, ఫౌండేషన్ సలహాదారు వి శ్రీనివాసరావు, రిటైర్డు ఐఏఎస్ అధికారులు, క్రిస్ప్ ఫౌండర్ కన్నెగంటి సంధ్యారాణి, వేణుగోపాల్‌రెడ్డి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, టీడీపీ నేత నాగూల్ మీరా, ఎంఎస్ బేగ్, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు పాల్గొన్నారు.

## 15, 17లో అమరావతి బాలోత్సవం

గవర్నర్‌పేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక వికాసానికి, ఉన్నతికి అమరావతి బాలోత్సవం-2017 నుంచి నిర్వహిస్తున్న పిల్లల పండుగ ఈ ఏడాది నవంబరు 15, 17 తేదీల్లో సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రగతికి మార్గం-శాస్త్ర విజ్ఞానం అనే థీమ్‌తో పిల్లల పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్ జూనియర్స్ జూనియర్స్, సీనియర్స్ మూడు విభాగాలుగా కల్చరల్ ఈవెంట్స్ 18, అకడమిక్ ఈవెంట్స్ 42 అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

## విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు

వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణాయుత జీవితానికి భగవద్గీత మార్గదర్శకమని టీటీడీ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ అన్నారు. వన్‌టౌన్‌లోని మద్ది సుబ్బారావు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఎస్‌కేపీవీవీ హిందూ స్కూల్‌లో జిల్లా ధార్మిక కమిటీ సభ్యుడు బొగ్గరపు వెంకట బాలకోటేశ్వరరావుతో కలిసి భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గీత శ్లోక పఠన పోటీలు, కంఠస్థ పోటీలు, ధార్మిక వ్యాసాల పోటీలు నిర్వహిస్తుందన్నారు.

## దుర్గగుడిలో నూతన వధూవరులకు ఆశీస్సులు



వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి నూతన వధూవరులు కల్యాణ దుస్తులతో వచ్చారు. వారికి అలయ అధికారులు ప్రత్యేకంగా దర్శనం కల్పించి, వేదపండితులతో ఆశీర్వచనాలు ఇప్పించారు. అనంతరం ఈవో రామారావు దంపతులకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

## పేరుకే 'రోడ్లు శుభ్రపరిచే యంత్రం'

● ఎక్కడ దుమ్ము అక్కడే



గుణదల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు, రోడ్లపై ఉండే దుమ్ము ధూళిని తొలగించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేకంగా స్వీపింగ్ మిషన్ వాహనాలను (రోడ్డు శుభ్రపరిచే యంత్రం) రంగంలోకి దింపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే సదరు వాహనం ఎన్నిసార్లు తిరిగినా దాని వెనుకే వెళితే పేరుకే ఆ వాహనం తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. దీనికి కారణం దుమ్ము తొలగించేందుకు వాహనానికి ఏర్పాటు చేసిన బ్లేడ్లు సరిగా పనిచేయకపోవడమేనని చెప్పొచ్చు. ఒక వేళ బ్లేడ్లు సజావుగా దుమ్ము తొలగించినా అదంతా చాలా వరకు పైకి గాలిలోకి వెళ్ళి తిరిగి రోడ్డుమీదనే పడుతోంది. వాహనం నడిపే వారు దుమ్ము తొలగిస్తున్నదీ లేనిదీ చూడకుండా రామవరప్పాడురింగ్ రోడ్డు నుంచి చుట్టుగుంట వరకు లెక్క ప్రకారం రౌండ్లు వేసి నా పని అయిపోయింది అని చేతులు దులుపుకుని వెళ్లడం పరిపాటైపోయింది. ఈ విషయమై ఉన్నత అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రోడ్డుమీద దుమ్ము ధూళి లేకుండా చేయడం వల్ల గాలికి వాహన చోదకుల కళ్లల్లో దుమ్ము పడదని తద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని నగర వాసుల వాదన.

అన్నం, నీరు ఎలాగో మన యాంత్రిక జీవనానికి మొబైల్ కూడా ఒక అవసరంలా మారింది. ఇప్పుడు మొబైల్ లేకుండా ఎవరూ బయటికి అడుగు పెట్టడం లేదు. అలాంటి మొబైల్ ఫోన్ పోయిందంటే మన శరీరంలో ఏదో భాగం కోల్పోయినట్టే అన్నట్టు తయారైంది. దీంతో కేంద్రం ప్రభుత్వం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్(సీఈఐఆర్)ను ప్రవేశపెట్టింది. ఇది మన ఫోన్‌ను క్షణాల్లో కనిపెట్టేస్తుంది.

- ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్

ఫోన్ బాధితులకు

# సీఈఐఆర్‌తో భరోసా




**రాష్ట్రంలో సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు పరిష్కరించిన కేసులు ఇలా..**

| | |
|---|---|
| బ్లాక్ చేసిన మొబైల్ ఫోన్లు | 66,904 |
| గుర్తించినవి | 36,875 |
| రికవరీ చేసినవి | 13,023 |

కేంద్ర టెలికం శాఖ ఒక వ్యక్తి పేరు మీద ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయో తెలుసుకోవడంతో పాటు పోయిన సెల్‌ఫోన్లను ట్రాక్ చేయడానికి సంచార్ సాథి వెబ్‌సైట్‌ను రూపొందించింది. దీన్నే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్(సీఈఐఆర్)గా పిలుస్తారు. ఎన్టీఆర్‌జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫిర్యాదులను ఇక నుంచి సీఈఐఆర్ ద్వారా స్వీకరించాలని నిర్ణయించారు. ఇందులో ఫిర్యాదును రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల ఒక డిజిటల్ రికార్డు ఉంటుంది. ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్‌లో మూడు దశల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

**జిల్లాలో పెరుగుతున్న ఫిర్యాదులు**

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోజుకు 10 నుంచి 15 వరకు ఫోన్లకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయి. విజయవాడలోని పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కనున్న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వస్తున్నారు. కొంతమంది సమీప స్టేషన్లకు వెళ్తున్నారు.

**పోలీస్ సేవలు ఇలా..**

ఫోన్ ట్రాక్ అయిన తర్వాత పోలీసులు ఫిర్యాదుదారులకు సమాచారం ఇస్తారు. ఫోన్ కొనుగోలు చేసిన బిల్లు, ఆధార్‌కార్డు చూపించిన తర్వాత ఫోన్‌ను వారికి అందజేస్తారు. పోయిన ఫోన్ ట్రాక్ అవ్వగానే దాన్ని ఉపయోగిస్తున్న వ్యక్తులను పట్టుకుని స్వాధీనం చేసుకుంటారు. ఇలా స్వాధీనం చేసుకున్న ఫోన్లకు సంబంధించి ఒక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తారు. ఆ కోడ్‌ను బాధితులకు పంపుతారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయగానే పోయిన ఫోన్‌కు సంబంధించి ఐఎంఈఐ నంబర్ వస్తుంది. అదే క్యూఆర్ కోడ్‌ను పోలీసులు స్కాన్ చేస్తే ఫిర్యాదుదారుడి మొత్తం వివరాలు డిస్‌ప్లే అవుతాయి.

**సీఈఐఆర్‌లో ఫిర్యాదు ఇలా..**

మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్‌లో 3 దశల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ముందుగా సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో గానీ, సమీప పోలీస్‌స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయాలి. ఈ ఫిర్యాదును స్వీకరించి రిసెప్షన్‌లో ఉన్న సిబ్బంది ఒక నంబరు కేటాయిస్తారు. ఈ ఫిర్యాదు కాపీని బాధితులు ఫొటోస్టాట్ తీసుకోవాలి. లేకపోతే ఫోన్‌లో ఫొటో తీసుకోవచ్చు. తర్వాత సీఈఐఆర్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఫోన్‌లో గానీ, కంప్యూటర్‌లో గానీ తెరవాలి. వెబ్‌సైట్ తెరుచుకోగానే బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్, అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్, చెక్ రిక్వెస్ట్ స్టేటస్, ఫర్‌గాట్ రిక్వెస్ట్ ఐడీ పేర్లతో బాక్స్‌లు కనిపిస్తాయి. ఇందులో బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్ బాక్స్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్ కనిపిస్తుంది. దీనికి మూడు దశల్లో పూర్తి చేయాలి.

**మిస్ అయిన ఫోన్ల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్**

- సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్‌తో మెరుగైన ఫలితాలు
- ఇక ఫిర్యాదుల స్వీకరణకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ నిర్ణయం
- ఫోన్ల ట్రాకింగ్‌కు ప్రత్యేకంగా టెక్నికల్ టీం

**24 గంటల్లో అప్‌డేట్**

సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన 24 గంటల్లో అప్‌డేట్ వస్తుంది. ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్లను అన్ని సర్వీసు ప్రొవైడర్లకు పంపుతారు. ఈ ఫోన్లను ట్రాక్ చేయడానికి సైబర్ ల్యాబ్‌లో నిత్యం ఇద్దరు పోలీసులు పనిచేస్తారు. ఇలా చేయడం ద్వారా రోజుకు నాలుగు నుంచి ఐదు సెల్‌ఫోన్లను ట్రాక్ చేస్తారు.

-గుణరాము, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్

# దుర్గమ్మ కానుకల ఆదాయం రూ.6.26 కోట్లు



హుండీలను లెక్కిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది.

**వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ వారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు గురువారం రెండో రోజు కూడా కొనసాగింది. బుధ, గురువారాల్లో మొత్తంగా రూ.6,26,97,047లు కానుకల రూపేణ వచ్చాయి. 412 గ్రాముల బంగారం, 15 కిలోల 823 గ్రాముల వెండి లభించింది. యుఎస్‌ఏ డాలర్లు 355, యూరప్ యూరోస్ 5, 1.5 ఒమాన్ రియా_లు, 900 బైసాలు, 35 ఇంగ్లండ్ పౌండ్లు, 20 ఫిజీ డాలర్లు, 16 సౌదీ రియాలు, 20 అరబ్ ఎమిరేట్స్ దీర్హాలు, 2 మలేషియా రింగెట్లు, 50 కెనడా డాలర్లు, 5 కువైట్ దీనార్లు, 160 ఆస్ట్రేలియా డాలర్లు, 6 సింగపూర్ డాలర్లు లభించాయి. కాగా, రెండవ రోజు లెక్కింపులో రూ.2,76,68,347లు కానుకలు రూపేణ వచ్చాయి. 16వ తారీఖున, రూ.3,50,28,700లు కానుకల రూపేణ వచ్చాయి. విదేశీ కరెన్సీ యుఎస్‌ఏ, యూరప్, ఒమన్, ఇంగ్లండ్, ఫిజీ, సౌదీల నుంచి కానుకల రూపేణ వచ్చాయి.

**తిరుపతమ్మకు రూ.కోటికిపైగా హుండీ ఆదాయం**

**పెనుగంచిప్రోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** శ్రీ తిరుపతమ్మ అమ్మ వారికి భక్తులు సమర్పించిన హుండీల కానుకల ద్వారా రూ.కోటి 3 లక్షల 85 వేల16 నగదు, అమెరికన్ డాలర్లు 620, ఆస్ట్రేలియా 100, యూరోలు 10, రుకింగ్ ఒకటి పాయ, బడ్స్ 20తోపాటు 65 గ్రాముల బంగారం, ఒక కేజీ 50 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ బిహెచ్.ఎన్.ఎస్.కిషక్షర్ కుమార్ తెలిపారు. ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గిరి ప్రదక్షిణ

**వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** దుర్గగుడి ఆధ్వర్యంలో గురువారం ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంలో భాగంగా గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షణను నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చారు. అ క్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీశారు. ఈవో రామారావు, ముఖ్య అర్చకుడు శ్రీ నివాసశాస్త్రి కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం వీరు శ్రీనివాస శాస్త్రి, ఉద్యోగులు, భక్తులతో కలిసి ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. జై భవానీ, జైజై భవానీ అంటూ సాగిన భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల భజనల నడుమ భక్తిపారవశ్యంలో అమ్మవారి గిరిప్రదక్షణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. అనేక చోట్ల భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు సమర్పించి, పసుపు నీళ్లతో వారుపోశారు. చిట్టినగర్ ప్రాంతంలోకి వచ్చేటప్పటికీ అనుకోని విధంగా వాన పడింది. ఈ సమయంలో ఉత్సవమూర్తులు తడవకూడదన్న ఉద్దేశంతో పైన ఆచ్ఛాదనను ఏర్పాటు చేసినప్పటికీ వాన జోరు కావటంతో ఉత్సవమూర్తులను ప్రచారరథంలోకి మార్చారు. అక్కడ పూజాధికాలు నిర్వహించిన తిరిగి గిరి ప్రదక్షణను కొనసాగించారు.



కొబ్బరికాయ కొడుతున్న దుర్గగుడి ఈవో రామారావు

# జిల్లాను ఎన్డీయేకు కంచుకోటగా మారుద్దాం

- ఎంపీ కేశినేని శివనాథ్

**వన్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** వచ్చేఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యర్థులు భయపడేలా ఓట్ల నమోదు చేయించి ఎన్డీయే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, ఎన్టీఆర్ జిల్లాను ఎన్డీయే కూటమి కంచుకోటగా తీర్చిదిద్దుతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సామినేని ఉదయభాను గురువారం ఎంపీ శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సామినేని ఉదయభానును ఎంపీ శివనాథ్ శాలువాతో సత్కరించారు. అనంతరం ఎన్డీయే నేతలు, కార్యకర్తలతో వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి పాలన చూసి ప్రజలంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు సన్నద్ధంగా ఉన్నారన్నారు. సామినేని ఉదయభాను మాట్లాడుతూ జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో ఎన్డీయే కూటమి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరూ సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి చూస్తారన్నారు. జనసేన పార్టీ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన నేతలు బొలిశెట్టి వంశీకృష్ణ, అక్కల గాంధీ, కామేష్, టంకసాల సుబ్బారావు, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నేతలు శ్యామ్ ప్రసాద్, ఎస్.కృష్ణ ప్రసాద్, బీజేపీ నేతలు రెడ్డిపల్లి రాజు పాల్గొన్నారు.




ఉదయభానును సత్కరిస్తున్న శివనాథ్, ఎంపీతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

**ఎంపీని కలిసిన ఇన్‌చార్జి మంత్రి సుభాష్**

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ఎంపీ సాదరంగా ఆహ్వానం పలికారు. వీరి మధ్య కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి చర్చించుకున్నారు.

## జలవనరుల శాఖ ఇంజనీర్లకు అదనపు బాధ్యతలు

**అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర జల వనరుల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి సర్కిల్, తెలుగు గంగ ప్రాజెక్టు(శ్రీకాళహస్తి)లో పనిచేస్తున్న పోలూరు చంద్రశేఖరయ్యకు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ బాధ్యతలను అదనంగా ఇచ్చారు. నెల్లూరు సోమశిల సర్కిల్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న కోట సుబ్రహ్మణ్యేశ్వరరావుకు నెల్లూరు సోమశిల ప్రాజెక్టు డివిజన్-2 బాధ్యతలు అప్పగించారు. విజయవాడ ఇరిగేషన్ డివిజన్‌కు చెందిన రావెళ్ల రవికిరణ్‌కు విజయవాడ కృష్ణా కెనాల్ డివిజన్-2, కృష్ణా కెనాల్ డివిజన్ బాధ్యతలు చూస్తున్న చెల్లుబోయిన గోపీనాథ్‌కు గుడివాడ ఇరిగేషన్ డ్రైనేజీ డివిజన్, కమిషనర్ ఆఫ్ టెండర్స్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న రాయపాటి విజయలక్ష్మికి ఒంగోలులోని వినుకొండ క్వాలిటీ కంట్రోల్ డివిజన్, కావలి ఎస్ఎన్ డివిజన్‌లోని ముజాహిద్‌ఖాన్‌కు కావలి ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ, పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ బాధ్యతలు నిర్వహిస్తున్న మేడిశెట్టి కిశోర్‌కు కాకినాడ డ్రైనేజీ డివిజన్, పొదిలి ఇరిగేషన్ డివిజన్‌కు చెందిన శివరామ ప్రసాద్‌కు ఒంగోలు ఇరిగేషన్ సర్కిల్, మద్దిపాడు జీఆర్‌పీ డివిజన్‌లోని మైళ్ల రవికు వెలిగొండ ప్రాజెక్టు జీఆర్‌పీ-2 అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా అనంతపురం హెచ్ఎన్ఎస్ఎస్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న రాజన్‌బాబుకు నందికొట్కూరు హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-1, పెనుగొండ డివిజన్‌కు చెందిన పూల గంగాధరకు హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్ సర్కిల్-3, కుప్పం ఇరిగేషన్ డివిజన్‌లోని గానెనాయక్ సుగాలికి మదనపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్, అనంతపురం హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-2కి చెందిన గుర్రం శ్రీనివాసులకు హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్-7, పులివెందుల జీకేఎల్ఐ డివిజన్ ఏఎల్ శ్రీనివాసుకు ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ పులివెందుల బాధ్యతలను అదనంగా ఇచ్చారు. నరసరావుపేట ఓఅండ్ఎం డివిజన్ సంకతాల వెంకటేశ్వరప్రసాద్‌కు కడప తెలుగుగంగ ప్రాజెక్టు క్వాలిటీ కంట్రోల్ బాధ్యతలను అప్పగించారు. ఇక విజయవాడ సీడీవో కార్యాలయంలో బాధ్యతల్లో ఉన్న కోట రీనాకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2గా, నందికొట్కూరు హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్‌లోని సాకే రాధాకృష్ణకు పెనుకొండ ఎల్‌బీ డివిజన్, ధవళేశ్వరం పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ బాధ్యతలు నిర్వహిస్తున్న కాటూరి శ్రీనివాసరావుకు పీఐపీఎల్ఎంసీ యలమంచిలి అదనపు బాధ్యతలు అప్పగించారు.



**విరాళం..** ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయాలని మంత్రి నారా లోకేశ్‌కు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న ఆర్పీఎఫ్ సెక్యూరిటీస్ ఎండీ సుంకర రాజేశ్, తదితరులు

**నూతన ఆర్టీసీ ఈడీలకు సత్కారం**

**బస్‌స్టేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ హౌస్‌లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎ) జీ.వి. రవివర్మ, టి. చెంగల్‌రెడ్డి (ఈ), ఆర్థిక సలహాదారు, ముఖ్య గణాంక అధికారి ఎన్. సుధాకర్‌ను గురువారం ఆర్టీసీ హౌస్‌లో ఈయూ రాష్ట్ర కమిటీ నేతలు మర్యాదపూర్వకంగా సత్కరించారు. పూలబొకేలు, దుశ్శాలువాలతో వారిని సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈడీ రవివర్మకు గురువారం రాష్ట్ర కార్మిక పరిషత్ నేతలు ఆర్టీసీ హౌస్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈడీగా బాధ్యతలు చేపట్టిన రవివర్మ, చెంగల్‌రెడ్డిని నుకార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరి, కోసూరి సురేంద్ర, ఎస్.ప్రభాకర్, వై.రమేష్ కలిసి దుశ్శాలువాతో సత్కరించారు.

## రైతు బజార్‌లో మొండి బకాయిలు..?

- అద్దెలకు ఎగనామం పెడుతున్న వ్యాపారులు



**విజయవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** కేదారేశ్వపేట రైతు బజారులో స్టాల్స్ నిర్వహిస్తున్న కొంతమంది వ్యాపారులు అద్దెలు ఎగనామ పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలల తరబడి అద్దెలు కట్టకుండా వ్యాపారం కొనసాగిస్తుండటం మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు గమనించారు. గత ప్రభుత్వంలో సెంట్రల్ ఎమ్మెల్యే ప్రోత్సాహంతో ఈ వ్యాపారులు అద్దెలు కట్టకుండా బెదిరింపులకు పాల్పడ్డారని సమాచారం. అలా అద్దె అడిగిన సదరు ఈవోను సస్పెండ్ చేయటమే కాక ఉద్యోగం నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 43 మంది స్టాల్ నిర్వాహకులు రూ.4లక్షల బకాయిలు చెల్లించారు. ఇంకా 25 మంది రూ.14 లక్షల బకాయిలు పడ్డారు. వీటిని వారంలో వసూలు చేయాలని నిర్ణయం తీసుకొన్నట్లు ఈవో రమేష్ తెలిపారు.

**నిలిచిన బదిలీలు**

రైతు బజార్లలో ఐదేళ్లుగా బదిలీలు నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లాలోని 15 రైతు బజార్లలో పని చేస్తున్న ఎస్టేట్ అధికారులు ఒకేచోట ఐదేళ్లుగా తిష్ట వేసుకొని కూర్చున్నారు. పటమట, కృష్ణలంక, భవానీపురం, గాంధీనగర్, కంచికచెర్ల, గవర్నర్‌పేట, జగ్గయ్యపేట సహా 15 రైతు బజార్లలో ఐదేళ్లుగా ఉన్న ఎస్టేట్ అధికారులు చక్రం తిప్పుతున్నారు. మార్కెటింగ్ శాఖలో ప్రతి రెండేళ్లకోసారి బదిలీలు చేయడం సంప్రదాయం. గత ప్రభుత్వంలో ఈ విధానాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో అధికారుల బాధ్యతలు, సమర్థతపై ప్రశ్నలు రావడం సహజం. ఇకనైనా, రైతులకు మెరుగైన సేవలందించేలా కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

## రివర్స్ బదిలీలు

(5వ పేజీ తరువాయి

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో మొత్తం 22మంది ఇంజనీర్లను పలు జిల్లాలకు బదిలీ చేయగా, 2 నెలలు కూడా కాకముందే వారంతా వెనక్కి వస్తున్నారు. ఒక్కొక్కరు రిక్వెస్ట్ ఫైల్ పెట్టుకోవటం, వాటిని ఆమోదించేయటం చకచకా జరిగిపోతున్నాయి. ఇలా ఇప్పటి వరకు పదిమంది వెనక్కి వచ్చేశారు. మరికొందరి అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయి.

**పెండింగ్‌లో మరిన్ని దరఖాస్తులు**

ఇక మిగిలిన వారిలో కూడా చాలామంది ఈఎన్‌సీ కార్యాలయానికి వచ్చేయటానికి దరఖా స్తు చేసుకున్నారు. వీరికి కూడా డిప్యూటేషన్లు ఇవ్వటానికి ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం భారీగా చేతులు మారినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

## ప్రేమకథా చిత్రమ్

(5వ పేజీ తరువాయి

మధురానగర్‌కు చెందిన యువతిని టర్కీ దేశానికి చెందిన యువకుడు ఇలాగే ఉపయోగించుకున్నాడు. తాను చేసే సైబర్ నేరాలకు సంబంధించిన డబ్బు జమ చేయించుకుని, డ్రా చేసుకునేందుకు ఆమెతో విజయవాడలో ఎనిమిది బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించాడు. ఆ ఖాతాలకు అనుసంధానం చేయడానికి ఎనిమిది కొత్త సిమ్‌కార్డులను కొనుగోలు చేయించుకు న్నాడు. ఈ ఖాతాలకు సంబంధించిన ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డులను ఢిల్లీలో చిరునామా ఇ చ్చి అక్కడకు కొరియర్ చేయమని సూచించాడు. టర్కీ యువకుడే ఏరికోరి పెళ్లి చేసుకుంటా నని చెప్పడంతో జీవితంలో ఎలాంటి అడ్డంకులు ఉండవని భావించిన ఆమె తల్లిదండ్రులకు విషయం చెప్పింది. తండ్రి దగ్గరుండి మరీ ఆమె పేరున సిమ్‌కార్డులు కొని, బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. ఇందులో ఒక ఖాతాలో ఆమె తెలియకుండా లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఆమె పోలీసులను ఆశ్రయించింది. అప్పటికే కొరియర్‌ను ఢిల్లీ చిరునామాకు పంపేయడంతో ఆయా బ్యాంకులకు వెళ్లి ఖాతాలను రద్దు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అదేవిధంగా ఆ సిమ్‌కార్డులను బ్లాక్ చేయించాలని స్పష్టం చేశారు.

## ఇక రాచమార్గం

(5వ పేజీ తరువాయి)

ఈ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, వైస్ చైర్మన్‌గా అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ఎండీ, సభ్యులుగా జాతీయ రహదారుల సంస్థ పీడీ, విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్, కృష్ణా-ఎన్టీఆర్ జిల్లాల డీపీవోలు, గన్నవరం పోలీసు స్టేషన్ సీఐ, అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ జీఎంలు ఉంటారు. తొమ్మిది మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ పర్యవేక్షణలో సుందరీకరణ, పారిశుధ్య పనుల పర్యవేక్షణ జరుగుతుంది.

**అధికారులకు బాధ్యతలు**

ఈ కారిడార్‌లో మిగిలిన శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఫుట్‌పాత్‌లను బాగుచేయటం, బుడమేరు, ఏలూరు కాల్వ, నిడమానూరు రైల్వేబ్రిడ్జిలపై ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయటం, రెయిలింగ్ ఏర్పాటు, వీధి దీపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టనున్నారు. ఈ పనులను ఎన్‌హెచ్ పీడీ పర్యవేక్షిస్తారు. రెండు జిల్లాల డీపీవోల నేతృత్వంలోని గుడివాడ డీఎల్‌పీవో, విజయవాడ డీఎల్‌పీవోలు శానిటేషన్ బాధ్యతలు చూస్తారు. గ్రీనరీ పనులను అర్బన్‌గ్రీన్ కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకునే బాధ్యతలను ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌కు అప్పగించారు.

## విద్యాధరపురం స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలి

**అధికారులకు శాప్ చైర్మన్ సూచన**



స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

**విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** పశ్చిమలోని విద్యాధరపురం లేబర్ కాలనీలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అధికారులను కోరారు. శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరిషాతో కలిసి గురువారం స్టేడియం ప్రాంగణంలో నిర్మాణ పనులను పరిశీలించారు. స్టేడియం నిర్మాణ నమూనాను ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించారు. శాప్ ఈఈ సిద్ధయ్య, ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, ఏపీ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఉన్నారు.

**ఘనంగా వాల్మీకి జయంతి**

నేటితరం యువత మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. శాప్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శాప్ చైర్మన్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

**క్రీడల్లోనూ రాణించాలి**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు.గుంటూరు జిల్లా నంబూరు వీవీఐటీ వైనా స్కూల్లో చదువుతున్న ఎం ఆధ్య (స్వర్ణం, 3 రజతాలు), వై విజయలక్ష్మి (స్వర్ణం, 2 రజతాలు) బి. కీర్తనసాయి (స్వర్ణం, కాంస్యం), బి లఖితారెడ్డి (స్వర్ణం), ఎం రోషన్ కిషన్ (కాంస్యం) స్కేటింగ్‌లో సత్తా చాటి పతకాలు సాధించారు. వీరిని శాప్ కార్యాలయంలో చైర్మన్ రవినాయుడు అభినందిస్తూ ఇందుకు కృషి చేసిన కోచ్ కె. కల్యాణ్‌ను ప్రశంసించారు.

## ఏడాది తర్వాత నకిలీ విద్యార్హతల కేసు పురోగతి!

**రైల్వే సంఘ్ నేతపై చార్జ్ ఫ్రేమ్స్‌కు రంగం సిద్ధం**

- తప్పుడు విద్యార్హతలేనని తేల్చిన రైల్వే విజిలెన్స్ విభాగం
- జిల్లా విద్యాశాఖ ఇచ్చిన కీలక ఆధారాలతో కేసు కొలిక్కి
- చార్జ్ ఫ్రేమ్ వేసేందుకు సిద్ధమౌతున్న అధికారులు

**(ఆంధ్రజ్యోతి-విజయవాడ/రైల్వేస్టేషన్):** నకిలీ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నేత ఆకుల రాఘవేంద్రపై రైల్వే ఉన్నతాధికారులు చార్జ్ ఫ్రేమ్ విధించటానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. డివిజన్‌లో పనిచేస్తున్న రాఘవేంద్ర విద్యార్హతలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందటంతో గతేడాది విజిలెన్స్ విభాగం విచారణ జరిపింది. ఈ విచారణలో జిల్లా విద్యాశాఖాధికారులు అవి నకిలీ సర్టిఫికెట్లేనని తేల్చటంతో విచారణ ముగింపు దశకు చేరుకుంది. అధికారులు పూర్తి ఆధారాలతో రైల్వే ఉన్నతాధికారులకు నివేదికను పంపారు. ఏడాది కాలం పాటు కేసులో పురోగతి లేదు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది. ఏడాది క్రితం సీఎన్‌డబ్ల్యూ విభాగంలో ఉద్యోగి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందాడనే ఆరోపణలు రావటంతో అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండా ఆ ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించి ఉద్యోగం పొందాడు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగంలో చేరాడని ఆధారాలున్న సంఘ నేతపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం రైల్వే అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతో ఉన్నతాధికారులు ఈ కేసును తేల్చమని అధికారులకు నిర్దేశించినట్టుగా తెలుస్తోంది. ఈమేరకు డివిజన్ అధికారులు చార్జిషీటు తయారు చేసినట్టు తెలిసింది. ఈ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఏం చేస్తారన్నది వేచి చూడాల్సిందే!

## మహర్షి వాల్మీకి జీవితం గొప్ప స్ఫూర్తి పథం

- ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

**కృష్ణలంక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** మహర్షి వాల్మీకి జీవితం, ఆయన సమాజానికి అందించిన రామాయణ మహాకావ్యం గొప్ప స్ఫూర్తి పథమని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం గురువారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.

## 'ప్రైవేట్'లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**ధర్నాచౌక్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు లేక పేద వర్గాలు ఆయా రంగంలో ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సోషలిస్టు కూటమి ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వరంగం తగ్గిపోయి 90 శాతం ప్రైవేట్‌రంగం పెరిగిందన్నారు. కొన్ని రాష్ట్రాలు ప్రైవేట్‌రంగంలో స్థానికులకు కోటా కల్పిస్తున్నా అవి సక్రమంగా అమలు జరగడంలేదన్నారు. సోషలిస్టు జాతీయ నేత ఎల్.జైబాబు, రాష్ట్ర అధ్యక్షుడు గోరంక అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి ఓర్సు వీరభాస్కర్, వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేయం.ఎ.సుభాన్, ఆంధ్రరాష్ట్ర ప్రజా సమితి నేత ఫణిరాజ్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు గిద్దా శ్రీనివాస్ నాయుడు, నగర మాజీ మేయర్ తాడి శకుంతల పాల్గొన్నారు.

## కౌలు రైతు ఆత్మహత్య?

**పెనమలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):** గోసాల హరిజనవాడకు చెందిన గుల్లంకి రవికుమార్ అనే కౌలు రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకొన్నట్టు అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15న రాత్రి 11గంటలకు అతడు పురుగుమందు తాగి వాంతులు చేసుకుంటుండగా కుటుంబసభ్యులు పటమటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు మృతుడి ఆత్మహత్యకు సరైన కారణం కోసం దర్యాప్తు చేస్తున్నారు.



# రెండు భాగాలుగా ఉంటుందా?


మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి రూపొందించే భారీ చిత్రం వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభమవుతుందని ఆ చిత్ర కథారచయిత విజయేంద్రప్రసాద్ వెల్లడించారు. కథ తయారు చేయడానికి తనకు రెండేళ్లు పట్టిందని కూడా ఆయన తెలిపారు. దుర్గా ఆర్ట్స్ బేనర్‌పై డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మించే ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే అడ్వెంచర్ కథ కావడంతో ఈ సినిమాను రెండు భాగాలుగా అందించాలనే ఆలోచనలో దర్శకనిర్మాతలు ఉన్నారని అంటున్నారు. ఎంతో స్పాన్ ఉన్న కథను రెండు, మూడు గంటల్లో చెప్పడం కుదరదు కనుక రెండు భాగాలుగా తీస్తే బాగుంటుందన్న ఆలోచనలో ఉన్నట్లు వినిపిస్తోంది. ఈ విషయంపై చిత్ర బృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. అలాగే గ్లోబల్ ఫీచర్ ఫిల్మ్‌గా రూపొందించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారనీ, అందుకే వివిధ భాషల్లోని స్టార్స్‌తో పాటు కొంతమంది విదేశీ నటులను కూడా తీసుకుంటున్నారనీ చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించి రకరకాలుగా ఊహాగానాలు వినిపిస్తున్నా, రాజమౌళి, ఆయన టీమ్ స్పందించకుండా ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో బిజీగా ఉంది. పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన వచ్చేవరకూ ఈ ఊహాగానాలు ఆగవేమో!

# ఒక మహిళను ఇలా అనొచ్చా!



నటి, దర్శకురాలు దివ్య ఖోస్లాకుమార్ ఆలియా, కరణ్ జోహార్‌పై చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలే ఆమె 'జిగ్రా' సినిమా విషయమై అందులో నటించిన ఆలియాను, నిర్మాత కరణ్‌జోహార్‌ను ఉద్దేశిస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. "నేను నటించిన 'సవి' సినిమా, 'జిగ్రా' సినిమా కథాంశం, ట్రీట్‌మెంట్ ఒకే రకంగా ఉన్నాయి. కానీ నా సినిమానే ముందుగా ప్రొడక్షన్‌లోకి వెళ్లింది. ముందుగా రిలీజైంది. ఇటీవల విడుదలైన 'జిగ్రా' సినిమాకు వస్తున్న కలెక్షన్లు.. చూపెడుతున్న కలెక్షన్లు పూర్తి తేడాగా ఉన్నాయి. ఒక సినిమా విజయాన్ని అందులో ఉన్న కంటెంట్, కళాత్మకతను బట్టి డిసైడ్ చేయాలి. కలెక్షన్ల పరంగా కాదు. నిజమైన హీరోయిజం అంటే ఇలాంటి తప్పుడు లెక్కలను చూపెడుతుంటే చూస్తూ ఊరుకోవడం కాదు" అని పేర్కొన్నారు. దాంతో నిర్మాత కరణ్ జోహార్‌కు ఒళ్లు మండి దివ్య పేరు ప్రస్తావించకుండా "కొన్ని సమయాల్లో మూర్ఖులకి సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండటమే ఉత్తమం" అని సోషల్‌మీడియాలో ఓ పోస్టు పెట్టారు. అయితే దీనిపై స్పందించిన దివ్యా ఖోస్లా "తప్పుల్ని ఎత్తిచూపితే.. ఒక మహిళను ఇలా 'ఫూల్' అనొచ్చా. నాతోనే ఇలాంటి పదాలు వాడితే.. ఇక ఇండస్ట్రీలో కొత్తవారి పరిస్థితి ఏంటి" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మరో 50 రోజుల్లో...



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ పుష్ప. దీని కొనసాగింపుగా వస్తున్న సినిమా పుష్ప-2. మైత్రీ మూవీ మేకర్స్ అసోసియేషన్, సుకుమార్ రైటింగ్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. సంగీతం దేవిశ్రీ ప్రసాద్. ఈ చిత్రం మరో 50 రోజుల్లో అంటే డిసెంబరు 6న విడుదలకు సిద్ధమవుతోంది. ఆ మేరకు చిత్ర బృందం హింట్ ఇస్తూ పోస్టర్‌ని విడుదల చేసింది. పోస్టర్‌లో అల్లు అర్జున్ సింహాసనంపై కూర్చొని మాసివ్ లుక్‌తో కనిపించారు. అల్లు అర్జున్, రష్మిక మందన్నాతోపాటు ఇతర పాత్రల్లో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటించారు.

# నో అన్నా వాళ్లు వదల్లేదు!



రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'. సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించారు. నవంబరు 7 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సమంత ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'దర్శకులు నన్ను ఈ సిరీస్ కోసం సంప్రదించారు. అయితే నా అనారోగ్య కారణాల రీత్యా నటించలేనని చెప్పాను. అందుకు బదులుగా ఈ పాత్రకు సరిపోయే నలుగురు హీరోయిన్ల పేర్లను కూడా రాజ్ అండ్ డీకే కి సిఫార్సు చేశాను. అయినా వాళ్లు పట్టుబట్టి నా కోసం వెయిట్ చేశారు' అని తెలిపారు.




అప్‌డేట్స్

# ప్రీక్వెల్ చేయాలని ఉంది



'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన చిత్రం 'వేట్టయాన్'. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై సూపర్‌హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు టీ.జీ.జ్ఞానవేల్ మీడియాతో ముచ్చటించారు.

"రజనీ నుంచి అభిమానులు ఏం కోరుకుంటారో బాగా తెలుసు. అందుకే ఈ స్క్రిప్టులో ఆయన కోసం ఎన్నో మార్పులు చేశాను. ఇందులో రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాత్రల మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా పరంగా ఎదుర్కొన్న అతి పెద్ద సవాల్ కమర్షియల్ అంశాలను ఇటువంటి సీరియస్ కథలో బ్యాలెన్స్ చేయడమే. అనిరుధ్ సంగీతం సినిమాకు ప్లస్సయ్యింది. ఈ సినిమాకు ప్రీక్వెల్ చేయాలని ఉంది" అని చెప్పారు.

# మ్యూజికల్ డ్రామా



'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రం 'మ్యాజిక్'. అనిరుధ్ రవిచందర్ స్వరకర్తగా వ్యవహరిస్తున్నారు. అనిరుధ్ పుట్టిన రోజు సందర్భంగా నిర్మాతలు చిత్రం విడుదల తేదీని ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు. డిసెంబరు 21న సినిమా విడుదల కానుంది. 'తమ కాలేజీ ఫెస్ట్ కోసం సొంతంగా ఒక పాటను స్వరపర్చడానికి నలుగురు టీనేజర్లు చేసే ప్రయత్నం చుట్టూ కథ తిరుగుతుంది. ఈ మ్యూజికల్ డ్రామాలో ఎందరో నూతన నటీనటులు నటిస్తున్నారు' అని నిర్మాతలు తెలిపారు.

# నిఖిల్ వలపు గీతం



'స్వామి రారా', 'కేశవ' చిత్రాల తర్వాత హీరో నిఖిల్ సిద్దార్థ, దర్శకుడు సుధీర్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. కన్నడ క్రేజీ హీరోయిన్ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'హే తార' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ను విడుదల చేశారు. కృష్ణ చైతన్య రాసిన ఈ పాటను కార్తీక్, నిత్యశ్రీ పాడారు. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమను తెలుపుతూ ఈ పాట సాగింది. నవంబర్ 8న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత బీవీఎస్ ఎన్ ప్రసాద్ చెప్పారు.

# చిత్రామృతం నాకు దక్కిన గౌరవం

**- కేఎస్ చిత్ర**



ప్రముఖ సినీ నేపథ్య గాయని కేఎస్ చిత్ర 45 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకొని 'చిత్రామృతం' పేరుతో సినీ సంగీత విభావరి జరగనుంది. డిసెంబర్ 22న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వాహకులు నిర్వహించిన సన్నాహక కార్యక్రమానికి కేఎస్ చిత్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "చిత్రామృతం' అంటూ నా పేరుతో ఏకంగా ఓ సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. దీన్నొక గౌరవంగా భావిస్తున్నాను. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ప్రేక్షకులను అలరించిన పలు గీతాలతో సంగీత విభావరి ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు. సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్, గాయకుడు శ్రీకృష్ణ 'చిత్రామృతం' కాన్సెప్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# 46కే ఢమాల్

## సొంత గడ్డపై టీమిండియా చెత్త ప్రదర్శన

చెలరేగిన పేసర్లు హెన్రీ, ఒరోక్

కివీస్ తొలి ఇన్నింగ్స్ 180/3




## 200000214..

ఏంటీ...ఈ నెంబర్లో ఇన్ని సున్నాలున్నాయని అనుకుంటున్నారా..? ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్ కలిగిన టీమిండియాలోని తొవిష్మిది మంది బ్యాటర్ల స్కోర్లవి.. కివీస్ పేసర్లు హెన్రీ, ఓరోక్‌ల ధాటికి తొలి టెస్టులో కేవలం ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. అది కూడా 20 లోపే.. ఈ దెబ్బకు స్వదేశంలో జరిగిన టెస్టుల్లో రోహిత్ సేన అత్యంత చెత్త స్కోరును నమోదు చేయగా.. అటు కివీస్ తొలి రోజే ఆధిక్యం సాధించింది.

| టెస్టుల్లో భారత్ అత్యల్ప స్కోర్లు | | |
|---|---|---|
| 36 | ఆసీస్‌పై | 2020 |
| 42 | ఇంగ్లండ్‌పై | 1974 |
| 46 | కివీస్‌పై | 2024 |
| 58 | ఆసీస్‌పై | 1947 |
| 58 | ఇంగ్లండ్‌పై | 1952 |

**బెంగళూరు:** స్వదేశంలో వరుసగా 18 టెస్టు సిరీస్ విజయాలు.. ఇటీవలే బంగ్లాదేశ్‌ను క్లీన్ స్వీప్ చేసి జోష్ మీదున్న భారత జట్టు కివీస్‌తో తొలి టెస్టును ఇంత దారుణంగా ఆరంభిస్తుందని ఎవరూ ఊహించలేదు. మ్యాచ్‌కు తొలిరోజైన బుధవారం ఆట వర్షార్పణం కాగా.. రెండో రోజు టాస్ గెలిచిన భారత్ అనూహ్యంగా బ్యాటింగ్ ఎంచుకుంది. రోజంతా పిచ్‌ను పూర్తిగా కవర్లతో కప్పి ఉంచిన వేళ, రోహిత్ తీసుకున్న నిర్ణయం అందరికీ షాక్ కలిగించింది. ఇంకేముంది.. మేఘావృత పరిస్థితిని సద్వినియోగం చేసుకుంటూ కివీస్ పేసర్లు చెలరేగిపోయారు. దీంతో భారత బ్యాటర్లు బెంబేలెత్తిపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 31.2 ఓవర్లలో కేవలం 46 పరుగులకే కుప్పకూలారు. పంత్ (20), జైస్వాల్ (13) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. పేసర్లు మ్యాట్ హెన్రీకి ఐదు, విలియం ఓరోక్‌కు నాలుగు, సౌథీకి ఓ వికెట్ లభించాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన కివీస్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 180/3 స్కోరుతో ఉంది. ప్రస్తుతం పర్యాటక జట్టు 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. డెవాన్ కాన్వే (91) సెంచరీని మిస్సయ్యాడు. క్రీజులో రచిన్ (22 బ్యాటింగ్), మిచెల్ (14 బ్యాటింగ్) ఉన్నారు.

**ఇలా వచ్చి.. అలా వెళ్లారు:** రోహిత్ టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకోవడం కివీస్‌కు లాభించింది. బౌలర్లకు అనుకూల పరిస్థితి ఉండడంతో స్వింగ్, బౌన్సీ బంతులతో వికెట్ల జాతర కొనసాగించారు. దీంతో భారత బ్యాటింగ్ లైనప్‌లో వచ్చినవారు వచ్చినట్టు వికెట్‌ను సమర్పించుకుని పెవిలియన్‌కు చేరాల్సివచ్చింది. ఏడో ఓవర్‌లో కెప్టెన్ రోహిత్ (2)ను సౌథీ అవుట్ చేయడంతో జట్టు పతనం ఆరంభమైంది. 2016 తర్వాత వన్‌డౌన్‌లో ఆడిన విరాట్‌ను ఓరోక్ డకౌట్‌గా పంపాడు. ఆ తర్వాత సర్ఫరాజ్ కూడా డకౌట్ కావడంతో 10/3 స్కోరుతో దయనీయంగా కనిపించింది. జైస్వాల్, పంత్ నాలుగో వికెట్‌కు అందించిన 21 పరుగులే అత్యధికం కావడం గమనార్హం. రాహుల్, జడేజా, అశ్విన్ కూడా డకౌట్‌గానే వెనుదిరిగారు. కేవలం 15 పరుగుల తేడాతో చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. తొలి సెషన్‌లో వర్షంతో 45 నిమిషాల ఆటకు అంతరాయం కలగ్గా.. రెండో సెషన్ ఆరంభంలోనే జట్టు ఆలౌటైంది.

**కాన్వే దూకుడు:** భారత బౌలర్లు కివీస్ బ్యాటర్లను కూడా ఇబ్బందిపెడతారని ఆశించినా నిరాశే ఎదురైంది. ఓపెనర్లు తొలి వికెట్‌కు 67 పరుగులు జోడించారు. లాథమ్‌ను స్పిన్నర్ కుల్దీప్ అవుట్ చేశాక.. విల్ యంగ్ (33)తో కాన్వే ఇన్నింగ్స్‌ను నడిపించాడు. శతకానికి 9 పరుగుల దూరంలో కాన్వేను అశ్విన్ బౌల్డ్ చేశాడు.

### సర్ఫరాజ్‌పై రోహిత్ ఆగ్రహం

ఫీల్డింగ్ విషయంలో సర్ఫరాజ్‌పై కెప్టెన్ రోహిత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. స్పిన్నర్ బౌలింగ్‌కు వస్తున్న సంగతి గమనించకుండా అతడింకా బ్యాటర్‌కు దగ్గరే ఫీల్డింగ్ చేయడంతో రోహిత్‌కు మండింది. 'కళ్లు కనిపించడం లేదా' అంటూ ఓ బూతు మాటతో హెచ్చరించాడు. అలాగే లాథమ్ క్యాచ్‌ని అందుకునే విషయంలో రాహుల్‌పై కూడా ఆగ్రహం వ్యక్తంచేశాడు.


హెన్రీ (5/15)


ఒరోక్ (4/22)

### స్కోరుబోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) ఎజాజ్ (బి) ఓరోక్ 13; రోహిత్ (బి) సౌథీ 2; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) ఓరోక్ 0; సర్ఫరాజ్ (సి) కాన్వే (బి) హెన్రీ 0; పంత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 20; రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఓరోక్ 0; జడేజా (సి) ఎజాజ్ (బి) హెన్రీ 0; అశ్విన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0; కుల్దీప్ (సి-సబ్) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 2; బుమ్రా (సి) హెన్రీ (బి) ఓరోక్ 1; సిరాజ్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 31.2 ఓవర్లలో 46 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-9, 2-9, 3-10, 4-31, 5-33, 6-34, 7-34, 8-39, 9-40, 10-46. **బౌలింగ్:** సౌథీ 6-4-8-1; హెన్రీ 13.2-3-15-5; ఓరోక్ 12-6-22-4.

**న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** లాథమ్ (ఎల్బీ) కుల్దీప్ 15; కాన్వే (బి) అశ్విన్ 91; యంగ్ (సి) కుల్దీప్ (బి) జడేజా 33; రచిన్ (బ్యాటింగ్) 22; మిచెల్ (బ్యాటింగ్) 14; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 50 ఓవర్లలో 180/3. వికెట్ల పతనం:** 1-67, 2-142, 3-154. **బౌలింగ్:** బుమ్రా 10-4-23-0; సిరాజ్ 7-1-21-0; అశ్విన్ 11-1-46-1; కుల్దీప్ 12-1-57-1; జడేజా 10-0-28-1.

### పంత్‌కు గాయం



భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ గాయపడడంతో మిగిలిన మూడు రోజులు ఆడేది సందేహంగా మారింది. కివీస్ ఇన్నింగ్స్ 38వ ఓవర్‌లో జడేజా వేసిన బంతి అతడి ఎడమ మోకాలిని తాకింది. దీంతో బాధతో విలవిల్లాడిన పంత్ మైదానం వీడాల్సి వచ్చింది. అతడి స్థానంలో జురెల్ కీపింగ్ చేశాడు. 2023లో సర్జరీ చేయించుకున్న చోటే బంతి తాకడంతో వాపు వచ్చిందని కెప్టెన్ రోహిత్ తెలిపాడు.


రోహిత్

### మా ఆట బాధించింది

'పిచ్ స్వభావాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాను. తొలి సెషన్ తర్వాత వికెట్ సీమర్లకు అనుకూలించదని భావించా. పచ్చిక కూడా అంతగా లేదు. అయితే నా అంచనా తప్పింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగాలనేది నా నిర్ణయమే. దీనికి నాదే బాధ్యత. కానీ మరీ 46 రన్స్ మాత్రమే చేయడం బాధించింది. ఏడాదిలో ఒకటి రెండు ఇలాంటి నిర్ణయాలు పర్వాలేదు' - **రోహిత్ శర్మ**

**1** టాప్-8 బ్యాటర్లలో ఐదుగురు డకౌట్లు కావడం భారత జట్టులో ఇదే ప్రథమం. అలాగే ఆసియాలో అత్యల్ప స్కోరు (46) నమోదు చేసిన జట్టుగా భారత్ నిలిచింది.

**2** ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో భారత్ నుంచి ఐదుగురు డకౌట్లు కావడం ఇది నాలుగోసారి. ఇంగ్లండ్, సౌతాఫ్రికాపై అత్యధికంగా ఆరేసి బ్యాటర్లు డకౌట్ అయ్యారు.

### భారత్ ఆటతీరుపై ట్రోలింగ్

కివీస్‌పై భారత్ 46 రన్స్‌కే ఆలౌట్ కావడంపై ఆస్ట్రేలియా క్రికెట్ (సీఏ) ట్రోలింగ్‌కు దిగింది. 2020 అడిలైడ్ టెస్టులో ఇలాగే భారత్ 36 రన్స్ కుప్పకూలింది. ఆ సందర్భాన్ని ఇప్పటి ఆటతీరుతో పోలుస్తూ '46 ఆలౌట్ అనేది 36 ఆలౌట్‌ను మరిపించిందని చెప్పవచ్చా' అంటూ పోస్ట్ చేసింది. మరోవైపు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ సైతం 'ఈసారి 36 రన్స్‌ను అధిగమించినందుకు భారత క్రికెట్ అభిమానులు సంతోషపడాలి' అంటూ కామెంట్ చేశాడు.

## క్వార్టర్స్‌కు సింధు

**ఓడెన్స్ (డెన్మార్క్):** కొన్నాళ్లుగా ఆరంభ రౌండ్లలోనే వెనుదిరుగుతున్న పీవీ సింధు డెన్మార్క్ ఓపెన్‌లో ఆ గండాన్ని అధిగమించింది. ఇక్కడ జరుగుతున్న సూపర్ 750 టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన రెండోరౌండ్లో మాజీ వరల్డ్ చాంపియన్ సింధు 18-21, 21-12, 21-16తో ప్రపంచ ఏడో ర్యాంకర్ హా యూ (చైనా)పై గెలిచింది. తర్వాతి రౌండ్‌లో సింధు.. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మారిస్కా (ఇండోనేసియా)తో తలపడనుంది.



## కూతకు సిద్ధం!

ప్రొ. కబడ్డీ సీజన్ నేటినుంచే

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ప్రొకబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-11 హైదరాబాద్ వేదికగా శుక్రవారం ప్రారంభం కాబోతోంది. తొలి మ్యాచ్‌లో 2018 చాంపియన్ బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ పోటీపడనుంది. గురువారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన ట్రోఫీ ఆవిష్కరణలో 12 జట్ల కెప్టెన్లు కప్‌తో ఫొటోకు పోజులిచ్చారు. వచ్చే నెల 9 వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తొలి అంచె పోటీలు, నవంబరు 10 నుంచి నోయిడాలో రెండో అంచె, డిసెంబరు 3 నుంచి 24 వరకు పుణెలో మూడో అంచె జరగనున్నాయి. లీగ్‌లో ప్లేఆఫ్స్‌తో సహా మొత్తం 137 మ్యాచ్‌లో జరగనున్నాయి. గత సీజన్‌లో టైటాన్స్ 22 మ్యాచ్‌ల్లో రెండే గెలిచి అవమానకర రీతిలో లీగ్ నుంచి నిష్క్రమించింది. నిరు డు సీజన్‌లో జట్టు పగ్గాలు తీసుకున్న స్టార్ రైడర్ పవన్ షెహ్రావత్ ఆటగాడిగా రాణించినా సారథిగా టీమ్‌ను విజయపథంలో నడపలేకపోయాడు. అయితే, ఈసారి జట్టులోకి కొత్త ప్లేయర్ల రాకతో పాటు నూతన కోచ్ క్రిషన్ కుమార్ చేరాడు.

టీ20 ప్రపంచ కప్‌లో ఆసీస్‌కు షాక్

## ఫైనల్లో దక్షిణాఫ్రికా


అనికె బాష్ (74 నాటౌట్)

**దుబాయ్:** డిఫెండింగ్ చాంప్, 8వసారి ఫైనల్ బెర్త్‌పై కన్నేసిన ఆస్ట్రేలియాకు మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో షాక్ తగిలింది. అనికె బాష్ (48 బంతుల్లో 74 నాటౌట్) పవర్ హిట్టింగ్‌తో దక్షిణాఫ్రికా ఫైనల్‌కు చేర్చింది. గురువారం జరిగిన సెమీస్‌లో సౌతాఫ్రికా 8 వికెట్ల తేడాతో కంగారూలను చిత్తుచేసింది. ఆసీస్ నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా 17.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వన్‌డౌన్‌లో వచ్చిన బాష్‌తో పాటు లారా వొల్వార్డ్ (42) కూడా ధాటిగా ఆడారు. కాగా, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 134 పరుగులు చేసింది. బెత్ మూనీ (44) రాణించింది.

● **విండీస్-కివీస్ సెమీస్ నేడు**

వెస్టిండీస్, న్యూజిలాండ్‌లు శుక్రవారం జరిగే రెండో సెమీస్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. 2009, 2010 టోర్నీల్లో ఫైనల్ చేరిన న్యూజిలాండ్..మళ్లీ తుదిపోరుకు చేరుకోవాలనే పట్టుదలతో ఉంది. 2016లో టైటిల్ నెగ్గిన విండీస్.. 2018లో సెమీస్‌కు చేరుకొంది.

### వివాన్‌కు రజతం..అనంత్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** షూటింగ్ ప్రపంచ కప్ ఫైనల్లో భారత షూటర్లకు మరో 2 పతకాలు లభించాయి. వివాన్ కపూర్ రజతం, అనంత్‌జీత్ సింగ్ నరూక కాంస్యం దక్కించుకున్నారు. గురువారం జరిగిన పురుషుల ట్రాప్ ఈవెంట్ ఫైనల్స్‌లో వివాన్ 44 పాయింట్లు షూట్ చేసి రెండోస్థానంలో నిలిచాడు. ఇక, పురుషుల స్కీట్ ఈవెంట్ ఫైనల్స్‌లో అనంత్‌జీత్ సింగ్ 43 పాయింట్లు స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచాడు.

## ఇంగ్లండ్ లక్ష్యం 297

**ముల్తాన్:** స్పిన్నర్ సాజిద్ ఖాన్ విజృంభించడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ పట్టుబిగించింది. 297 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా ఆటకు మూడో రోజైన గురువారం రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 36/2తో నిలిచింది. విజయానికి ఇంగ్లండ్ ఇంకా 261 పరుగుల దూరంలో ఉంది. కాగా, ఓవర్‌నైట్ స్కోరు 239/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ 291 పరుగులకు ఆలౌటైంది. సాజిద్ 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 75 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ 221 పరుగులకు కుప్పకూలింది. పాక్ మొదటి ఇన్నింగ్స్‌లో 366 పరుగులు సాధించింది.

---

# ఇన్ఫీ లాభం రూ.6,506 కోట్లు

ఒక్కో షేరుకు రూ.21 డివిడెండ్

**ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వృద్ధి అంచనా 3.75-4.50 శాతానికి పెంపు**



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25).. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) ఇన్ఫోసిస్ రూ.6,506 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోలిస్తే లాభం 4.7 శాతం అధికమిది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోల్చినా లాభం 2.2 శాతం పెరిగింది. కాగా, ఈ క్యూ2లో ఇన్ఫీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4.2 శాతం పెరిగి రూ.40,986 కోట్లుగా నమోదైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను 3.75-4.50 శాతానికి పెంచింది. గత త్రైమాసిక ఫలితాల విడుదల సందర్భంగా ప్రకటించిన 3-4 శాతం ఆదాయ వృద్ధి అంచనా కంటే ఎక్కువ ఇది. కంపెనీకి కీలక ఆదాయ విభాగమైన ఆర్థిక సేవల రంగంలో క్లయింట్ల డీల్స్ పునరుద్ధరణ ఇందుకు దోహదపడనుందని కంపెనీ అభిప్రాయపడింది. అంతేకాదు, కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను పెంచడం ఇది రెండోసారి. జూలైలోనూ అంచనాను 1-3 శాతం నుంచి 3-4 శాతానికి పెంచింది.

{ ఈ క్యూ2లో త్రైమాసిక ప్రాతిపదికన 3.1 శాతం స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధిని నమోదు చేయగలిగాం. ఆర్థిక సేవల రంగంలో డీల్స్ పునరుద్ధరణ ఇందుకు దోహదపడింది. అంతేకాదు, గత మూడు నెలల్లో 240 కోట్ల డాలర్ల బడా డీల్స్ దక్కించుకోగలగడం మార్కెట్లో మా ప్రత్యేక స్థానాన్ని ప్రతిబింబింపజేస్తుంది. }

సలీల్ పరేఖ్, ఎండీ, సీఈఓ, ఇన్ఫోసిస్

### ఉద్యోగుల సంఖ్యలో 2,456 పెరుగుదల

వరుసగా ఆరు త్రైమాసికాలుగా తగ్గుతూ వస్తున్న ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్యకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య నికరంగా 2,456 పెరిగి మొత్తం 3,17,788కి చేరుకుంది. అయితే, గత త్రైమాసికంలో ఉద్యోగుల వలసల రేటు మాత్రం 12.9 శాతానికి పెరిగింది. ఈ క్యూ1లో వలసల రేటు 12.7 శాతంగా నమోదైంది.

### 240 కోట్ల డాలర్ల బడా డీల్స్

గత త్రైమాసికంలో కంపెనీ 240 కోట్ల డాలర్ల విలువైన బడా డీల్స్‌ను దక్కించుకుంది. బడా డీల్స్ పుంజుకున్న నేపథ్యంలోనే కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాలను మరింత పెంచింది.

### డివిడెండ్ రికార్డు తేదీ అక్టోబరు 29

ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.21 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. డివిడెండ్‌కు అర్హులైన షేర్‌హోల్డర్లను గుర్తించేందుకు రికార్డు తేదీని అక్టోబరు 29గా నిర్ణయించింది. వచ్చే నెల 8న డివిడెండ్ చెల్లించనున్నట్లు సంస్థ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు మొత్తం రూ.46 డివిడెండ్ చెల్లించింది.

## 2 నెలల కనిష్ఠ స్థాయికి సూచీలు

### సెన్సెక్స్ 495 పాయింట్లు పతనం

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజు నష్టపోయి రెండు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 596 పాయింట్ల వరకు పతనమై 81,000 స్థాయిని సైతం కోల్పోయింది. చివరికి 494.75 పాయింట్ల నష్టంతో 81,006.61 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 221.45 పాయింట్లు కోల్పోయి 24,749.85 వద్దకు జారుకుంది. సూచీలకిది రెండు నెలల కనిష్ఠ ముగింపు స్థాయి. బ్యాంకింగ్, వాహన, స్థిరాస్తి రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మన మార్కెట్ నుంచి పెట్టుబడులను తరలిస్తుండటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులోనే రూ.6.03 లక్షల కోట్లు తగ్గి రూ.457.25 లక్షల కోట్లకు (5.44 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

**గట్టెక్కిన హ్యుండయ్ ఐపీఓ:** హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.27,870 కోట్ల మెగా ఐపీఓ మొత్తానికి గట్టెక్కింది. గురువారంతో ముగిసిన ఈ ఇష్యూకు 2.37 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. రిటైల్, సంస్థాగతేతర ఇన్వెస్టర్లు పెద్దగా ఆసక్తి చూపనప్పటికీ, సంస్థాగత పెట్టుబడిదారుల బిడ్లతో పూర్తి సబ్‌స్క్రిప్షన్‌ను సాధించగలిగింది.

# బిజినెస్

## హైదరాబాద్‌పై సత్వ గ్రూప్ ప్రత్యేక దృష్టి

అవకాశం వస్తే ఆంధ్రప్రదేశ్‌కూ విస్తరిస్తాం

సంస్థ వైస్ ప్రెసిడెంట్ శివమ్ అగర్వాల్

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):** బెంగళూరు కేంద్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ సత్వ గ్రూప్ హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా వచ్చే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో హైదరాబాద్‌లోని కోకాపేటలో 15 ఎకరాల్లో 1,500 ఫ్లాట్లతో మరో భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపడుతోంది. సత్వ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ శివమ్ అగర్వాల్ ఈ విషయం వెల్లడించారు. డేటా కేంద్రాలు, వాణిజ్య స్థాయి కార్యాలయాల నిర్మాణంతోపాటు రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు సంబంధించి తమ గ్రూప్‌నకు బెంగళూరు, హైదరాబాద్ అత్యంత కీలక మార్కెట్లని అగర్వాల్ తెలిపారు మౌలిక సదుపాయాలు, ఐటీ రంగం పుంజుకుంటే భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, వైజాగ్‌కూ విస్తరించే విషయాన్నీ పరిశీలిస్తామని చెప్పారు.

### 4 ఎన్‌బీఎఫ్‌సీలపై ఆర్‌బీఐ వేటు

**ముంబై:** అడ్డగోలుగా నిబంధనలను తుంగలో తొక్కుతున్న నాలుగు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వేటు వేసింది. బెంగళూరు కేంద్రంగా పనిచేసే నవీ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, ఢిల్లీ కేంద్రంగా ఉన్న డీఎంఐ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్‌కతా కేంద్రంగా పనిచేసే ఆరోహణ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, చెన్నైకి చెందిన ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ అనే నాలుగు ఎన్‌బీఎఫ్‌సీలు కొత్తగా రుణాల మంజూరు, పంపిణీ చేయకుండా నిషేధం విధించింది. ఈ నెల 21వ తేదీ నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుంది.

### కేవీబీ లాభంలో 25 శాతం వృద్ధి

**చెన్నై:** కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.473.60 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.378.45 కోట్లు)తో పోల్చితే లాభం 25.13 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.2,335.97 కోట్ల నుంచి రూ.2,856.01 కోట్లకు పెరిగింది. అంచనాలకు తగ్గట్టుగానే సెప్టెంబరు త్రైమాసికంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరిచినట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ రమేశ్ బాబు తెలిపారు. ఈ కాలంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 15.85 శాతం వృద్ధితో రూ.915 కోట్ల నుంచి రూ.1,060 కోట్లకు పెరగగా నికర వడ్డీ మార్జిన్ 4.07 శాతం నుంచి 4.11 శాతానికి పెరిగింది.

### ధనలక్ష్మీ బ్యాంక్ ఆదాయం రూ.381 కోట్లు

**చెన్నై:** ధనలక్ష్మీ బ్యాంక్ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.380.64 కోట్ల ఆదాయంపై రూ.25.81 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.327.43 కోట్లు, లాభం రూ.23.16 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో వడ్డీ ఆదాయం రూ.303.90 కోట్ల నుంచి రూ.328.83 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ స్థూల ఎన్‌పీఏ 3.82 శాతానికి, నికర ఎన్‌పీఏ 1.12 శాతానికి తగ్గింది.

# విప్రో బోనస్ బొనాంజా




**వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీ**

- దాదాపు 22 లక్షల మంది చిన్న షేర్‌హోల్డర్లకు లబ్ధి
- సెప్టెంబరు త్రైమాసిక లాభంలో 21 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ:** దేశీయ ఐటీ సేవల కంపెనీ విప్రో బోనస్ షేర్ల బొనాంజా ప్రకటించింది. అమెరికన్ డిపాజిటరీ షేర్స్ (ఏడీఎస్) హోల్డర్లు సహా కంపెనీ వాటాదారులందరికీ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయాలని విప్రో బోర్డు సిఫారసు చేసింది. అంటే.. వాటాదారు కలిగిన ప్రతి ఒక్క విప్రో షేరుకు గాను మరో షేరు బోనస్‌గా లభించనుంది. ఈ సెప్టెంబరు 30 నాటికి ఉన్న ఉచిత రిజర్వ్ లేదా సెక్యూరిటీస్ ప్రీమియం అకౌంట్ లేదా కంపెనీ క్యాపిటల్ రిడంప్షన్ రిజర్వ్ అకౌంట్ నుంచి బోనస్ ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారం అందించింది. అయితే, ఈ ప్రతిపాదనను షేర్‌హోల్డర్లు ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కంపెనీ బోనస్ షేర్ల జారీకి అర్హులైన వాటాదారులను గుర్తించేందుకు రికార్డు తేదీని ప్రకటిస్తుంది.

ఈ డిసెంబరు 15 నాటికి కంపెనీ అర్హులైన వాటాదారులకు కేటాయించవచ్చని అంచనా. విప్రో బోనస్ షేర్ల జారీ రిటైల్ షేర్‌హోల్డర్లకు శుభవార్తే. ఈ సెప్టెంబరు 30 నాటికి విప్రో షేర్లు కలిగిన చిన్న షేర్‌హోల్డర్ల సంఖ్య దాదాపు 22 లక్షల స్థాయిలో ఉంది. విప్రో బోనస్ షేర్లు జారీ చేయడం 2019 తర్వాత ఇదే తొలిసారి. అలాగే, కంపెనీ చరిత్రలో ఇది 14వ సారి. గురువారం బీఎస్ఈలో కంపెనీ షేరు 0.65 శాతం నష్టపోయి రూ.528.80 వద్ద ముగిసింది.

### లాభం రూ.3,209 కోట్లు

సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో విప్రో లాభం వార్షిక ప్రాతిపదికన 21.2 శాతం వృద్ధి చెంది రూ.3,208.8 కోట్లకు చేరుకుంది. ఆదాయం మాత్రం 0.95 శాతం తగ్గి రూ.22,301.6 కోట్లకు పరిమితమైంది. అయితే, డిసెంబరుతో ముగియనున్న త్రైమాసికానికి స్థిర కరెన్సీ ఆదాయ వృద్ధి అంచనాను మైనస్ 1-ప్లస్ 1 శాతం స్థాయి నుంచి మైనస్ 2 నుంచి సున్నా శాతానికి తగ్గించింది.

### ఆఫర్ లెటర్లు ఇచ్చినవారందరికీ ఉద్యోగం

గతంలో ఆఫర్ లెటర్లు జారీ చేసిన ఫ్రెషర్లందరినీ ఈ ఏడాది చివరినాటికల్లా ఉద్యోగంలో చేర్చుకుంటామని విప్రో చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్ స్పష్టం చేశారు. ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలను 6 నెలల నుంచి 2 ఏళ్ల వరకు వాయిదా వేస్తూ వస్తున్నాయంటూ ఈ మధ్య వార్తలు వచ్చిన నేపథ్యంలో గోవిల్ వివరణ ఇచ్చారు.

"ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1) నుంచి ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకుంటున్నాం. క్యూ1, క్యూ2లో 2,500- 3,000 మంది చొప్పున కంపెనీలో చేర్చుకోవడం జరిగిందని" గోవిల్ అన్నారు. కాగా, సెప్టెంబరు 30 నాటికి కంపెనీలో మొత్తం 2,33,889 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

### జీఆర్‌టీ జువెలర్స్ స్వర్ణ దీపావళి ఆఫర్లు

**హైదరాబాద్:** జీఆర్‌టీ జువెలర్స్ దీపావళి పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో స్వర్ణ దీపావళి, తమిళనాడులో తంగా దీపావళి పేరుతో వినియోగదారులకు ఈ ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీపావళి సందర్భంగా జీఆర్‌టీ జువెలర్స్‌లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వినియోగదారులకు 'సిల్వర్ ఫర్ గోల్డ్' ఆఫర్ కింద దానికి సమాన బరువు గల వెండిని పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. జీఆర్‌టీ జువెలర్స్ 60వ వార్షికోత్సవం సందర్భంగా ఈ దీపావళికి వజ్రాలపై క్యారెట్‌కు 25 గ్రాముల వెండి, అన్ కట్ డైమండ్స్‌పై క్యారెట్‌కు 2 గ్రాముల వెండి, ప్లాటినం ఆభరణాల బరువుకు సమానమైన వెండిని ఉచితంగా అందించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ వెల్లడించారు. అలాగే వెండి వస్తువుల (ప్రత్యేక వస్తువులు మినహాయించి) మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు సహా గిఫ్ట్ ఆర్టికల్స్ ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపును ఆఫర్ చేస్తున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.



| బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో) | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 78,110 ▲ | 71,600 ▲ | 1,03,000 ▲ |
| ముంబై | 76,810 ▲ | 70,358 ▲ | 91,600 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| 18వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 485 | విజయవాడ | 510 |
| వరంగల్ | 487 | గోదావరి | 505 |
| చిత్తూరు | 538 | విశాఖపట్నం | 505 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 120 | విజయవాడ | 130 |
| వరంగల్ | 120 | గుంటూరు | 130 |
| కరీంనగర్ | 120 | ఒంగోలు | 130 |
| మహబూబ్‌నగర్ | 120 | చిత్తూరు | 129 |
| కర్నూలు | 120 | నెల్లూరు | 129 |
| విశాఖపట్నం | 125 | అనంతపురం | 129 |
| గోదావరి | 130 | | |



# గోదారి తీరంలో పద్మల్‌పూరి కాకో జాతర

వేడుక

తెలంగాణలో ఏకైక ఆదివాసీ గిరిజన దైవ మందిరం... పద్మల్‌పూరి కాకో అమ్మవారి దేవాలయం. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు దగ్గర... గోదావరి నది తీరాన ఉన్న ఈ ఆలయ పరిసరాలు ప్రతి ఏటా ఆశ్వయుజ పౌర్ణమి నుంచి జనసందోహంతో నిండిపోతాయి. దసరా అనంతరం వచ్చే పౌర్ణమి నాడు ఆరంభమయ్యే దండారీ, గుస్సాడీ ఉత్సవాలు దీపావళి అమావాస్య వరకూ అత్యంత వైభవంగా జరుగుతాయి. రాష్ట్రం నలుమూలల నుంచి గిరిజనులు కుటుంబసమేతంగా తరలివచ్చి, కాకో అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆదివాసీ-గోండు సంస్కృతిలో ఆటపాటలకు ఉన్న ప్రాధాన్యానికి ఈ వేడుకల్లో ప్రదర్శించే నృత్యాలు అద్దం పడతాయి. గిరిజన సంప్రదాయాలు, కట్టుబాట్లు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. కొత్తగా పెళ్లైన జంటలతో... ఆలయంలో అమ్మవారి ముందు 'భేటీ' (కొత్త కోడళ్ల పరిచయం) కార్యక్రమం నిర్వహిస్తారు. గిరిజనులు గోదారమ్మతల్లికి, నది పరీవాహక ప్రాంతాల్లో ఉండే దేవతలకు పూజలు చేస్తారు. అనంతరం సామూహిక విందు భోజనాలు చేస్తారు. ఉత్సవ దినాల్లో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయి.

గోదావరి ఒడిలో వికసించిన గిరిజన సంస్కృతి ఎంతో



ప్రాచీనమైనది, వైవిధ్యభరితమైనది. నాసిక్‌లో మొదలయ్యే గోదావరి నది పలు ప్రాంతాల మీదుగా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తుంది. ఆ గమ్యం చేరేలోపు ఎన్నో గిరిజన ప్రాంతాలు, దేవాలయాల మీదుగా ముందుకు సాగుతుంది. గోదావరితో గిరిజనులది విడదీయరాని బంధం. అందుకే గోదావరి పరీవాహక ప్రదేశాన్ని 'ఆదివాసీల పుట్టినిల్లు' అని పిలుస్తారు.

పద్మల్‌పూరి కాకో దేవాలయం తెలంగాణలో ఆదివాసీల ఏకైక దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. చాలా పురాతనమైన ఈ ఆలయం గుడిరేవు గ్రామానికి కిలోమీటర్ దూరంలో... గోదావరి తీరంలో ఉంది. గోండు, ప్రధాన్, కోలాం, తోటీ తదితర ఆదివాసీ తెగలవారు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, జైనూర్, గుడిహత్నూర్, ఇచ్చోడ, బోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, తిర్యాణితోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి గిరిజనులు ఇక్కడికి వస్తుంటారు. ఉత్సవాల సందర్భంగా పురుషులు తలపై నెమలి పింఛాలు అలంకరించుకొని చేసే గుస్సాడీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మహిళలు సైతం తమ సంప్రదాయ పద్ధతిలో ఏకరూప దుస్తులు ధరించి నృత్యాలు చేస్తారు. దేవతలను కొలుస్తూ పాటలు పాడుతారు.

**ఆలయ విశిష్టతలు....**

పద్మల్‌పూరి కాకోబాయి ఆలయాన్ని సందర్శిస్తే కోరికలు నెరవేరుతాయనే నమ్మకం గిరిజనుల్లో ఉంది. ఉత్సవాలకు ఒకరోజు ముందుగానే ఇక్కడికి వచ్చి గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం చేస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతియేటా దీపావళికి మూడు రోజుల ముందు దర్బార్ నిర్వహిస్తారు. అది ఈ నెల 28వ తేదీన జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, గుస్సాడీ, దండారీ నృత్యాల ప్రత్యేకతల గురించి, నెమలి పింఛం విశిష్టత గురించి తెలియజేస్తారు. ఈ ఆలయంలో నిష్ఠతో పూజలు చేస్తే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖ శాంతులు కలుగుతాయని, పాడి పంటలు, పశుసంపద పెంపొందుతాయని గిరిజనులు విశ్వసిస్తారు. పూర్వం దేవతా విగ్రహం ప్రాచీనమైన చెట్టుకింద కొలువు తీరి ఉండేది. ఆ తరువాత అన్ని హంగులతో ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం రెండు చోట్లా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో పుష్య మాసంలో 'పెర్సాపేన్' (జల్లిదేవర) పూజలు జరుగుతాయి.

**అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు....**

పద్మల్‌పూరి కాకో అమ్మవారి కోసం పిండి పదార్థాలతో గిరిజనులు ప్రత్యేక నైవేద్యాలు తయారుచేస్తారు. పెసలు, వినుములు, బబ్బెర (బొబ్బర్ల) గారెలు, దంచిన బియ్యంతో అరిసెలు తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. నువ్వులు, పల్లీలు గానుగ పట్టి తీసిన నూనెను వంటకాలకు ఉపయోగిస్తారు. మరికొందరు కోళ్లు, మేకలతో మొక్కులు తీర్చుకుంటారు.

• దేగ సత్యం, మంచిర్యాల.





గీతాసారం

## ఆచరణతో మార్గదర్శకత్వం

ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి చిన్నపిల్లలు ఎప్పుడూ తమ తల్లితండ్రుల మార్గదర్శకత్వం కోసం చూస్తారు. తద్వారా కొత్త విషయాలు, మర్యాదలు, ప్రవర్తనలు తదితరాలను నేర్చుకుంటారు. మన మాటలకు, చేతలకు మధ్య సామరస్యంతో వారికి ఉదాహరణగా నిలుస్తూ ఉండడమే పిల్లల్ని పెంచడానికి ఉత్తమ మార్గం. ఆ తరువాత స్నేహితులు, ఉపాధ్యాయులు, సలహాదారుల్లాంటి వారి మీద వారు ఆధారపడడం కొనసాగుతుంది. అలాగే... మనమీద ఆధారపడే వ్యక్తులు, మార్గదర్శకత్వం కోసం మనవైపు చూసే వ్యక్తులు ఉంటారని కూడా ఇది సూచిస్తోంది. మనం ఏది చేసినా అది వారి మీద ప్రభావం చూపుతుంది. దీని గురించి శ్రీకృష్ణుడు చెబుతూ "శ్రేష్ఠమైన పురుషుడి ఆచరణనే (ప్రవర్తననే) ఇతరులు అనుసరిస్తారు. అతను నెలకొల్పిన ప్రమాణాలనే లోకులందరూ పాటిస్తారు" అన్నాడు. అలాగే "ఓ అర్జునా! ముల్లోకాలలో నాకు కర్తవ్యం అనేదే లేదు. అలాగే నేను పొందాల్సిన వస్తువుల్లో పొందనిది కూడా లేదు. అయినా నేను కర్మ



లలోనే ప్రవర్తిల్లుతున్నాను. ఎప్పుడైనా నేను కర్మలను విస్మరిస్తే లోకానికి గొప్ప హాని సంభవిస్తుంది. ఎందుకంటే మనుషులందరూ అన్ని విధాలుగా నన్నే అనుసరిస్తారు. నేను కర్మలను ఆచరించడం మానేస్తే లోకాల్లో అల్లకల్లోలాలు చెలరేగుతాయి. లోకాలన్నీ నశిస్తాయి. అంతేకాదు, ప్రజానష్టం వాటిల్లుతుంది. అప్పుడు వాటన్నిటికీ నేనే కారణమవుతాను" అని చెప్పాడు.

ఈ విషయాలన్నీ పరమాత్మ స్థాయి నుంచి మనకు శ్రీకృష్ణుడు తెలియజేస్తున్నాడు. సృష్టి, నిర్వహణ, విధ్వంసంతో కూడిన సృజనాత్మకత స్థాయి నుంచి బోధిస్తున్నాడు. ఒక రైతు విత్తనాలను నాటినప్పుడు అవి మొలకెత్తడానికి కారణం సృజనాత్మకత. సృజనాత్మకత ఆగిపోతే... విత్తనాలు వృథా అవుతాయి. మొలకెత్తిన తరువాత పంట ఎదగకపోతే... అది కూడా గందరగోళానికి దారి తీస్తుంది. పెరిగిన తరువాత పంట పండకపోతే... అది ముందు తరాలను నాశనం చేస్తుంది. ఇవన్నీ సృజనాత్మకత తన చర్యను ఆపివేస్తే ఎదురయ్యే పరిణామాలు. ఈ ఉదాహరణ ద్వారా... శ్రీకృష్ణుడు చెప్పినదాన్ని మనం అర్థం చేసుకోవడం సులభం అవుతుంది. ఈ విశ్వంలో కనిపించే, కనిపించని స్వయంచాలకత్వం మీద మన జీవితాలు పూర్తిగా ఆధారపడి ఉన్నాయి. సృజనాత్మకత ద్వారా అలసిపోకుండా జరుగుతున్న అనేక కార్యాల కారణంగానే మన మనుగడ సాధ్యమవుతోంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

# తప్పుల్లో పాఠాలు...

చింతన



తప్పును తప్పుగా చూడనివాళ్ళు అదృష్టవంతులు. ఎందుకంటే... వాళ్ళు దాన్ని ఒక పాఠంగా తీసుకుంటారు. తప్పులు చెయ్యడం సర్వసహజమైన విషయం. కానీ ఆ తప్పు మీకు విలువైన పాఠం కావాలి. అదే తప్పు మళ్ళీ మళ్ళీ చేస్తున్నారంటే... మీరు ఇంకా పెద్ద తప్పు చేస్తున్నారని అర్థం. మనం చేసిన తప్పులు కాలం గడిచేకొద్దీ ఎన్నో కష్టాలకు, వేదనకూ కారణం అవుతాయి. మరి ఇది తెలిసినా కూడా తప్పు ఎందుకు చెయ్యాలి?

చెయ్యాల్సిన దాన్ని సరైన రీతిలో కాకుండా... అందుకు వ్యతిరేకంగా చెయ్యడాన్నే 'తప్పు' అంటారు. కొన్ని తప్పులు మనకు తెలియకుండానే జరిగిపోతూ ఉంటాయి. వాటిని గుర్తించి, ఎప్పటికప్పుడు పాఠాలు నేర్చుకుంటేనే మనం పురోగతి సాధించగలం. మనం చేసిన తప్పులు అందరికన్నా మనకే బాగా తెలుస్తాయి. "నేను అలా చెయ్యలేదు, నేను అమాయకుణ్ణి" అని మనం వాదించవచ్చు. వేరే వ్యక్తులమీదకు దాన్ని నెట్టేసి తప్పించుకోవచ్చు. కానీ అది చేసింది మనమేనని మన అంతరాత్మకు తెలుసు. కాబట్టి మిమ్మల్ని మీరు మోసగించుకోకండి. తప్పును అంగీకరించండి. అదే మిమ్మల్ని ఉన్నతులుగా మార్చుతుంది. అలాగే ఇతరుల్లో తప్పును ఎత్తి చూపడానికి ముందు... "నేను అలాంటి తప్పు ఎప్పుడైనా చేశానా? అతనికన్నా నేను ఎలా భిన్నమైన వ్యక్తిని?" అని ఆలోచించండి. ఆ వ్యక్తి చేసిన తప్పును పదే పదే ఎత్తి చూపడం కన్నా... అతను దాన్ని ఎలా సరిదిద్దుకోగలడో ఆలోచించండి. ఆ మార్గాన్ని అతనికి బోధించండి. ఇతరులు తప్పు చేస్తున్నారని పదే పదే ఆక్షేపించడం కూడా ఒక తప్పే. అలాగే వేరేవారిలో తప్పులు వెతకడం, సమయం, సందర్భం లేకుండా వాటి గురించి మాట్లాడడం కూడా తప్పే. ఒకే తప్పును మూర్ఖులు పదే పదే చేస్తూ ఉంటారు. వాటి నుంచీ పాఠాలను ఎన్నటికీ నేర్చుకోరు. తెలివైన వాళ్ళు తమ సొంత తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటారు. వివేకవంతులు ఇతరుల తప్పులను పాఠాలుగా స్వీకరిస్తారు.

• శ్రీశ్రీ రవిశంకర్

సద్బోధ

# సద్గురువు ఉండే చోటు

పూర్వం ఒక రాజు ఉండేవాడు. అతనికి పాలనా వ్యవహారాలతో, ఎత్తుగడలతో, ఆడంబరమైన జీవితంతో విసుగు పుట్టింది. ప్రశాంతత కోసం ఆధ్యాత్మికతవైపు అడుగులు వెయ్యాలనుకున్నాడు. ఒక రోజు "ఇక ఆలస్యం చెయ్యకూడదు. ఎలాగైనా సద్గురువును ఆశ్రయించాల్సిందే" అని నిర్ణయించుకున్నాడు. అప్పుడు అతనికి కొంతకాలం క్రితం తనను కలిసిన ఒక వృద్ధుడు "సద్గురువు అంటే అసలైన జ్ఞాని. అలాంటి వ్యక్తి అత్యంత సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు" అని చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే... అలాంటి వ్యక్తి కోసం రాజు అన్వేషణ మొదలుపెట్టాడు. ఎన్నో ఊర్లు తిరిగాడు, ప్రతి ఆలయాన్ని, ఆశ్రమాన్ని, మఠాన్ని గాలించాడు. ఎందరో ప్రసిద్ధ గురువులను కలిశాడు. కానీ వారిలో ఎవరూ తనకు జ్ఞానమార్గం చూపే సద్గురువుగా అతనికి అనిపించలేదు. ఎవరిలో చూసినా ఆడంబరం, అహంకారం కనిపించాయి. 'నాకు కావలసింది అహంకారంతో, ఆడంబరంగా మాట్లాడే పండితులు, శాస్త్రకోవిదులు కాదు. జ్ఞానజ్యోతిని దర్శించి, సత్యాన్నే మాట్లాడే సద్గుణ సంపన్నుడైన వ్యక్తి. అలాంటి వారు ఎక్కడా లేరు" అనుకొని, తిరిగి రాజధానికి చేరుకున్నాడు.



అంతకుముందు తనకు బోధ చేసిన వృద్ధుణ్ణి కలుసుకొని "మీరు మీ మాటలతో నన్ను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. మీ మాటలు నమ్మి ఏళ్ళ తరబడీ రాజ్యమంతా గాలించాను. సద్గురువులా అనిపించేవారు ఒక్కరూ కనబడలేదు" అన్నాడు.


అప్పుడు ఆ వృద్ధుడు "మహారాజా! మీరు ఏయే ప్రాంతాల్లో వెతికారో వివరంగా చెబుతారా?" అని అడిగాడు. రాజు తను వెతికిన మఠాలు, మందిరాలు, ఆశ్రమాల గురించి చెప్పాడు. అవన్నీ పేరు ప్రఖ్యాతులు కలిగిన గురువులు నివసించే స్థలాలే. అంతా శ్రద్ధగా విన్న ఆ వృద్ధుడు "మహారాజా వెతకరాని చోట వెతికి... విలువైన మీ సమయాన్ని వ్యర్థం చేసుకున్నారు. నిజమైన సద్గురువులు అతి సామాన్యులుగా ఉంటారని చెప్పాను కదా! వాళ్ళు అలాంటి వైభవోపేతమై ప్రదేశాల్లో ఎందుకుంటారు? ఏ వీధి మూలనో, పాడుబడిన ఇంటి సమీపంలోనో, చెత్తను పారేసే ప్రదేశాల దగ్గరలోనో ఉంటారు. ఎవరి నుంచీ ఎలాంటి ప్రత్యేక గౌరవాన్నీ ఆశించరు. దొరికిన తిండి తింటూ, అరకొర వస్త్రాలు ధరిస్తూనో, ధరించకుండానో జీవిస్తూ ఉంటారు" అన్నాడు.

ఆ వృద్ధుడి మాటలనే రాజు తలచుకుంటూ మరునటి రోజు ఉదయం తన మందిరం మేడ మీద కూర్చున్నాడు. వీధిలో వస్తూ, పోతూ ఉండేవారిని చూస్తున్నాడు. ఇంతలో ఒక యాచకుడు వచ్చాడు. రాజభవనం ప్రధాన ద్వారం ముందు నిలిచి భిక్ష అడుగుతున్నాడు. అతని నడకలో, మాటలో, చూపులో రాజుకు ఏదో ప్రత్యేకత కనిపించింది. మెట్లు దిగి వచ్చాడు. యాచకుడి ముందు నిలబడి, పలకరించాడు. ఇద్దరి మధ్య సంభాషణ నడిచింది. తను వెతుకుతున్న సద్గురువు అతనేననే జ్ఞానం రాజుకు కలిగింది. నిజానికి ఆ యాచకుడు రోజూ రాజమందిరం ముందుకు వస్తూనే ఉన్నాడు. ఇంతకాలం అధికార దర్పం, అహంకారం రాజు కళ్ళను కప్పేశాయి. ఆ యాచకుడిలోని జ్ఞానిని గుర్తించకుండా చేశాయి. ఒక సందర్భంలో ఈ కథను భగవాన్ రజనీశ్ (ఓషో) చెబుతూ" అహంకారాన్ని వదులుకొని, జ్ఞానం కోసం తపించిన రోజున సద్గురువు తనంతట తానే మన ముందుకు వచ్చి దర్శనమిస్తాడు. మన జ్ఞాన దాహాన్ని తీరుస్తాడు" అని వివరించారు.

• రాచమడుగు శ్రీనివాసులు

# రక్షించేవి పూర్వ పుణ్యాలే

సుభాషితం



వనే రణే శత్రు జలాగ్ని మధ్యే
మహార్ణవే పర్వత మస్తకేవా
సుప్తం ప్రమత్తం విషమ స్థితిం వా
రక్షంతి పుణ్యాని పురాకృతాని... అంటూ మంచి కర్మలు చేయడం వల్ల కలిగే ఫలితాన్ని తన 'నీతి శతకం'లో భర్తృహరి వివరించాడు. ఆ శ్లోకాన్ని తెలుగులో...

కాననమున రణమున సలిలానల రిపు మధ్యమున
మహాబ్ధి నగాగ్ర
స్థానమున మత్తు నిద్రితుం
బూనికతో బూర్వపుణ్యములు రక్షించున్... అని ఏనుగు లక్ష్మణ కవి అనువదించాడు.

**భావం:** మనిషి కీకారణ్యంలో ఉన్నా, యుద్ధంలో శత్రువులు చుట్టుముట్టి ఉన్నా, అగ్నిజ్వాలల మధ్య చిక్కుకుపోయినా, మహాసముద్రంలో మునిగిపోతున్నా, ఒళ్ళు తెలియని మత్తుతో నిద్రావస్థలో ఉన్నా పురాకృతమైన (అంతకు ముందు లేదా పూర్వజన్మలో చేసిన) మంచిపనుల వల్ల వచ్చిన పుణ్యమే అతణ్ణి కాపాడుతుంది. రోజులన్నీ ఒకేలా ఉండవు. కష్టాలు వస్తాయి. అలాంటి కష్టాలను తేలికగా అధిగమించాలంటే... ఎప్పుడూ మంచి పనులు చేస్తూ ఉండాలి.

తెలుసుకుందాం

## శివతాండవం ప్రాచీన భారతీయ నృత్య రూపాలన్నిటికీ మూలం

నాట్య శాస్త్ర సృష్టికర్త మహా శివుడని పురాణాలు చెబుతున్నాయి. నాట్య కళను తన వాహనమైన నందీశ్వరుడికి ఆయన అనుగ్రహించాడు. ఆ విద్యను తనకు నేర్పాలని బ్రహ్మదేవుడు కోరగా... శివుడి ఆనతి మేరకు బ్రహ్మకు దాన్ని నందీశ్వరుడు ఉపదేశించాడు. బ్రహ్మదేవుడు నాట్యవేదాన్ని రచించాడని, దానినే భరతముని నాట్య శాస్త్ర రూపంలో లోకానికి అందించాడనీ అంటారు. భారతీయ శాస్త్రీయ నృత్య రూపాలన్నిటికీ మూలం.. మహా శివుడి తాండవం. ఆ శివతాండవం... ప్రాచీన నృత్యరీతులుగా పరిణామం చెందిన తీరు ఇది.

# నాట్యానికి మూలం శివతాండవమే!




శివతాండవం



బ్రహ్మ



నాట్యవేదం
36 వేలకు పైగా శ్లోకాలు



భరతముని
(వేదకాలం నాటి యోగి)



నాట్యశాస్త్రం
6 వేలకు పైగా శ్లోకాలు





ప్రధానమైన అంశాలు



- భావప్రకటనలు, భావోద్వేగాలు (రసాలు, భావాలు)
- హస్తాభినయాలు (ముద్రలు)
- సంగీతం (రాగాలు, తాళాలు)
- ఛందాలు లయ విన్యాసాలు/ రిథమిక్ ప్యాటర్న్
- సాహిత్యం (పద్యం, గీతం, సంభాషణ)
- దుస్తులు, అలంకరణ (ఆభరణాలతో సహా)
- శారీరకమైన కదలికలు (ఆంగికాభినయం)
- రంగాలంకరణ (ప్రదర్శించే వేదిక అలంకరణ)
- ప్రేక్షకులను నిమగ్నం చేయడం
- నాట్యం (నాట్యం, నృత్యం, నృత్తం)

# కౌలు రైతులకు రుణాలివ్వండి

» వ్యవసాయ అనుబంధ రంగాలకు తోడ్పాటునివ్వండి

» బ్యాంకర్ల కమిటీకి మంత్రి అచ్చెన్న విజ్ఞప్తి



ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మంత్రి అచ్చెన్నకు మొక్క అందజేస్తున్న అధికారులు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలకు తోడ్పాటు అందించాలని, కౌలు రైతులకు మానవతా దృక్పథంతో రుణాలిచ్చి, వ్యవసాయాభివృద్ధికి సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. అమరావతి సచివాలయంలో గురువారం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో వివిధ బ్యాంకుల లక్ష్యాలు, 2024 ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధించిన ప్రగతి, వార్షిక రుణ ప్రణాళిక, కేంద్ర ప్రాయోజిత పథకాలు, డిజిటల్ పేమెంట్స్ వంటి అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఫైనాన్షియల్ లిటరసీపై ఆర్బీఐ ప్రచురించిన పుస్తకాన్ని అచ్చెన్నాయుడు ఆవిష్కరించి, మాట్లాడారు. 'రాష్ట్రంలో ఈ ఏడాది 9లక్షల మందికి కౌలు గుర్తింపు కార్డులివ్వగా, 2లక్షల మందికే పంట రుణాలిచ్చారు. కౌలు రైతుల పట్ల బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. లక్ష్యం మేరకు రుణాలివ్వాలి' అని కోరారు. ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సహించడానికి బ్యాంకులు ముందుకు రావాలని కోరారు. ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళికలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రాధాన్య రంగాలకు రూ.3.75 లక్షల కోట్ల రుణాలివ్వాలన్న లక్ష్యంలో రూ.1.36లక్షల కోట్ల రుణాలు(36%) పంపిణీచేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. కాగా, రాష్ట్రంలోని తీరప్రాంతాన్ని కేరళ తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో మత్స్యశాఖపై మంత్రి సమీక్ష చేశారు.

## నాణ్యమైన వైద్యసేవలు ప్రజల హక్కు

» ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవల్ని ఆశించే హక్కు ప్రజలకు ఉందని, వారి అంచనాల మేరకు పని చేయడం వైద్య సిబ్బంది బాధ్యతని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రుల నిర్వహణ, సేవల్ని మెరుగుపర్చి, వీటి పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని కలిగించేందుకు రెండునెలల క్రితం రూపొందించిన 30 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళిక అమలుపై గురువారం మంత్రి సమీక్షించారు. అంశాల వారీగా జీజీహెచ్‌ల్లో చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల అధికారులు తమ ప్రయత్నాల్ని, వాటి ఫలితాల్ని ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలపాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి రూ.240 కోట్ల విలువైన డయాగ్నోస్టిక్ పరికరాలు, 725 మంది సహాయకులు, 300 మంది స్టాఫ్ నర్సుల అవసరం ఉందని వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు వివరించారు. వివిధ ఆసుపత్రుల్లో రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్ల కొరత ఉందని చెప్పారు. వీటితోపాటు పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్ల కొరతను తీర్చడానికి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

## ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ సిరి

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ ఎ.సిరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

## 13 మంది సీనియర్ సివిల్ జడ్జీలకు పదోన్నతి

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పని చేస్తున్న 13 మంది సీనియర్ సివిల్ జడ్జీలకు జిల్లా జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా జడ్జీలుగా పదోన్నతి పొందినవారిలో ఎం.ఇందిర ప్రియదర్శిని, వి.భవాని, వై.నాగరాజ, సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, ఎస్.కవిత, ఎం.అనురాధ, సీహెచ్.వెంకట నాగశ్రీనివాసరావు, ఏ.అనిత, పి.రాజారాం, కె.విజయకళ్యాణి, బి.లక్ష్మీనారాయణ, బి.అప్పలస్వామి ఉన్నారు.

## కౌంటర్ దాఖలుకు సమయమివ్వండి

» జెత్వానీ కేసులో హైకోర్టుకు ఏజీ అభ్యర్థన

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో నమోదైన వివిధ కేసులను సీఐడీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. కేసుకి సంబంధించి కౌంటర్ దాఖలు చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

### విద్యాసాగర్ వ్యాజ్యంపై విచారణ వాయిదా

సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో తనకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను హైకోర్టు ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈలోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

## ఖాజీల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి ఫరూక్

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఖాజీల సమస్యలన్నీ ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ఖాజీల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఖాజీల సంఘం ప్రతినిధులు మంత్రికి వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఖాజీనే నియమించాలని కోరారు.

## 'కార్తీకం'లో ఆలయాల్లో పటిష్ఠ ఏర్పాట్లు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో భక్తుల సౌకర్యార్థం దేవాలయాల్లో పటిష్ఠమైన ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. గురువారం ఆలయాల ఈవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భక్తులకు పంపిణీ చేసే ప్రసాదాలతో పాటు అన్నప్రసాదంలోనూ నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఆలయాల బయట ఉండే దుకాణాల్లో ధరలు నియంత్రించడంతో పాటు ధరల పట్టికను కచ్చితంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

## ఎంవీవీకి షరతులతో ముందస్తు బెయిల్

» వైసీపీ మాజీ ఎంపీకి హైకోర్టులో ఊరట

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు గురువారం హైకోర్టులో ఊరట లభించింది. హయగ్రీవ భూముల వ్యవహారంలో అరిలోవ పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయనకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఎంవీవీతో పాటు బిల్డర్ గద్దె బ్రహ్మాజీ, చార్టెడ్ అకౌంటెంట్ జి.వెంకటేశ్వరావుకు ముందస్తు బెయిల్ ఇచ్చింది. రూ.30 వేలతో ఒక్కొక్కరు రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. మూడు నెలల పాటు ప్రతీ నెల 1, 15వ తేదీల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1గంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారి పరిధి దాటి వెళ్లాల్సి వస్తే ప్రయాణ వివరాలను ఆ అధికారికి అందజేయాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం తీర్పు ఇచ్చారు.

## నందిగం బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మరియమ్మ అనే మహిళ హత్య కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసు పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ.. విచారణను వారం రోజులు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

# ఢిల్లీ, చెన్నై మెట్రోలకు డ్రైవర్ రహిత రైళ్లు

### సరఫరా చేసిన శ్రీసిటీలోని అల్‌స్టోమ్ కంపెనీ

శ్రీసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, చెన్నై మెట్రోలకు అత్యాధునిక డ్రైవర్ రహిత మెట్రో రైళ్లను శ్రీసిటీలోని అల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా లిమిటెడ్ సరఫరా చేసింది. పరిశ్రమ ప్రతినిధుల సమాచారం మేరకు.. ఢిల్లీ మెట్రో 4వ దశ విస్తరణ ప్రాజెక్టు కోసం రూ.2,800 కోట్ల ఒప్పందంలో భాగంగా మొదటి విడతగా 52 డ్రైవర్ రహిత మెట్రో పాలిస్ రైలు సెట్లను ఈ ఏడాది సెప్టెంబర్ 23న ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు(డీఎంఆర్‌సీ) అందజేసింది. ఒక్కో రైలు సెట్ ఆరు పెట్టెలను కలిగి ఉంటుంది. ఇందులో 13 రైలు సెట్లను ఏరో సిటీ నుంచి తుగ్లకాబాద్ వరకు కొత్తగా నిర్మించిన 25.8 కిలోమీటర్ల పొడవైన గోల్డ్ లైన్-10 కోసం రూపొందించారు.

### చెన్నై మెట్రోకు 36 రైలు సెట్ల సరఫరా

చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రెండో దశ విస్తరణ ప్రాజెక్టు కోసం 36 డ్రైవర్ రహిత రైలు సెట్లను సరఫరా చేసింది. ఈ కాంట్రాక్ట్ విలువ రూ.1,215.92 కోట్లు. ఒక్కో రైలు సెట్‌లో మూడు పెట్టెలు ఉంటాయి. ఈ రైళ్లు 4వ కారిడార్‌కు సంబంధించిన పూందమల్లి- పోరూరు మధ్య నడవనున్నాయి. 2025 నాటికి రాకపోకలు ప్రారంభం కానున్నాయి. శ్రీసిటీ-అల్‌స్టోమ్‌లో తయారైన ఈ మెట్రోపాలిస్ మెట్రోరైళ్లు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపర్చడంలో, పట్టణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని అల్‌స్టోమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆలివర్ లాయిసన్ పేర్కొన్నారు.



చెన్నై మెట్రోకు పంపిన రైలు

# సైబర్ క్రైమ్.. కేరాఫ్ చైనా, తైవాన్..!



» ఆరు నెలల్లో రూ.8 కోట్లు లూటీ

» టాస్క్‌గేమ్‌లు, ఫెడెక్స్ కొరియర్ పేరిట దోపిడీ

» చైనా, తైవాన్ నుంచి సైబర్ నేరగాళ్ల ముఠా ఆపరేషన్

» వారికి సహకరిస్తున్న ఏడుగురు విశాఖ వాసులు అరెస్టు

» ప్రధాన నిందితుల కోసం గాలింపు: సీపీ శంఖబ్రతబాగ్చి



సాయిరాం, గిరీష్ (నిందితులు)



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు, బ్యాంక్ చెక్‌బుక్‌లు, డెబిట్, క్రెడిట్ కార్డులు

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చైనా, తైవాన్‌ల నుంచి వల వేస్తారు... బెట్టింగ్ యాప్‌లు, టాస్క్‌గేమ్‌లు, ఫెడెక్స్ కొరియర్ పేరు చెప్పి ట్రాప్ చేస్తారు.. బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి సొమ్ములు కాజేస్తారు. తర్వాత ఆ మొత్తాన్ని చైనా, తైవాన్‌లలోని బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసుకుంటారు. ఈ మొత్తం వ్యవహారంలో చైనా, తైవాన్‌లోని సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న విశాఖ పట్నం ముఠాను నగర పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీగా చెక్‌బుక్‌లు, గుర్తింపులేని పత్రాలతో తీసుకున్న సిమ్‌కార్డులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను పోలీస్ కమిషనరేట్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి వెల్లడించారు.

### చైనాలో డ్రైవర్‌గా పనిచేసి వచ్చి..

విశాఖ నగరానికి చెందిన సూర్యమోహన్ చైనాలో చాలాకాలం డ్రైవర్‌గా పనిచేసి.. తర్వాత తిరిగి వచ్చేశాడు. చైనాలో ఉన్నప్పుడు సైబర్ మోసాలకు పాల్పడే ముఠా సభ్యులతో పరిచయం ఏర్పడింది. నగరానికి వచ్చిన తర్వాత తన స్నేహితుడైన విశాలాక్షి నగర్‌కు చెందిన సాయిరాం (28) ఆర్థిక ఇబ్బందులను గమనించి.. బ్యాంకు అకౌంట్ వివరాలు చెబితే చైనా ముఠా డబ్బులు ఇస్తుందని తెలిపాడు. దీంతో సాయిరాం టెలిగ్రాం యాప్‌లో చైనా, తైవాన్‌కు చెందిన వారి గ్రూపుల్లో చేరి తన బ్యాంకు ఖాతా సమాచారం ఇచ్చాడు. దీనికోసం అతనికి నెలకు రూ.5వేలు ఇస్తామని ఆ ముఠా ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం సాయిరాం తన స్నేహితుడైన మద్దిలపాలేనికి చెందిన గిరీష్ కుమార్ (29)ను కూడా అదే గ్రూపులో జాయిన్ చేసి.. అతని బ్యాంకు ఖాతా వివరాలు కూడా ఇప్పించాడు. ఆ తర్వాత వారిద్దరూ మరికొన్ని గ్రూపుల్లో చేరి చైనా, తైవాన్‌లోని సైబర్ నేరగాళ్లకు దగ్గరయ్యారు.

### ఏప్రిల్ నుంచి 8 కోట్లు హాంఫట్

సైబర్ నేరగాళ్లు చైనా, తైవాన్‌ల నుంచి బెట్టింగ్ యాప్‌లు, టాస్క్‌గేమ్‌లు, ఫెడెక్స్ కొరియర్ మోసాలు వంటి సైబర్ నేరాల ద్వారా అమాయకుల నుంచి కొల్లగొట్టిన డబ్బును సాయిరాం, గిరీష్ ద్వారా ఇక్కడి బ్యాంకు ఖాతాల్లో జమ చేయించేవారు. ఆ తర్వాత వాటిని తాము చెప్పిన చైనా, తైవాన్ బ్యాంకు ఖాతాలకు బదలాయింపు చేసుకునేవారు. ఈ కార్యకలాపాల కోసం సాయిరాం, గిరీష్‌లు విశాలాక్షి నగర్‌లోని అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాట్, కాల్‌సెంటర్ కోసమంటూ బీచ్ రోడ్డులోని ఏఎస్‌బీచ్ ఆస్పత్రి సమీపంలో మరో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. కాల్‌సెంటర్‌లోకి ఎనిమిది మంది యువతులను ఉద్యోగంలోకి తీసుకున్నారు. విశాలాక్షి నగర్‌లోని ఫ్లాట్‌లో కొరియర్ ద్వారా వచ్చే బ్యాంకు ఖాతాల వివరాలు, ఖాళీ సిమ్‌కార్డులు, డెబిట్ కార్డులు, సెల్‌ఫోన్లను భద్రపరిచేవారు. ఎవరైనా టెలిగ్రాం యాప్, బెట్టింగ్ యాప్‌ల ద్వారా చైనా, తైవాన్‌లోని సైబర్ నేరగాళ్లకు కనెక్ట్ అయితే డబ్బు డిపాజిట్ కోసం ఒక అకౌంట్ నంబర్‌ను వారికిచ్చేవారు. ఆ అకౌంట్ వివరాలతోపాటు, ఏ సిమ్ కార్డు వాడాలనేది చైనా, తైవాన్ ముఠా నిర్దేశించేది.

### బాధితులు ఫిర్యాదు చేస్తే సిమ్ బ్లాక్

బాధితులు ఎవరైనా తాము మోసపోయామని ఎక్కడైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే సైబర్ నేరగాళ్లు వెంటనే ఆ బ్యాంకు ఖాతా, సిమ్ కార్డుని బ్లాక్ చేసేవారు. ఇలా పోలీసులకు చిక్కకుండా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.8 కోట్లు వరకూ కొల్లగొట్టారు. దీనిపై గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన నిఘా విభాగం పోలీసులు సీపీ శంఖబ్రతబాగ్చికి సమాచారం అందజేశారు. దీంతో బుధవారం రాత్రి రెండు చోట్ల దాడిచేసిన పోలీసులు కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్న ముగ్గురు యువతులు, విశాలాక్షి నగర్‌లో సాయిరాం, గిరీష్‌లను పట్టుకున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా డ్యూటీ దిగిన మరో ఇద్దరు యువతులను కూడా అరెస్టు చేశారు.

# బుకింగ్ సమయం 60 రోజులే

» రైల్వే రిజర్వేషన్ నిబంధనల్లో మార్పు

» నవంబరు 1నుంచి అమలులోకి...

విశాఖపట్నం, న్యూఢిల్లీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రైళ్లలో ప్రయాణానికి 120 రోజులు ముందుగానే బెర్తులు రిజర్వు చేసుకునే వెసులుబాటు ప్రస్తుతం అమలులో ఉంది. ఈ గడువును 60 రోజులకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిబంధన నవంబరు 1 నుంచి అమలులోకి వస్తుంది. అక్టోబరు 31 వరకు 120 రోజుల గడువుతో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రైల్వే అడ్వాన్స్ బుకింగ్ టికెట్ల వ్యవధిపై నిర్ణయాలు మార్చుకుంటూ వస్తోంది. గతంలో 120 రోజుల గడువు ఉండగా అది దుర్వినియోగం జరుగుతున్నదని ఆరోపణలు రావడంతో 60 రోజులకు కుదించారు. అది 2015 మార్చి వరకు అమలైంది. ఆ తరువాత మళ్లీ 120 రోజులకు పెంచారు. ఇది సుదీర్ఘంగా తొమ్మిదేళ్లు నడిచింది. ఈ నెలాఖరుతో దీనిని కూడా కుదించి, నవంబరు ఒకటో తేదీ నుంచి మళ్లీ 60 రోజులకే పరిమితం చేస్తున్నారు.

### ఎందుకంటే...?

120 రోజులు ముందుగా టికెట్లు బుక్ చేసుకుంటున్న వారు ఆ తర్వాత ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. కాన్సిలేషన్ 21 శాతం వరకూ ఉంటోంది. సీట్లు, బెర్తులు వృథా అవుతున్నాయి. అవసరమైనవారు ఉపయోగించుకోలేకపోతున్నారు. మరో 5 శాతం అయితే ఆఖరు వరకు టికెట్ ఉంచుకొని రైలు ఎక్కడం లేదు. ఇలాంటి సందర్భాల్లో అవకతవకలు జరుగుతున్నాయి. ఎవరైతే రాలేదో... వారికి బదులు వేరే వారిని పంపిస్తున్నారు. వారి వివరాలు రైల్వే వద్ద ఉండడం లేదు. ప్రమాద ఘటనలు, నేరాలు జరిగినపుడు వారిని గుర్తించడం కష్టమవుతోంది. రైల్వే అధికారులు కూడా ప్రయాణికులు గైర్హాజరైతే ఆ బెర్తు లేదా సీటును అధికారికంగా చూపించకుండా వేరొకరికి ఇచ్చి డబ్బులు జేబులో వేసుకుంటున్నారు. తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే రైళ్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. 120 రోజుల సమయం ఉండడంతో ఆయా రైళ్లలో కొందరు ముందుగానే టికెట్లు బ్లాక్ చేసి పెట్టుకొని ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. బుకింగ్ గడువు కుదించడం వల్ల నిజమైన ప్రయాణికులు టికెట్లు తీసుకునే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. తక్కువ వ్యవధి ఉండడం వల్ల కాన్సిలేషన్లు తగ్గే అవకాశం ఉంది.

# తీరం దాటిన వాయుగుండం

» కోస్తా, సీమల్లో విస్తారంగా వర్షాలు

» పలుచోట్ల భారీ నుంచి అతి భారీగా..

» మరో 4 రోజులపాటు వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)





నంద్యాల జిల్లా మాకినేనిపల్లెలో నీటమునిగిన వరి, నందికొట్కూరు మండలం వడ్డెమానులో నీటిలో తేలుతున్న ఉల్లిపంట

నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం గురువారం తెల్లవారుజామున చెన్నైకు ఉత్తరాన తీరం దాటింది. రాష్ట్రానికి ముప్పు తప్పిపోయింది. తర్వాత అది ఉత్తర తమిళనాడు దిశగా పయనించి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. గురువారం రాత్రికి అల్పపీడనంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు కోడూరులో 14, పుల్లంపేటలో 10, విశాఖపట్నం, పెనుకొండలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### పలుచోట్ల భారీ వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో నంద్యాల, కర్నూలు జిల్లాల్లో గురువారం విస్తారంగా వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద ఉధృతి తగ్గలేదు. అడ్డవాగు పొంగి ప్రవహించి పంటలు నీట మునిగాయి.. సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న తడిసి మొలకలు వచ్చింది. చాగలమర్రి, తోడెండ్లపల్లె, మల్లేవేముల గ్రామాల్లో ఎనిమిది మట్టిమిద్దెలు కూలిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలంలోని మల్లెంపల్లి వద్ద వంగపేరు నది ఉధృతంగా ప్రవహించింది. కొడపగానిపల్లి సమీపంలోని సత్యసాయి పంప్‌హౌస్ వద్దగల బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ధర్మవరంలోని సంజయ్‌నగర్‌లో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో అత్యధికంగా 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కళింగపట్నం, బందరువానిపేట, బారువ, ఇద్దివానిపాలెం ప్రాంతాల్లో భారీ ఎత్తున కెరటాలు ఎగిసిపడ్డాయి. ఇద్దివానిపాలెంలోకి సముద్రపునీరు వచ్చేసింది.



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ అలకవారివీధిలో సముద్ర కెరటాల ధాటికి కూలిన ఇళ్లు

### పశ్చిమలో ముందుకొచ్చిన సముద్రం

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం చినలంక, పీఎం లంక వద్ద 50 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. ఒడ్డున వున్న కొబ్బరి తోటలు, సరుగుడు తోటల్లోకి నీరు చేరింది. అలల హోరుకు ప్రజలు భయందోళన చెందారు. గురువారం మధ్యాహ్నం వరకు తీర ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. విశాఖ నగరంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ వర్షం కురిసింది. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం ప్రకటించింది. 19న రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## వణుకుతున్న ఉప్పాడ తీరం

» కెరటాల తాకిడికి దెబ్బతిన్న బీచ్ రోడ్డు

» ఇబ్బందిపడుతున్న వాహనదారులు

» తీరంలో కోతకు గురవుతున్న ఇళ్లు

» ఇళ్లలోకి వచ్చిపడుతున్న నీరు

కొత్తపల్లి, అక్టోబరు 17: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి తీవ్రంగా ఉంది. తీరంలో గురువారం సాయంత్రం నుంచి ఈదురుగాలులు పెరిగాయి. రెండు మూడు మీటర్ల ఎత్తున కెరటాలు ఎగిసిపడుతున్నాయి. బీచ్‌రోడ్డులో విద్యుత్‌ప్లాంటు సమీపంలో చిన్న వంతెనపై అలలు ఎగసిపడుతున్నాయి. కెరటాల ధాటికి తారురోడ్డుపై కంకరరాళ్లు పైకి తేలాయి. బీచ్‌రోడ్డులో ప్రయాణానికి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. తీరంలోని మత్స్యకారుల గృహాలు సముద్ర కెరటాల ధాటికి అల్లాడుతున్నాయి. కెరటాల తాకిడికి కొన్ని ఇళ్లు కోతకు గురికాగా, మరికొన్ని ఇళ్లలోకి నీరు వచ్చిపడుతోంది.

## 22న మరో అల్పపీడనం

విశాఖపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తా, ఒడిశాకు మరో తుఫాన్ ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఈ నెల 23వ తేదీ తర్వాత ఏర్పడే తుఫాన్/తీవ్ర వాయుగుండం ఉత్తర కోస్తా, ఒడిశా దిశగా వస్తుందని అంచనా వేస్తున్నారు. గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్ నుంచి వచ్చే ఉపరితల ఆవర్తనం ఈ నెల 20న ఉత్తర అండమాన్ సముద్రంలో ప్రవేశిస్తుంది. దీని ప్రభావంతో ఈ నెల 21 లేదా 22న తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది 23 లేదా 24న తీవ్ర వాయుగుండం/తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని, ఒడిశా తీరం దిశగా పయనిస్తుందని కొందరు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం తీర ప్రాంత జిల్లాలను అప్రమత్తం చేసింది. ఒడిశాకు ఆనుకుని ఉన్న ఉత్తర కోస్తా జిల్లాలపై ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే కొన్ని మోడళ్ల ప్రకారం చూస్తే మధ్య బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం బలపడి పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ దిశగా వెళ్లే అవకాశం ఉందని రిటైర్డు వాతావరణ అధికారి ఒకరు పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వస్తుందని చెప్పారు.



అనంతపురంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, కాల్వ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు తదితరులు

## వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడం టీడీపీతోనే సాధ్యం

» టీడీపీ హయాంలోనే దీనిపై శాస్త్రీయ అధ్యయనం

» వైసీపీ అధికారంలోకి వచ్చి దానిని నాశనం చేసింది: మంత్రి సవిత

» అనంతలో ఘనంగా రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం టీడీపీతోనే సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శాస్త్రీయ అధ్యయనం చేయిస్తే... 2019 అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దానిని నాశనం చేశారని మండిపడ్డారు. అనంతపురంలో గురువారం రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత పాతూరు పవర్ ఆఫీస్ సర్కిల్లోని వాల్మీకి విగ్రహానికి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషివల్లే వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై అసెంబ్లీలో చర్చించి, కేంద్రానికి పంపారని తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసికట్టుగా కృషి చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

### సర్వప్రజానీకానికి మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి: సీఎం

మూల రామాయణ రచయిత మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని లోకానికి చాటిన మహా పురుషుడు వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్నందుకు సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా తెలిపారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే సౌమ్య, పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, శ్రీరాంచినబాబు, దూండీ రాకేష్ తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు.

## సీఎం సహాయనిధికి దాతల విరాళాలు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు మంత్రి నారా లోకేశ్‌కు గురువారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్‌ను దాతలు కలిసి, విరాళాల చెక్కులు అందజేశారు. కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన సాయితేజ విద్యానికేతన్ యాజమాన్యం రూ.4.25లక్షలు, దుగ్గిరాల వన్ సేవా ట్రస్ట్ ప్రతినిధులు రూ.2.50లక్షలు, విశాఖపట్నానికి చెందిన దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వీసీ డి.సూర్యప్రకాశరావు రూ.2,06.782 ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేశారు.


## జగన్ పత్రికపై కేసు నమోదు

విజయవాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రికపై విజయవాడ పటమట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. హైకోర్టు న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ చేసిన ఫిర్యాదుపై ఈ కేసును నమోదు చేశారు. రాష్ట్రంలో ప్రజల మధ్య అశాంతిని రెచ్చగొట్టేలా జగన్ మీడియాలో కథనాలు ప్రచురిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై బీఎన్ఎస్ 196(ఎ), 353(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# పారిశ్రామికవేత్తలకు రెడ్‌కార్పెట్ స్వాగతం

- ఇది వ్యాపార అనుకూల, స్నేహపూర్వక ప్రభుత్వం
- ఇంతకంటే మంచి తరుణం రాదు: చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీలో పెట్టుబడులు పెట్టాలంటూ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్ పరిచి స్వాగతం పలుకుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన 'ఎక్స్‌'లో పోస్టు పెట్టారు. 'ఏపీలో ఇప్పుడు వ్యాపార అనుకూల, స్నేహపూర్వక ప్రభుత్వం ఉంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులైన యువత, బలమైన మానవ వనరులు మీ కోసం ఎదురు చూస్తున్నాయి. రాష్ట్రంలో వ్యాపారాలు, వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా పారిశ్రామిక రంగానికి చెందిన అనుభవజ్ఞులతో సంప్రదింపులు జరిపి తయారు చేసిన అత్యుత్తమ పారిశ్రామిక పాలసీలూ సిద్ధంగా ఉన్నాయి. ఏపీలో వ్యాపార కార్యకలాపాలకు అనువుగా దేశంలోనే ది బెస్ట్ బిజినెస్ ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నాం. పెట్టుబడిదారులకు ఏపీ స్వర్గధామంగా నిలుస్తుంది. పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది. మా రాష్ట్రమూ అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో మీ వ్యాపారాభివృద్ధికి ప్రతి అడుగులోనూ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని నేను వ్యక్తిగతంగా మీకు హామీ ఇస్తున్నాను. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ లేదు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోనూ పెట్టుబడులు పెట్టడానికి ఇంతకంటే మంచి తరుణం ఎప్పుడూ రాదు. పారిశ్రామిక వృద్ధి ప్రయాణంలో మాతో సహకరించండి. ఏపీలో పెట్టుబడుల కోసం మేం ఎదురు చూస్తున్నాం' అని ట్వీట్ చేశారు.



# కొత్త పారిశ్రామిక విధానాలు భేష్

- ఇవి దేశంలోనే అత్యద్భుతమైన విధానాలు
- పరిశ్రమల సమాఖ్య ప్రతినిధుల ప్రశంసలు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పారిశ్రామిక విధానాలు పరిశ్రమలకు ఊతమిచ్చేలా ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ ఛాంబర్స్) ప్రతినిధులు కొనియాడారు. దేశంలోనే అత్యద్భుతమైన విధానాలను రూపొందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, కార్యదర్శులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం విజయవాడలోని ఏపీ ఛాంబర్స్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ పెట్టుబడుల ఆకర్షణకు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త పారిశ్రామిక పాలసీలు దోహదపడతాయని చెప్పారు. కొత్త పాలసీలతో పారిశ్రామికవేత్తలకు చేకూరే ప్రయోజనాలను సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామచంద్రరావు, ఏపీ ఛాంబర్స్ ఎనర్జీ కమిటీ వైస్ చైర్మన్ ఫణిచంద్ర, అఫిలియేట్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్ రాధిక, ఛాంబర్స్ బోర్డు సభ్యురాలు అపర్ణ వివరించారు. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ఆరు నూతన పారిశ్రామిక పాలసీల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడిదారులకు భారీ ప్రోత్సాహకాలు ప్రకటించడం ప్రశంసనీయమన్నారు. ఈ పాలసీల అమలుకు ఉత్తర్వులు జారీ చేసి, మార్గదర్శకాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్త పాలసీలు అమలులోకి వస్తే రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతుందని అభిప్రాయపడ్డారు.



అమరావతి సచివాలయం వద్ద తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన ఐఏఎస్‌లు

## ఏపీలో చేరిన తెలంగాణ ఐఏఎస్‌లు

- సీఎస్‌కు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చిన నలుగురు అధికారులు

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న ఏపీ కేడర్‌కు చెందిన నలుగురు ఐఏఎస్ అధికారులు ఎట్టకేలకు రాష్ట్రంలో రిపోర్ట్ చేశారు. గురువారం ఉదయం వెలగపూడిలోని సచివాలయానికి చేరుకుని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌కు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. తెలంగాణలోనే కొనసాగేందుకుగాను డీవోపీటీ ఇచ్చిన ఆదేశాలపై వీరు క్యాట్‌ను ఆశ్రయించారు. టీ హైకోర్టునూ ఆశ్రయించారు. ఎక్కడా ఊరట లభించకపోవడంతో ఐదుగురు ఐఏఎస్‌లు ఏపీలో రిపోర్ట్ చేశారు. వారిలో వాణీ ప్రసాద్, వాకాటి కరుణ, డి.రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి ఉన్నారు. ఎం.ప్రశాంతి ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఆమె బుధవారం సాయంత్రమే రిపోర్ట్ చేశారు. అనంతరం సీఎం ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రను కలిశారు. వీరికి రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వనుంది.

## శ్వేతపత్రాలపై ఏం చేశారు?

- ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై వివరాలివ్వండి: సీఎం

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలపై ఇప్పటి వరకూ ఏం చర్యలు తీసుకున్నారో నివేదించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూములు, గనులు, ఆర్థికం, పరిశ్రమలు, పోలవరం, సాగునీటి రంగం, ఇంధనం, శాంతిభద్రతలు, ఎక్సైజ్, అమరావతి తదితర అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన విధ్వంసాలను వీటి ద్వారా ప్రజలకు వివరించారు. అలాగే కూటమి ప్రభుత్వం చేయబోయే కార్యక్రమాలను అందులో ప్రస్తావించారు. అయితే, ఆయా శాఖలు వాటిపై ఎలాంటి కార్యాచరణ చేపట్టాయో ఇప్పటిదాకా సర్కారుకు నివేదించలేదు. ఈ నేపథ్యంలో వెంటనే శ్వేతపత్రాలపై ఇప్పటివరకూ చేపట్టిన చర్యలు, అమలు చేసిన కార్యక్రమాలు, విచారణలు వంటి అంశాలపై వెంటనే నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖలను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# సూపర్ 6లో 2 ఫిక్స్!

(మొదటి పేజీ తరువాయి)

అంతమందికి రూ.15వేల చొప్పున ఇస్తాం!'... అని 2019 ఎన్నికల ముందు జగన్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత... పిల్లలందరికీ కాదు, తల్లికి మాత్రమే అని చెప్పారు. 15వేలలో రూ.2వేలు కోత వేశారు. గతేడాది జూనియర్ కాలేజీలు, పాఠశాలల్లో 83,15,341 మంది విద్యార్థులు ఉండగా... వారి తల్లులు 42.61లక్షల మందికి 'అమ్మ ఒడి' అమలు చేశారు. దీనికి రూ.6394 కోట్లు ఖర్చయింది. విద్యార్థుల లెక్క కాకుండా తల్లుల లెక్కన ఇస్తేనే ఇంత భారం! ఇప్పుడు... విద్యార్థులందరికీ 'తల్లికి వందనం' అమలు చేయాల్సి ఉంది. ఈ ఏడాది కూడా దాదాపు 80 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ 'తల్లికి వందనం' అమలు చేసేందుకు దాదాపు 12వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా!

### రైతుకు భరోసా ఇలా...

రాష్ట్రంలో రైతన్నలకు సంవత్సరానికి రూ.20వేలు చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని ఎన్డీయే కూటమి 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. 'సూపర్ సిక్స్‌'లో దీనిని ప్రముఖంగా ప్రస్తావించింది. 'అన్నదాతా సుఖీభవ' పథకం కింద వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రైతులకు సహాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం గత వంద రోజులుగా 'అన్నదాత-సుఖీభవ' పథకం అమలుకు విధివిధానాల రూపకల్పనకు కసరత్తు చేస్తోంది. రైతు భరోసా'లో ఉన్న లోపాలను పరిహరించి, వాస్తవ సాగుదారులను పరిగణనలోకి తీసుకుని, అటు భూ యజమానులకు, ఇటు కౌలు రైతులకు ఆసరా ఇచ్చేలా, ముఖ్యంగా సన్నచిన్నకారు రైతులకు ఆర్థిక సహాయం అందేలా పథకం రూపకల్పన జరుగుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్రం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6వేలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కలిపి, మొత్తంగా ఏటా రూ.20వేలు ఇవ్వనున్నారు. పకడ్బందీగా విధివిధానాలు రూపొందించి... మార్చి, ఏప్రిల్ నెలల్లో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

### నిధుల కటకట ఉన్నా...

జగన్ ఐదేళ్లు అమలు చేసిన అడ్డగోలు ఆర్థిక విధానాల కారణంగా ఖజానా ఖాళీ అయ్యింది. పైగా... కొండంత అప్పుల భారం మోయాల్సి వస్తోంది. పాత అప్పుల అసలు, వడ్డీ కలిపి ఏటా రూ.70వేల కోట్లు కట్టాల్సిందే. ఏం చేసినా, చేయకున్నా... పథకాలు అమలు చేసినా, చేయకపోయినా దీనికి మాత్రం మినహాయింపు ఉండదు. జగన్‌లాగా అడ్డగోలు అప్పులు చేస్తే తప్ప భారీగా సొమ్ములు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ప్రస్తుతం ఎఫ్ఆర్‌బీఎంకు లోబడి కేంద్రం అనుమతించిన అప్పులు మాత్రమే చేస్తున్నారు. జగన్ సర్కారులో చేసినట్లుగా... కార్పొరేషన్ల ఆదాయాలు తాకట్టు పెట్టడం, ప్రభుత్వ ఆస్తులు విక్రయించడం వంటి అక్రమ విధానాల్లో అప్పులు తేవడం లేదు. ఈ నేపథ్యంలోనే తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలకు నిధులు సమకూర్చడం ఇబ్బందిగా మారింది. చంద్రబాబు సారథ్యంలో జూన్‌లో కూటమి సర్కారు ఏర్పడింది. అప్పటి నుంచి పాలనా యంత్రాంగాన్ని గాడిలో పెట్టడంలో చంద్రబాబు నిమగ్నమయ్యారు. వరుస సమీక్షలతో ఆర్థిక పరిస్థితి అంచనా వేస్తున్నారు. ఈలోపు... వరదలు, సహాయ, పునరావాస చర్యలకే నెల గడిచిపోయింది. ఈ కారణంగా పథకాల అమలులో జాప్యం చోటుచేసుకుందని చెప్తున్నారు. మరోవైపు... జగన్ 2019 మేలో అధికారం చేపట్టి... 2020 జనవరిలో 'అమ్మ ఒడి' అమలు మొదలుపెట్టారని టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు.

### నాడు కొందరికే భరోసా..

రైతులకు సాయం అందిస్తామని హామీ ఇచ్చి 2019మే చివరిలో జగన్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ఆరు నెలలకుగానీ రైతు భరోసాను ఇవ్వలేదు. ఖరీఫ్ సీజన్ ముగిశాక మొదటి విడత పెట్టుబడి సాయాన్ని 2019 అక్టోబరు15న ప్రారంభించారు. రైతు భరోసా కింద ఏటా రూ.12,500 ఇస్తామని ప్రకటించారు. ఆ తర్వాత రూ.13,500 ఇస్తామని ప్రకటించారు. కానీ... అప్పటికే కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకాన్ని అనుసంధానం చేసి, కేంద్రం ఏటా ఇస్తున్న రూ.6వేలతో కలిపి, మొత్తంగా రూ.13,500 ఏడాదిలో మూడు కిస్తీలుగా చెల్లించారు. దీనికీ సవాలక్ష ఆంక్షలు ఉండేవి. కేవలం భూ యజమానులకే పెట్టుబడి సాయం అందించారు.

### జగన్ 'కోతలు'

గత ప్రభుత్వం ఒక్కో తల్లికి రూ.15వేలు అని ప్రచారం చేసినా... వాస్తవంగా ఇచ్చింది రూ.13వేలు మాత్రమే. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ నిధి కింద రూ.వెయ్యి, పాఠశాలల నిర్వహణ నిధి కింద మరో రూ.వెయ్యి కోత పెట్టారు. దీంతో ఇప్పుడు ఆ కోతలను ఏం చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. గత ప్రభుత్వం రెండు వేలు కోత పెట్టినందున మొత్తంగా ఒక రూ.వెయ్యి మినహాయించుకుని ఇద్దామా? అనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

### వైసీపీ విన్యాసాలు...

అమ్మఒడి పథకం అమలుపై వైసీపీ ప్రభుత్వం అనేక విన్యాసాలు చేసింది. ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలుచేయకుండా కోతలు పెట్టడంతో పాటు తేదీలు నచ్చినట్లు మార్చుకుని ఒక ఏడాది ఈ పథకాన్ని ఎగరగొట్టింది. 2019 మేలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆ వెంటనే విద్యా సంవత్సరం ప్రారంభమైనా అప్పుడు నగదు విడుదల చేయలేదు. జనవరిలో సంక్రాంతి సమయంలో మొదటి ఏడాది అమ్మఒడి నగదు విడుదల చేసింది. అలా రెండేళ్లు సంక్రాంతికి అమ్మఒడి ఇచ్చింది. ఆ తర్వాత విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలో ఇస్తామంటూ... నగదు విడుదల సమయాన్ని జూన్‌కు మార్చింది. దీంతో ఒకేసారి ఏడాదిన్నర గ్యాప్ వచ్చింది. ఆ ఫలితంగా ఐదేళ్లలో నాలుగుసార్లే అమ్మఒడి పథకం నగదు తల్లులకు అందింది.

## 'సాములోరి'పై సీఎం ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కార్యాలయాన్ని ఆదేశించారు. జగన్ సర్కారు శారదా పీఠానికి కారు చౌకగా భూమి కేటాయించిన వైనం... దానిని రద్దు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశించినా సదరు ఫైలును వెనక్కి పంపించిన తీరుపై 'సాములోరికే ఎరుక!" శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ వార్త అధికార వర్గాల్లో కలకలం రేపింది. స్వయంగా సీఎం ఆదేశంతో కదిలిన ఫైలును ఎవరు వెనక్కి పంపించారు? అంతటి దుస్సాహసం చేసిన వారెవరనే చర్చ ఇటు ప్రభుత్వంలో, అటు టీడీపీలో జోరుగా సాగింది. సోషల్ మీడియాలో చర్చోపచర్చలు సాగాయి. ఈ వార్తపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించారు. "శారదా పీఠం ఫైలు ఎందుకు వెనక్కి పంపించారు? అసలు ఏం జరిగింది? ఇప్పటి వరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదు? వార్తలోని అంశాలు నిజమేనా?" అంటూ తన కార్యాలయం అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. 'ఆంధ్రజ్యోతి' వార్తలో ప్రస్తావించిన అంశాలు 100 శాతం నిజాలేనని సీఎంవో అధికారులు నివేదించినట్లు తెలిసింది. "సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ శారదా పీఠం భూ కేటాయింపులపై సకాలంలో అధ్యయనం చేసింది. భూ కేటాయింపుల్లో నిబంధనల ఉల్లంఘన జరిగింది. రూ.225 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.15 లక్షలకే కేటాయించారు. పైగా... ఆధ్యాత్మిక అవసరాలకు కాకుండా, ఆదాయార్జనకు అనుమతించారని ఆ శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో భూ కేటాయింపు ఉత్తర్వులను రద్దుచేయాలని ప్రతిపాదిస్తూ రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి పంపించింది. అక్కడే ఫైలు పెండింగ్‌లో ఉంది. ఇటీవలే పలు కారణాలను చూపించి ఫైలు వెనక్కి పంపించారు" అని సీఎంవో అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఫైలును ఎలా వెనక్కి పంపిస్తారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కూడా సీఎం మాట్లాడినట్లు తెలిసింది. భూ కేటాయింపు రద్దు ప్రతిపాదన అమలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

# వైసీపీ నేతలు ఆదేశిస్తేనే తిట్టా!

- తిట్టినవాళ్ల కాళ్లు పట్టుకొని క్షమాపణ అడుగుతా
- అప్రూవర్‌గా మారతా.. పోలీసుల వద్ద కన్నీరుపెట్టుకున్న బోరుగడ్డ అనిల్
- రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

గుంటూరు,అక్టోబరు 17: వైసీపీ నాయకులు రెచ్చగొట్టి, ప్రతిపక్షాలను తిట్టాలని ఆదేశించడం వల్లే ఆనాడు దూషించాల్సి వచ్చిందని పోలీస్ అధికారుల వద్ద రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ మొరపెట్టుకున్నట్లు తెలిసింది. 'నీవు దళితుడివి...నీకు పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుంది.. టీడీపీని తిడితే మేం అండగా ఉంటాం...' అని నాడు ప్రోత్సహించిన వారు.. నేడు ఒక్కరు కూడా పరామర్శకు రాలేదని వాపోయినట్టు సమాచారం. "ఆ రోజు అలా తిట్టడం తప్పే. ఎవరినైతే సోషల్ మీడియాలో తిట్టానో వారందరి కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరుతాను. అప్రూవర్‌గా మారతాను" అని వేడుకొన్నట్టు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతిపక్ష పార్టీల ముఖ్యనేతల నుంచి క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళల వరకు.. అందరినీ అసభ్య పదజాలంతో దూషించిన బోరుగడ్డ అనిల్ కుమార్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఏఈఎల్‌సీ చర్చి వివాదం కేసులో అనిల్‌ను గురువారం పోలీసులు గుంటూరు కోర్టులో హాజరుపరచగా, 29వరకు రిమాండ్ విధించారు. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని మేజిస్ట్రేట్ ఆదేశాలు ఇచ్చారు. కాగా, ఈ కేసును విచారిస్తున్న పోలీసుల వద్ద అనిల్ కన్నీరు మున్నీరైనట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పోలీసు అధికారులు ఏది అడిగినా అనిల్ దాచుకోకుండా సమాధానమిచ్చారు. "నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చగొట్టేలా మాట్లాడారు. దానికితోడు వైసీపీ నాయకులు.. నన్ను ముందుకు నెట్టి తాము వెనుక ఉన్నారు. నాటి మంత్రి మోపిదేవి వెంకటరమణ, ఆయన సోదరుడితో పాటు గుంటూరు నగర వైసీపీ అధ్యక్షుడు అప్పిరెడ్డి ఆదేశానుసారమే నాటి విపక్ష నేతలను దూషించాను. బెదిరింపులకు పాల్పడ్డాను" అని తెలిపారు. ఇన్నాళ్లు ఢిల్లీలో కేంద్రమంత్రి రాందాస్ అథావాలే వద్ద ఉన్నానని, తన తల్లికి సర్జరీ చేయించడం కోసం గుంటూరుకు వచ్చానని అనిల్ పేర్కొన్నారు.

### ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అనిల్‌పై చర్యలు

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ ఆగడాలపై బాధితులు ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. "అనిల్ కుమార్ తనకు తాను రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా చెప్పుకొంటున్నారు. దీనిపై అనేక వివాదాలు ఉన్నాయి. వర్ట్ అకాడమీ(యూకే) పేరుతో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. 2018లో అనంతపురం టౌన్‌లో ఐఏఎస్ అధికారినని చెప్పి మోసం చేసిన కేసులో అనిల్ జైలుకెళ్లారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అనిల్ రెచ్చిపోవడం మొదలుపెట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషించేవారు. ఆయనపై ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 17 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అనిల్‌ను పోలీస్ కస్టడీ తీసుకొని పూర్తిస్థాయిలో విచారించాల్సిన అవసరం ఉంది. ఆయన వెనుక అదృశ్య శక్తులు ఎవరైనా ఉన్నారా గుర్తించాల్సిఉంది" అని ఎస్పీ వివరించారు.

# ..దాడి తప్పు కాదట!



మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరై వస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

గురువారం మధ్యాహ్నం 3.30గంటలకు మంగళగిరి పోలీసుల ముందు విచారణకు సజ్జల హాజరయ్యారు. సాయంత్రం 5.15వరకూ, అంటే 1.45గంటల పాటు పోలీసుల ప్రశ్నలను ఎదుర్కొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ నేత దేవినేని అవినాశ్, న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. పోలీసులు సజ్జలను మాత్రమే దర్యాప్తు అధికారి వద్దకు అనుమతించారు. 2021 అక్టోబరు 19న టీడీపీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన మంగళగిరి పోలీసులు, పలు కీలక విషయాలను రాబట్టారు. మొత్తం దాడికి కుట్ర తాడేపల్లిలో జరిగిందని, మార్గదర్శకుడు సజ్జల రామకృష్ణా రెడ్డేనని ఆధారాలు సేకరించారు. 120వ నిందితుడిగా పేరు చేర్చి విచారణకు సజ్జలను పిలిచారు. నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, దర్యాప్తు అధికారి వై.శ్రీనివాసరావు.. ఆయనను విచారించారు. మొత్తం 38ప్రశ్నలు సంధించగా, అందులో ఎక్కువ ప్రశ్నలకు 'నాకు తెలీదు.. నేను ఇక్కడ లేను.. నాకెలాంటి సంబంధం లేదు' అనే జవాబులు ఇచ్చారు. మరికొన్నింటికి నిర్లక్ష్యంగా బదులిచ్చారు.

### విచారణకు సహకరించలేదు: దర్యాప్తు అధికారి

సజ్జల విచారణకు ఏమాత్రం సహకరించలేదని దర్యాప్తు అధికారి అయిన సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఎక్కువ ప్రశ్నలకు.. తనకు తెలియదు, సంబంధం లేదు అని మాత్రమే చెప్పారన్నారు. సీసీ ఫుటేజీలు, గతంలో అరెస్టయిన నిందితుల వాంగ్మూలం, సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ప్రశ్నించినా.. సజ్జల తోసిపుచ్చారని పేర్కొన్నారు. సెల్ ఫోన్ స్వాధీనం చేసేందుకు నిరాకరించారని చెప్పారు. మరికొద్ది రోజుల్లో కేసును సీఐడీకి బదిలీ చేయనున్నామని వెల్లడించారు.

### పోలీసుల ప్రశ్నలు.. సజ్జల జవాబులు

? పోలీసులు: ఎలా ఉన్నారు.?

సజ్జల: స్టేషన్‌కు విచారణకు పిలిచి ఎలా ఉన్నానంటే ఏమని చెప్పాలి.

? టీడీపీ ఆఫీసుపై దాడి గురించి మీకు ఏం తెలుసు.?

సజ్జల: నాకేమీ తెలీదు. ఆ రోజు ఇక్కడ లేను. బద్వేలులో ఉన్నా..

? దాడుల్లో పాల్గొన్నవారిని మీరే కో ఆర్డినేషన్ చేసినట్లు మాకు సమాచారం ఉంది.

సజ్జల: అవన్నీ తప్పు. కడప జిల్లా బద్వేలులో ఉన్నా.. మీరు ఇక్కడ ఉన్నట్లు చెబితే ఎలా..

? కేసు విచారణలో మాకు మీ పాత్రపై ఆధారాలు లభించాయి..

సజ్జల: ఏవీ ఉండే చూపించండి..

? ఆ రోజు లేళ్ల అప్పిరెడ్డి(నిందితుడు)తో ఫోనులో ఏం మాట్లాడారు?

సజ్జల: మూడేళ్లక్రితం జరిగిన వాటి గురించి ఏమి గుర్తుంటుంది.

? దాడులకు వ్యూహరచన, దిశానిర్దేశం చేశారా?

సజ్జల: అవన్నీ తప్పుడు ఆరోపణలు. రాజకీయ దురుద్దేశంతోనే నా పేరు చేర్చారు.

? మీ ఫోను ఇవ్వండి.. పరిశీలించాలి.

సజ్జల: ఇవ్వను.. ఇది అప్పటి ఫోను కాదు..

? అప్పుడు వాడిన ఫోను తెచ్చిస్తారా.?

సజ్జల: ఇప్పటివరకు దగ్గరే పెట్టుకుంటామా?

? దాడి గురించి మీకు ఎప్పుడు తెలిసింది..

సజ్జల: టీవీల్లో చూసి మా ఆఫీసుకు ఫోను చేశా. (నాటి)సీఎం గారిని పట్టాభి (టీడీపీ నేత) తిట్టారనే ఉద్రేకంతో మనోళ్లు టీడీపీ ఆఫీసుపై దాడి చేశారని చెప్పారు.

? దాడులు తప్పని మీరు చెప్పలేదా?

సజ్జల: ఆ తిట్లు విన్నాక రక్తం మరిగిపోయింది.. దాడి తప్పు అనిపించలేదు.

### పొన్నవోలు ఓవరాక్షన్

సజ్జలతో తనను కూడా లోనికి అనుమతించాలని న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్‌కు వేలు చూపించి మరీ బెదిరించారు. 'మేం అధికారంలోకి వచ్చాక మీ అంతు తేలుస్తాం' అంటూ తీవ్రంగా హెచ్చరించారు.

### నాటి సుద్దులేవి సజ్జల?

"దర్యాప్తు సంస్థలు ఒక వ్యక్తిమీద కచ్చితమైన ఆధారాలున్నప్పుడు కచ్చితంగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం సహజం. ఇందులో రాజకీయ దురుద్దేశాలున్నాయంటూ ప్రచారం చేయడం సరికాదు"... స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నాడు ప్రతిపక్ష నేత చంద్రబాబు అక్రమ అరెస్టును సమర్థిస్తూ సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలివి. అయితే, టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో తాను ఇప్పుడు విచారణను ఎదుర్కోవాల్సి వచ్చేసరికి ఆ సుద్దులన్నీ తారుమారైపోయాయి. గురువారం విచారణ అనంతరం ఆయన దీనికి భిన్నంగా మీడియా వద్ద మాట్లాడారు. "ప్రతిపక్షం లేకుండా చేయాలని టీడీపీ ప్రభుత్వం భావిస్తోంది" అన్నారు.

# వైసీపీలో 'బోరుగడ్డ' రచ్చ!

- పరామర్శకు జగన్ వస్తున్నారని ప్రచారం
- సోషల్ మీడియాలో మెసేజ్ వైరల్
- పరువు పోతుందని అడ్డుకున్న నేతలు
- ఐదేళ్లలో అనిల్ లెక్కలేనన్ని అరాచకాలు

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఎన్నో అరాచకాలకు పాల్పడి, ఎట్టకేలకు అరెస్టయిన బోరుగడ్డ అనిల్‌ను పరామర్శించేందుకు జగన్ వస్తున్నారన్న వార్త ఆ పార్టీలో దుమారం రేపింది. నల్లపాడు పోలీస్‌స్టేషన్ వద్దకు జగన్ వచ్చి ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు గురువారం ఉదయం సోషల్ మీడియాలో ఆ పార్టీ వారు పెట్టిన మెసేజ్ వైరలైంది. దీంతో పార్టీ ప్రతిష్ఠ మరింత దిగజారుతుందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అనిల్ విచ్చలవిడిగా వ్యాఖ్యలు చేయటం, దందాలు చేసినప్పుడే పార్టీ నుంచి సస్పెండ్ చేసుంటే బాగుండేదనే భావన కూడా ముఖ్యనేతల్లో ఉంది. అనిల్‌ను పరామర్శించేందుకు జగన్ రావటం ఇష్టం లేని ఓ ముఖ్యనేత చొరవతో జగన్ పర్యటన ఆగిపోయినట్టు ప్రచారం జరిగింది.

### ఎన్నెన్నో అరాచకాలు

గుంటూరు నగరానికి చెందిన బోరుగడ్డ అనిల్ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా అరాచకాలకు పాల్పడ్డాడు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. జగన్ మెప్పు పొందేందుకు నోటికి అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడాడు. ఏకంగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను సైతం టార్గెట్ చేసి విమర్శలు చేసిన సందర్భాలున్నాయి. తమ నేత జగన్ ఆదేశిస్తే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను చంపుతానని తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. పొన్నూరు నియోజకవర్గం చేబ్రోలు మండల టీడీపీ మాజీ కన్వీనర్ నన్నపనేని కోటేశ్వరరావు జగన్‌ను తిట్టిన వీడియో నాడు సోషల్ మీడియాలో రావడంతో కోటేశ్వరరావు ఇంటికి వెళ్లి చంపేస్తానని అనిల్ బెదిరించాడు. పలుమార్లు ఫోన్ చేసి ఆయన భార్య, కుమార్తెను బూతులు తిట్టాడు. ఆ మనోవేదనతో కోటేశ్వరరావు కొద్ది రోజులకే గుండెపోటుకు గురై మరణించారు.

## ఏపీలో ప్రజాభీష్టం మేరకే టీడీపీ గెలుపు


- హరియాణాలో అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ఓడింది
- చంద్రబాబు చెప్పిన జాబ్ ఫస్ట్ కాన్సెప్ట్‌ను స్వాగతిస్తున్నాం
- జగన్ హయాంలో తాడేపల్లి కేంద్రంగా లిక్కర్ మాఫియా
- ఇప్పుడు ఆ మాఫియా నియోజకవర్గాలకు మారింది
- ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం ఇవ్వండి: షర్మిల



అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాభీష్టం.. ప్రజానాడి మేరకే తెలుగుదేశం పార్టీ గెలిచిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చెప్పారు. హరియాణాలో మాత్రం ప్రజానాడికి విరుద్ధంగా కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. విజయవాడ ఏపీసీసీ కార్యాలయంలో గురువారం షర్మిల మీడియాతో మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు, ప్రజానాడికి భిన్నంగా హరియాణాలో బీజేపీ గెలిచిందని, దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు పారిశ్రామిక పాలసీలలో జాబ్ ఫస్ట్ అనే కాన్సెప్ట్‌తో ముందుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని షర్మిల స్వాగతించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడాన్ని ఆహ్వానించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మూడు లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారని చంద్రబాబును నిలదీశారు. నిరుద్యోగ సమస్యపై కూటమి ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జగన్ జమానాలో తాడేపల్లి కేంద్రంగా లిక్కర్ మాఫియా నడిచిందని, ఇప్పుడు నియోజకవర్గాల వారీగా తమ్ముళ్లు లిక్కర్ మాఫియాను నడుపుతున్నారని, ఈ విషయంలో జగన్, చంద్రబాబు ఒకేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

## మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోవడానికైనా సిద్ధం

- అబద్ధాలు చెప్పబోం... నెరవేర్చలేని హామీలు ఇవ్వం
- ఇంట్లో కూర్చుంటే కుదరదు... చొరవ చూపాల్సిందే: జగన్



అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో కూర్చోవడానికైనా సిద్ధమే కానీ అబద్ధాలు చెప్పబోనని వైసీపీ అధ్యక్షుడు జగన్ ప్రకటించారు. నెరవేర్చలేని హామీలను భవిష్యత్తులోనూ ఇవ్వబోనన్నారు. గురువారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. జగన్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఇంట్లో కూర్చుంటే ఏమీ జరగదని, చొరవ తీసుకొని ప్రజలతో మమేకం కావాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కమిటీలు వేస్తామని చెప్పారు గ్రామస్థాయి నుంచి వ్యవస్థీకృతంగా పోరాడదామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దారుణమైన పరిపాలన సాగుతోందన్నారు. ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూసి ఉండమని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందా అని ప్రశ్నించారు.

## మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చారు: నారాయణ

- కూటమి విధానం కొత్త సీసాలో పాత సారా అంటూ విమర్శ

విజయవాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వాలు మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా మార్చుకుంటున్నాయి. అటువంటి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్టదు' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. గురువారం ఆయన విజయవాడలోని ఓ మద్యం దుకాణానికి వెళ్లారు. ధరలపై వాకబు చేశారు. రూ.99 మద్యం గురించి అడిగారు. ఆ మందు ఇంకా మార్కెట్లోకి రాలేదని సిబ్బంది చెప్పారు. ఈ సందర్భంగా నారాయణ మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వ విధానం కొత్త సీసాలో పాత సారా అన్నట్టుగా ఉంది. గత ప్రభుత్వంలో అన్ని కేంద్రీకృతమయ్యాయి. అసలు తాగించడం ఎందుకు? తర్వాత దాన్ని మాన్పించడానికి రిహాబిలిటేషన్ సెంటర్ ఎందుకు?' అని నారాయణ నిలదీశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


మన విశ్వం చిత్రాన్ని చూసి ఆనందించి రోజు రోజుకు కలెక్షన్లు పెంచుతూ,
అఖండ విజయాన్ని సమకూరుస్తూ, అండగా నిలబడిన తెలుగు ప్రేక్షకుల
కుటుంబాలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ... మీ విశ్వం
BLOCKBUSTER
people MEDIA FACTORY
CHITRALAYAM
2ND WEEK
SRI TIRUMALA TIRUPATI VENKATESWARA FILMS
ENTERTAINER
MACHO STAR
GOPICHAND
IN
A SREENU VAITLA FILM
విశ్వం
T G VISHWA PRASAD VENU DONEPUDI
VIVEK KUCHIBHOTLA KONDAL JINNA KRITHI PRASAD K.V. GUHAN
CHAITAN BHARADWAJ GOPI MOHAN BHANU - NANDU PRAVEEN VARMA AMAR REDDY KUDUMULA KIRAN KUMAR MANNE
RAVI VERMA KOLLI SUJITH KUMAR ADITYA CHEMBOLU KONGARAPI RAMBABU VAMSI SHEKAR
TIPS TELUGU